thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 155 కరీంనగర్ బుధవారం, 13 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝాంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.



# పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి పెట్టిన తెలుగు రాష్ట్రాలు!

## ఫోర్త్ సిటీ కేంద్రంగా డ్రై పోర్టు..! బందర్ పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే!

హైదరాబాద్/అమరావతి : తెలుగు రాష్ట్రాలు పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి సారించాయి. అందుకు అనుగుణంగా ఎగుమతి, దిగుమతులకు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో తయారయ్యే, ఉత్పత్తి అయ్యే వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన డ్రై పోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. పారిశ్రామిక వేత్తలు సులువుగా ఇక్కడి నుంచి ఎగుమతులు చేసేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాలని భావిస్తున్నది. డ్రై పోర్టు ప్రతిపాదన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నానుతూనే ఉంది. అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు అనేక మార్లు దీని గురించి చెప్పినా ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఈ సమస్య తీవ్రతను గుర్తించి డ్రై పోర్టు పనులు ప్రారంభమయ్యే విధంగా ప్రణాళిక రచించారు. డ్రై పోర్టుకు పెద్ద ఎత్తున భూమి అవసరం ఉండటంతో అందుకు ఫోర్త్‌సిటీని ఎంపికచేశారు. అక్కడ ఎంత భూమి అవసరం ఉంటుందనేది శాస్త్రీయంగా అంచనా వేసి అధికారులు నివేదిక ఇవ్వగానే దానికి అవసరమైనంత భూమిని కేటాయించనున్నారు. అనంతరం పనులు ప్రారంభించేలా ఆదేశాలు వెలువడనున్నాయి.

**ఆలస్యం కాకుండా..** రాష్ట్రంలో డ్రై పోర్టు ఆలస్యం కావడానికి వీల్లేదని సీఎం ఇప్పటికే అధికారులను ఆదేశించారు. పారిశ్రామికంగా పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం, అంతర్జాతీయ ఎగుమతులు పెరగడానికి డ్రై పోర్టులు ఎంతో అవసరం అవుతాయని నిర్ధారణకు వచ్చా రు. ఫోర్త్ సిటీలో డ్రైపోర్టు ఏర్పాటు చేయడం వలన అక్కడి నుంచి బందర్ పోర్టుకు కనెక్ట్ చేస్తూ రైల్వే లైన్‌ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సుముఖత వ్యక్తం చేసిందని సమా చారం. దీనితో పాటుగా ఫోర్త్‌సిటీ నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్?గడ్కరీ ప్రకటించారు. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతికి దూరం తగ్గుతుందని, ఇదే రహదారి బందరు పోర్టుకు వెళ్లే రోడ్డును కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు విదేశాలకు వెళ్లేందుకు సరుకు, వస్తు రవాణా సులువు కానుంది.

**సముద్రం లేకపోవడంతో..** తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడంతో ఇక్కడ పోర్టులు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదు. పోర్టుల ద్వారానే విదేశాలకు సరుకు రవాణా అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ లోని బందర్, కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల నుంచి పెద్ద మొత్తంలో విదేశాలకు ఎగుమతి ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. అందుకే అక్కడ నుంచి ఎగుమతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. పోర్టుల్లో చేసే తనిఖీలు, నాణ్యత, అనుమతులు, అధికారిక ప్రక్రియ అన్నింటినీ డ్రై పోర్టుల్లో పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియకు చాలా సమయం పడుతుంది. అందుకే పోర్టులో కాకుండా డ్రై పోర్టులోనే ఈ విధానాన్ని తీసుకొస్తే పరోక్ష, ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని సర్కారు భావిస్తోంది. ఫోర్త్‌సిటీతో పాటు జహీరాబాద్‌లోనూ మరొక డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అక్కడ భూ సేకరణ పూర్తయ్యాక అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక్కడ నిమ్జ్ ఏర్పాటు, ట్రాక్టర్ల తయారీ, ఆటో మొబైల్ విభాగానికి చెందిన పరిశ్రమలు ఇక్కడ ఎక్కువగా ఉండటంతో ఆయా కంపెనీలు ఈ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి అనువుగా ఉంటుంది. గతంలోనే కేంద్ర ప్రభుత్వం ఇక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేయడానికి అవసరమైన సాయం చేయడానికి ముందుకు వచ్చింది. అయితే, డ్రై పోర్టును ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై సరియైన అవగాహన రాలేదు. స్థలం అందుబాటులో లేదంటూ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. ఫలితంగా ఆనాడు పారిశ్రామికవేత్తలకు నిరాశే మిగిలింది.




## భారీ ఎన్‌కౌంటర్..

## మావోయిస్టులు హతం..

ఛత్తీస్‌గఢ్: బీజాపూర్ జిల్లా అడవులు మరోసారి దద్దరిల్లాయి. ఇవాళ(మంగళవారం) గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధి బోడ్లా పుస్నార్ అడవుల్లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య పెద్దఎత్తున ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. మావోల కాల్పుల్లో ఇద్దరు సైనికులకు సైతం తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో వారిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే, మావోలు ఎంతమంది మృతిచెందారు, మృతుల్లో ఎవరెవరు ఉన్నారనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు.

# దాయాది ద్వంద్వ వైఖరి...




## ఓ వైపు బెదిరింపులు... మరో వైపు యాచనలు...!

ఇస్లామాబాద్: భారత్‌పై పాక్ ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌కు సింధూ జలాలను ఆపేస్తూ.. భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

దీనిపై ఓ వైపు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మాజీ మంత్రి బిలావల్ భుట్టో బెదిరింపులకు పాల్పడుతుండగా..మరోవైపు తమకు నీటిని విడుదల చేయాలని ఆ దేశ విదేశాంగ శాఖ భారత్‌ను వేడుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని ఆ దేశ విదేశాంగ శాఖ తాజాగా న్యూదిల్లీని కోరింది. ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపింది. మరోవైపు పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ భారత్‌పై అణు హెచ్చరికలు చేస్తూ.. నోరు పారేసుకుంటున్నారు. 'భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?" అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో సోమవారం కథనాలు వచ్చాయి. ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సైతం భారత్‌పై పిరికిపంద ప్రేలాపనలు చేశారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. ఈ నేపథ్యంలో నీటిని విడుదల చేయాలని భారత్‌ను, పాక్ విదేశాంగ శాఖ అభ్యర్థించడం గమనార్హం. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేయడంతో దాయాది దేశానికి నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. జలాశయాల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. ఇక వాటినుంచి నీటిని తీసుకోలేని స్థితి ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో మరిన్ని కష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని పాక్ అంచనా వేసింది. అయితే ఉగ్రవాదంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది.




# అప్రమత్తంగా ఉండండి!

## తెలంగాణలో భారీ వర్షాలు.. అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్‌లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. "ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు పడే జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలి. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలి. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలి. వరదలపై ఫిర్యాదు కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలి. విద్యా సంస్థలకు సెలవులపై తగు చర్యలు తీసుకోవాలి. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా అప్రమత్తం చేయాలి. వీలైనంత వరకు ప్రజలు రహదారులపైకి రాకుండా చూడాలి. ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి"అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

**అలర్ట్ అయిన అధికారులు**... రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది.

వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది.

చురకలు

బుధవారం 13 ఆగష్టు 2025




హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు.

జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. "ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం.

గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు.

9 నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ. 3లక్షల ధర నిర్ణయించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలి"అని డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు.




వరంగల్: వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. కాజీపేట, హసన్‌పర్తి, రెడ్డిపురం, గోకుల్ నగర్, అంబేడ్కర్ నగర్, న్యూ శాయంపేటలో వరద నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. వరంగల్ నగరంలో భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. బట్టల బజార్, పాత బీటు బజార్‌లో రోడ్డుపై వరద నీరు నిలిచింది. హంటర్ రోడ్డు, ఎన్టీఆర్ నగర్, రామన్నపేట, శివనగర్, కరీమాబాద్, సాకరాశి కుంటలో కాలనీలు జలమయమయ్యాయి. వరంగల్ రైల్వే స్టేషన్‌లో భారీగా నీరు నిలిచింది. ఉర్సుగుట్ట సమీపంలో డీకే నగర్‌లో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఇక్కడి గుడిసెవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు నిలిచింది. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలో 20 సెం.మీ. వర్షపాతం, ఖిల్లా వరంగల్ ప్రాంతంలో 14.8 సెం.మీ, వర్ధన్నపేటలో 12 సెం.మీ, పర్వతగిరిలో 10.7, వరంగల్‌లో 9.5 సెం.మీ, గీసుకొండలో 9.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం మండలాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లాలో పలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. కొత్తగూడ శివారులో రాళ్లతోటి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దంతాలపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది.

ఇక్కడి పాలేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పెద్దముప్పారం-దంతాలపల్లి వంతెన పైనుంచి పాలేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.




హైదరాబాద్: చందానగర్‌లో కాల్పుల కలకలం రేగింది. ఖజానా జ్యువెలరీ దుకాణంలో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఎదురుతిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు.. రెండు రౌండ్ల ఫైరింగ్ జరిపారు. తుపాకీ పేల్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో డిప్యూటీ మేనేజర్ కాలికి గాయాలయ్యాయి. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు.. సిబ్బందిని లాకర్ కీ అడిగారు. వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ మేనేజర్‌పై కాల్పులు జరిపారు. లోపల బంగారు ఆభరణాలకు సంబంధించిన స్టాల్స్ విరగ్గొట్టి సిబ్బందిపై దాడులకు సైతం పాల్పడ్డారు. నగల దుకాణ సిబ్బంది భయంతో పోలీసులకు కాల్ చేశారు. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి దుండగులు పారిపోయారు. నిందితుల కోసం పది బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తున్నారు.

**దుండగులు బంగారు ఆభరణాల కౌంటర్లను తెరవలేకపోయారు: సీపీ...** ఉదయం 10.30 గంటలకు దొంగల ముఠా దుకాణంలో చొరబడిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. వారి కాల్పుల్లో డిప్యూటీ మేనేజర్ గాయపడ్డారని చెప్పారు. బంగారు ఆభరణాలు ఉన్న కౌంటర్లను దుండగులు తెరవలేకపోయారని పేర్కొన్నారు. వెండి ఆభరణాలు ఉన్న కౌంటర్లు ధ్వంసం చేసి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. వెండి ఎంత ఎత్తుకెళ్లారనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయమైన డిప్యూటీ మేనేజర్ పరిస్థితి బాగానే ఉందని వివరించారు.




దుండిగల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు.వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం.

శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## న్యాయవాద దంపతుల హత్య కేసు సీబీఐకి.. సుప్రీంకోర్టు కీలక తీర్పు

దిల్లీ: న్యాయవాదులైన గట్టు వామనరావు దంపతుల హత్య కేసును కోర్టు సీబీఐకి అప్పగించింది. ఈమేరకు సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఇస్తే తమకేమీ అభ్యంతరం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మరోవైపు మరణవాంగ్మూలం వీడియో అసలుదేనని ఎఫ్ఎస్ఎల్ నివేదిక తేల్చింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. అన్ని అంశాలను పరిశీలించి దర్యాప్తు చేయాలని సీబీఐను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. 2021 ఫిబ్రవరి 17న గట్టు వామనరావు దంపతులు హత్యకు గురయ్యారు. పెద్దపల్లి జిల్లా కల్వచర్ల వద్ద కారులో వెళ్తున్న వీరిని అడ్డుకొని రోడ్డుపై హత్య చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి పిటిషన్ దాఖలు చేశారు.






హైదరాబాద్: మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. "మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారు.. ఇచ్చినప్పుడు ఇవ్వండి. ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి హామీ ఇచ్చినప్పుడు తెలియదా? 9 మంది ఎమ్మెల్యేలున్న ఖమ్మం జిల్లాకు 3 మంత్రి పదవులు ఇచ్చారు. 11 మంది గెలిచిన నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉంటే తప్పా? అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే ఓపిక పడుతున్నా?" అని అన్నారు.




దిల్లీ, ఎన్సీఆర్‌లలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. రోజు రోజుకు మనం సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లుగా ఉందన్నారు. మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదని.. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదని అన్నారు. కుక్కల నుంచి ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్థానికంగా షెల్టర్ల ఏర్పాటు, స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**సీజేఐకి లేఖ రాసిన నటుడు అడివి శేష్...** వీధి కుక్కల అంశంలో 'సుప్రీం' ఇచ్చిన ఆదేశాలను పునఃపరిశీలించాలని అభ్యర్థిస్తూ సినీ నటుడు అడివి శేష్ (%ూాఎఅజఆ ావంష్ట్ర%) సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో దిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. తీర్పుపై ఇప్పటికే పలు జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ సైతం ఈ విషయాన్ని లేవనెత్తారు. ఈ తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. "దిల్లీలో 3 లక్షల వీధి కుక్కలున్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో దిల్లీ ప్రభుత్వం ఉందా?" అని ప్రశ్నించారు. దిల్లీ వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. కుక్కలను దూరంగా ఉన్న షెల్టర్లకు తరలించాలని సోమవారం సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది.




హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసు పంపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసత్యాలు మాట్లాడారని అందులో పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాజకీయ ఉనికి కోసమే అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తనకు వెంటనే క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలన్నారు. లేదంటే క్రిమినల్ చర్యలకు బండి సంజయ్ బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన అనంతరం బండి సంజయ్.. కేటీఆర్‌పై పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.




## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

శ్రీశైలం: శ్రీశైలం జలాశయంలోకి వరదనీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం నాలుగు గేట్లను ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటం, ఇప్పటికే జలాశయం పూర్తిగా నిండిపోవటంతో ఈ సీజన్లో మూడోసారి గేట్లు ఎత్తేశారు. శ్రీశైలంలోకి 2,02,456 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 35,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్తు కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,808 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగు స్పిల్ వే గేట్లు ఎత్తి 1,08,076 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.70 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 202.96 టీఎంసీలుగా ఉంది.

చురకలు



# సేవాభావానికి ప్రతిరూపం నైటింగేల్ - ఆగస్టు 13... నైటింగేల్ వర్ధంతి



అవివాహితలు ఇంటి పనులు, చర్చి పనులే చేయాలనీ ఆంక్షలు విధించ బడిన రోజులవి. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఆమె ఛేదించింది. ఆ రోజుల్లోనే ఒక విధంగా సంఘం మీద తిరగ బడింది. పేదలకు, అనాథలకు సేవ చేయాలన్న అభిలాషతో, ఇంటా, బయటా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, లక్ష్య సాధనలో మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించింది. రోగుల పాలిటి దేవతగా వెలుగొందింది. ఆమే విశ్వ విఖ్యాత ఫ్లోరెన్స్ నైటింగేల్. నైటింగేల్ ఎంతో గొప్పింటి పిల్ల అయినా నర్సుగా సేవలు అందించడానికే నిశ్చయించుకుంది. ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820, మే 12న ఇటలీలో జన్మించింది. 1853న లండన్ లోని ఓ స్త్రీల ఆస్పత్రిలో సూపరిండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకొని వెళ్ళింది. "ది లేడీ విత్ ది లాంప్" గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక బ్రిటిష్ నర్సు, సామాజిక సంస్కర్తగా, గణాంక నిపుణురాలిగా, ఆధునిక నర్సింగ్ స్థాపకురాలుగా ప్రసిద్ధి గాంచింది. వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపు కుంటారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవం నాడు గుర్తు చేసుకుంటారు. ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత, ఏమాత్రం ఉండేవికావు. అయినాకూడా ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగు పని చేయడానికే నిర్ణయించుకుంది. తన తల్లి సాహితి ప్రపంచంలో ధ్రువతారగా వెలగాలని కోరినా, ఫ్లోరెన్స్ నైటింగేల్, జర్మనీలో కైసర్ సంస్థను గూర్చి విని, అక్కడే పని చేయాలనీ నిర్ణయించుకుంది. ఇద్దరు బిడ్డల్ని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది. 1852 లో ఐర్లాండ్ వెళ్ళింది. అక్కడి ఆసుపత్రులను చూడగానే వాటిల్లో విప్లవాత్మకమైన మార్పులను తేవాలి అనుకున్నది. 1853 లో సిస్టర్స్ ఆఫ్ చారిటికి వెళ్ళింది. తిరిగి లండన్ వచ్చి, తన నాయనమ్మకు సేవ చేయడానికి రాగా అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి రోగులకు, పగలు, రాత్రి అనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగులకు మంచి ఆహారం అందించింది. 1854-56 లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లొరెన్స్ వచ్చి తోటి నర్సులను కూడగట్టుకొని యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరుపమాన సేవలందించింది. ధైర్యం చెప్పింది. సాటి నర్సులు విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబం లోనుంచి వచ్చిన ఆమె ఏరి కోరి పనిని ఎంతో శ్రద్ధతో, ఇష్టంతో చేసేది. గుండె నిబ్బరంతో, చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. అందుకే ఆమె లేడీ విత్ ది లాంప్ గా వాసికెక్కింది. మొదట్లో ఆమెను చూసి అధికారులు జ్వలించి పోయేవారు. తరువాత ఆమె నిరుపమాన సేవకు ముగ్ధులయ్యారు. వారికి రోజూ, రోగులకు కావాల్సిన మందులు పరికరాలను పంపమని అభ్యర్ధనలు పంపి, పలుమార్లు స్వంత డబ్బు ఖర్చు పెట్టి అన్ని తెప్పించేది. ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్ళను, భవంతులను ఆసుపత్రులుగా మార్చేది. రాత్రులలో రెండు, మూడు గంటలే పడుకుని అహర్నిశలు పని చేసేసరికి ఆమె చిక్కి పోయింది. అయినా రోగులకు ఆమె ఆరాధ్య దైవం. ఆమె నడచిన దారి అతి పవిత్రం. వారు విక్టోరియా రాణి మరణిస్తే ఫ్లొరెన్స్ ను రాణి చేస్తామని" అనేవారట. ఆమె ఎక్కడికి వెళ్ళినా సైనికులు అడవి పూలతో పుష్ప గుచ్చాల నిచ్చేవారట. అది చూసి తోటి డాక్టర్లు, నర్సులు అసూయ చెందేవారట. అయినా ఆమె తన సేవలను మానకుండా చేస్తూండగా ఒకనాడు స్పృహ తప్పి పడిపోయింది. సైనికులకు వచ్చిన జ్వరమే ఆమెకు వచ్చింది. కాసిల్ ఆసుపత్రిలో ఆమెను రోగిగా చేర్చుకున్నారు. ఆమెను చూసి మిగతా రోగులు కన్నీరు కార్చారు. అయినా ఆరోగ్యం మెరుగు పడగానే, తిరిగి క్రిమియా, స్కుటారి ఆసుపత్రుల మధ్య తిరుగుతూ రోగులకు సేవలందించింది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్‌ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్, అనే గ్రంథాలను వ్రాయడమే కాకుండా, విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్థనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణను ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24 న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ అనే సంస్థను లండన్ లో స్థాపించారు. ఆమెను' మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్' గా గుర్తించారు. భారత దేశానికి కూడా ఆమె ఇతోధిక సేవలనందించింది. 1859 లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమిషన్ ను నియమించింది. చెన్నై నగరపు మేయర్ ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టిన రోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. నర్సులు దినోత్సవం రోజున, నర్సింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా విశేష సేవలందించిన నర్సులకు భారత రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందిస్తారు. 1910 ఆగస్ట్ 13 లో ఫ్లొరెన్స్ మరణించినా, సేవా నిరతిగల ప్రతి నర్సు లోను ఆమె కలకాలం జీవించి ఉంటుంది. 1973లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఈ అవార్డులో భాగంగా కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత, స్వచ్ఛంద సంస్థల్లో విశిష్ట సేవలందించిన నర్సులకు ఒక పతకం, ప్రశంసాపతరం, జ్ఞాపికతో పాటు 50వేల రూపాయిల నగదు బహుమతిని బహుకరిస్తారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన వారికి సేవలు చేసే చేతులు ఏవైనా ఉంటె అవి సేవామయులైన నర్సుల చేతులే. మానవ సేవే మాధవ సేవ అని తలంచి, మానవ సేవ ద్వారానే తమ జీవితాన్ని సార్ధకం చేసుకుంటున్న వారు నర్సులు. అలాంటి నర్సులకే ఆదర్శప్రాయమైన నైటింగేల్ దన్యురాలు. కరోనా బారిన పడిన బాధితులను కాపాడటానికి ఫ్లొరెన్స్ నైటింగేల్ లు ప్రతి రూపాలుగా వారు చేస్తున్న సేవలు అపూర్వం, అసామాన్యం, అనిర్వచనీయం, అభినందనీయం. కరోనా బాధితులకు నిత్యం సేవలు చేస్తున్న వైద్య సిబ్బందిలో, తమ ప్రాణాలను పణంగా పెట్టి, ప్రధాన పాత్రలు పోషిస్తున్న నర్సుల సేవలను ఎలా మరిచిపోగలం, వారి ఋణం ఎలా తీర్చుకోగలం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మాటలలో సమానత్వం...చేతలలో విఫలం - రాజకీయ పార్టీల అర్థంకాని వ్యవహారం

తెలంగాణ రాజకీయాలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఓ పాత అనుమానానికి కొత్త ప్రాణం పోశాయి ం బీసీ వర్గానికి చెందిన నేతలపై పార్టీల తీరు ఒకే కొలమానం కాదా? లేదా వారి పట్ల 'సవతి తల్లి' తీరులోనే వ్యవహరి స్తున్నాయా? సంఘటనలు చూస్తే సమాధానం చేదుగా ఉంది. మాట కఠినమై ఉంటే నిజం అంతకంటే కఠినం. ఇటీవలి కొన్ని పరిణామాలు, ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన నేతలపై తీసుకున్న పార్టీల నిర్ణయాలు, ఒకవైపు కఠిన చర్యలు ం మరోవైపు ఉపేక్ష, మద్దతు ం వంటి విరుద్ధ ధోరణులు మళ్లీ చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఒక అసమానత క్రమంగా స్పష్టమవుతూ వస్తోంది. బీసీ వర్గానికి చెందిన నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో రాజకీయ పార్టీల తీరు వేగంగా, నిర్దాక్షిణ్యంగా ఉంటే, ఇతర ప్రభావశీల వర్గాల నేతల విషయంలో మాత్రం విచారణలు, హెచ్చరికలు, సమీక్షల పేరుతో చర్యలు వాయిదా పడుతున్నాయి. ప్రభావం తక్కువగా ఉన్న నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోగా, బలమైన ఓటు బ్యాంకు, మీడియా ఆకర్షణ కలిగిన నేతల విషయంలో మాత్రం ఉపేక్ష కనిపిస్తుంది. ఈ ధోరణి కేవలం ఒకటి రెండు సంఘటనలకు పరిమితం కాదు. గత కొన్ని సంవత్సరాలుగా చోటుచేసుకున్న అనేక ఉదంతాలు దీనికి సాక్ష్యం చెబుతున్నాయి. తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ నుంచి రాజా సింగ్-రాజీనామా వరకు, కోమటిరెడ్డి-వివాదాలు, కవితా-న్యాయ పరిణామాలు ం ఇవన్నీ ఒక సామూహిక సందేశాన్ని పంపు తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీ సమస్యలను పార్టీలు గణనీయంగా గుర్తిస్తున్నప్పటికీ, నాయకులపై తీసుకునే చర్యల్లో అసమానతల భావన, రాజకీయ ప్రయోజనం, కేంద్ర-హై-కమాండ్ ల అలసత్వ ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను క్రమశిక్షణా ఉల్లంఘన ఆరోపణలతో ఒకే రోజు లోపల సస్పెండ్ చేసింది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యానించారని ఆరోపణలు రావడంతో కఠిన చర్య తీసుకున్నామని హైలైట్ చేసింది. అదే సమయంలో గతంలో కాంగ్రెస్‌లోనే అసంతృప్తి స్వరం ఎత్తిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై మాత్రం ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ఆయన వ్యాఖ్యలు, పార్టీకి వ్యతిరేక వైఖరి కూడా అందరికీ తెలిసిన విషయమే అయినా, ఆర్థిక, రాజకీయ, కుటుంబ ప్రాధాన్యం కారణమో కానీ పార్టీ తీరు గణనీయంగా మృదువుగా మారింది. ఇదే పోలిక బీజేపీలోనూ కనిపించింది. 2022లో టి. రాజాసింగ్ చేసిన మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసిన వివాదాస్పద వ్యాఖ్యలపై పార్టీ సస్పెన్షన్ ప్రకటించినా, కొద్ది నెలల్లోనే తిరిగి చేర్చుకుంది. ప్రస్తుతం ఆయన్ను సస్పెండ్ చేసినప్పటికీ, ఆయన ఏ ఇతర పార్టీలలో చేరనని, భాజపా అధిష్టానం ఎప్పుడూ పిలిచినా వెళతాననడం బట్టి, ఈ పరిణామం క్రమశిక్షణ కంటే ఓటు బ్యాంకు లెక్కలు ఎంత బలంగా పనిచేస్తాయో చూపిస్తుంది. బీఆర్ఎస్ విషయంలోనూ ఇదే కథ. ఎమ్మెల్సీ కవితపై కేంద్ర ఏజెన్సీలు విచారణలు జరుపుతున్నా, ఆమె అరెస్టయి జైలుకు వెళ్ళినా, పార్టీ లోపల ఆమె స్థానానికి ఏమాత్రం ముప్పు రాలేదు. వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ ప్రభావం, రాజకీయ అవసరాలు అన్నీ కలిసి ఆమెకు రక్షణ కవచంగా నిలిచాయి. మరో వైపు, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిలో మార్పులు కూడా ఈ సమీకరణల ప్రభావాన్నే ప్రతిబింబించాయి. బండి సంజయ్ బీసీ వర్గానికి చెందిన నాయకుడు. కేంద్రంపై పూర్తి విశ్వాసం, విధేయత ఉన్నప్పటికీ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి అప్పగించారు. ఇటీవల రామచంద్రరావుకు అప్పగించిన బాధ్యతలు కూడా వర్గాల లెక్కలు, రాజకీయ గణితం ఆధారంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమీకరణాలు కొత్తవి కావు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడే బీసీ, మాదిగ, గౌడ, ముస్లిం నేతలపై కఠినత, ప్రభావశీల వర్గాలపై ఉపేక్ష అనే పద్ధతి ఉండేది. తెలంగాణ ఏర్పాటయినా ఆ పాత పద్ధతే కొనసాగుతోంది. ఫలితంగా బీసీ వర్గం తరచుగా తక్కువ ప్రాధాన్యం పొందుతున్న భావన బలపడుతోంది. బీసీ సమస్యలను కేవలం ఎన్నికల వ్యూహంలో ఒక అంశంగా కాకుండా, సమగ్ర రాజకీయ అజెండాలో భాగం చేయడం ఇప్పుడు అత్యవసరం. అలా కాకుండా ఈ ధోరణి కొనసాగితే బీసీ నేతల్లో అసంతృప్తి మరింత పెరుగుతుంది. వ్యక్తిగతంగా కాకుండా సమైక్యంగా ఈ వర్గం స్పందించే పరిస్థితి వస్తే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఒక్క రాత్రిలో మారిపోవచ్చు. కొత్త రాజకీయ శక్తుల ఎదుగుదలకు ఇది బంగారు అవకాశం అవుతుంది. ప్రజాస్వామ్యంలో సమానత్వం ప్రధాన సూత్రం. క్రమశిక్షణ, నిబంధనలు, నిర్ణయాలు అందరికీ ఒకే విధంగా వర్తించాలి. ఒకే తప్పుకు ఒకరికి విద్యుదాఘాతం, మరొకరికి పూలహారం అందించే ధోరణి కొనసాగితే బీసీ వర్గం ఓటు మాత్రమే ఇస్తూ గౌరవం పొందని వర్గంగా మిగిలిపోతుంది. ఈ ప్రశ్న కేవలం బీసీ వర్గానికే సంబంధించినది కాదు, సమానత్వాన్ని నమ్మే ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించాల్సిన అంశం. ఏ పార్టీ అయినా ఈ అసమానతను పట్టించుకోకపోతే, పార్టీల సమీకరణాలు కాదని, ప్రజాభిప్రాయం ఎప్పుడో ఒకరోజు రాజకీయ గణితాన్ని పూర్తిగా మార్చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భారత భక్తి సంప్రదాయానికి మహోన్నత దీపస్తంభం పెద్ద జీయర్ స్వామి

## పెద్ద జీయర్ స్వామి తిరు నక్షత్సం సందర్భంగా

కాశ్యపాన్వయ సంజాతం కళ్యాణ గుణ సాగరం కాంక్షితార్ధ పదం వందే కృష్ణమార్యం గురుత్తమం ఉత్తరాభాద్ర నక్షత్రే శ్రావణే సౌమ్యవత్సరే ఆయురాసీత్ గురు శ్రీమాన్ నారాయణ యతీశ్వరః. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామివారు శ్రావణ మాసం ఉత్తరాభాద్ర నక్షత్రంలో ఆవిర్భవించి శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ఆధ్యాత్మిక విశేష కాంతిలా వెలిగిన మహానుభావులు. ఆయన జయంతి ఉత్సవం ప్రతిసంవత్సరం భక్తి ప్రవాహంగా, ఆధ్యాత్మిక వైభవంగా మఠాలు, ఆలయాలు, అనుయాయుల గృహాలలో భక్తిప్రవాహంగా, ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించబడుతూ భక్తుల హృదయాలలో భగవత్స్మరణ జ్యోతిని మరింత జ్వలింపజేస్తుంది. పూర్వాశ్రమ నామం గోపాలాచార్యులు గల పెద్ద జీయర్ స్వామి 1909 సెప్టెంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిండిన కుటుంబంలో జన్మించారు. జన్మానికి ఏడవ రోజున ఒక అద్భుత సంఘటన చోటుచేసుకుంది ం రాజును పాముగా భావించే ఒక మహాపాము శిశువైన స్వామివారిని చుట్టుముట్టి కాపాడింది. ఈ ఘటనను దివ్యపురాణ చిహ్నంగా భక్తులు భావించారు. బాల్యం నుంచే ఆయన వేదవిద్య, ఆగమశాస్త్రం, దివ్యప్రబంధం, పూర్వాచార్యుల భాష్యాలలో లోతైన అభ్యాసం పొందారు. వంశపారంపర్యంగా వచ్చిన భక్తి, నియమనిష్ఠలు, గురువుల పట్ల గాఢవినయం, ధర్మపరమైన అంకితభావం ఆయన ఆత్మలో ప్రతిష్ఠితమై, విశిష్టాద్వైత సిద్ధాంతంలో పాండిత్యాన్ని సంపాదించారు. యౌవనదశ నుంచే ప్రజాసత్సంగాలు, ఆధ్యాత్మిక సభల్లో మధురవాక్కుతో, లోతైన గ్రంథజ్ఞానంతో శ్రోతలను భక్తిమార్గంలో నడిపించారు. 1954లో వానమామలైలో తిరునాయచార్య దేవత ఆధ్వర్యంలో ఆయన సన్యాసాశ్రమంలో ప్రవేశించారు. ఆ దినం నుంచి జీవితాంతం భగవద్భక్తి, మానవసేవ అనే ద్విమంత్రాన్ని ఆచరణలో పెడుతూ గడిపారు. 1960 ప్రాంతంలో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక బోధ ప్రారంభించి శ్రీరామానుజుల విశిష్టాద్వైత తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. 1970లో త్రిదండ స్వీకరించి "పెద్ద జీయర్ స్వామి"గా పీఠాధికార బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ జీయర్ మఠాన్ని ఆధ్యాత్మిక, విద్యా, సేవా కార్యక్రమాల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దారు. అనేక వేదపాఠశాలలు స్థాపించి వేదవిద్యా సంరక్షణ, ప్రచారంలో విశేషకృషి చేశారు. ఆళ్వారుల దివ్యప్రబంధాలను సులభభాషలో వివరిస్తూ భక్తుల మనసుల్లో భగవత్స్మరణను పెంపొందించారు. పేదలకు అన్నదానం, విద్య, వైద్యసహాయం అందించారు. సహజవిపత్తుల సమయంలో సహాయకచర్యలు చేపట్టారు. దేశం, విదేశాలలో అనేక ఆధ్యాత్మికయాత్రలు చేసి రామానుజాచార్యుల విశిష్టాద్వైత తత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేశారు. అనేక పురాతన ఆలయాల పునరుద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించి ఆలయసంస్కృతి పునరుజ్జీవనానికి కృషి చేశారు. వేద, ఆగమ, దివ్యప్రబంధ గ్రంథాల ప్రచురణకు పునాదులు వేశారు. 1973లో న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో అఖిల భారత వేద సదస్సును నిర్వహించారు. దేశం నలుమూలలతో పాటు నేపాల్ నుండి కూడా నలువేల మందికి పైగా పండితులు పాల్గొన్నారు.

అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ స్వచ్ఛందంగా విచ్చేసి వేదసంస్కృతి పరిరక్షణలో స్వామివారి అద్భుత కృషిని ప్రశంసించారు. పెద్ద జీయర్ స్వామివారి మరణానంతరం 1981లో ఆయన ఆధ్యాత్మిక వారసత్వాన్ని చిన్న జీయర్ స్వామివారు స్వీకరించారు. చిన్న జీయర్ స్వామి 1956 నవంబర్ 3న దీపావళి పండుగ రోజున ఆంధ్రప్రదేశ్‌లోని ఈస్ట్ గోదావరి జిల్లా ఆర్థమురులో జన్మించారు. బాల్యంలోనే జ్ఞానదాహం, భక్తి, సేవాసంకల్పం కలిగి పెద్ద జీయర్ స్వామివారి శిష్యుడిగా, తరువాత వారసుడిగా ఆవిర్భవించారు. పీఠాధికారిగా నియమితులైన తరువాత వేదం, వేదాంతం, సేవా కార్యక్రమాలు, విద్యా విస్తరణ, సమాజసేవ రంగాలలో అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ విధంగా పెద్ద జీయర్ స్వామివారి ఆధ్యాత్మికజ్యోతి చిన్న జీయర్ స్వామివారి చేతుల్లో మరింత ప్రకాశిస్తూ ప్రపంచవ్యాప్తంగా భక్తులకు మార్గదర్శకత్వం అందిస్తోంది. పెద్ద జీయర్ స్వామివారి జీవనసారం "భగవద్భక్తి, మానవసేవ రెండూ విడదీయరానివి" అనే సూత్రం నేటికీ ఆయన శిష్యులు, అనుయాయుల జీవితాల్లో మార్గదర్శకంగా నిలుస్తోంది. ఆయన జయంతి ఉత్సవం ఆ మహానుభావుడి స్ఫూర్తిని పునరుద్ధరించే పవిత్రదినం, సనాతన ధర్మ పరిరక్షణకు భక్తుల్లో సంకల్పబలం నింపే దివ్యసమయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపె ండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



ఆశా వర్కర్లకు సంబంధించి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆశా వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలు

# ఆశా వర్కర్లకు గుడ్‌న్యూస్.. ప్రభుత్వం కీలక నిర్ణయం..

తీసుకుంది. తాజాగా ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి రెండు ప్రసవాల కోసం 180 రోజులు (6 నెలలు) పూర్తి జీతంతో ప్రసూతి సెలవులు ప్రకటించింది. ఆశా వర్కర్ గా పనిచేయడానికి గరిష్ఠ వయసు 62 సంవత్సరాలుగా నిర్ణయించింది. సంవత్సరానికి నెలవారీ గౌరవ వేతనం 50% అంటే ?5,000 చెల్లింపు చేపట్టనుంది. గరిష్టంగా మొత్తం1,50,000 వరకు చెల్లింపు చేపట్టనుంది. రిటైర్మెంట్ తరువాత ఆర్థిక భద్రత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీలో రాబోయే 5 రోజుల్లో భారీ వర్షాలు!

విశాఖపట్నం: బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఆ తర్వాత అది వాయుగుండంగా బలపడి, శనివారం నాటికి తీరం దాటొచ్చని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్, ఇతర వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. దీని ప్రభావంతో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని భావిస్తున్నాయి. మరోవైపు రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వానలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు వైఎస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి,



చిత్తూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వానలు పడ్డాయి. సోమవారం పల్నాడు, తూర్పుగోదావరి, గుంటూరు, అనకాపల్లి, కాకినాడ, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.




# ఆ ఖైదీలను విడుదల చేయాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**ఢిల్లీ, ఆగస్టు 12 : శిక్షాకాలం పూర్తి చేసిన ఖైదీల విడుదలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శిక్షా కాలం పూర్తి చేసిన ఖైదీలను వెంటనే విడుదల చేయాలని న్యాయస్థానం సూచించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల హోమ్ శాఖ సెక్రెటరీలకు కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. తమ పరిధిలో శిక్షా కాలాన్ని పూర్తి చేసిన తర్వాత కూడా జైల్లో ఖైదీలు కొనసాగుతున్నారా? అనే విషయాన్ని వెంటనే పరిశీలించాలని ఆదేశించింది సుప్రీంకోర్టు. అలాంటి ఖైదీలు ఇతర కేసుల్లో అవసరం లేకపోతే వారిని తక్షణమే విడుదల చేయాలని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. శిక్షా కాలాన్ని(రివార్డు లేకపోయినా) పూర్తి చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాన్ని జాతీయ న్యాయ సేవా ప్రాధికార సభ్య కార్యదర్శికి పంపాలని, అక్కడి నుంచి రాష్ట్రాల్లోని జిల్లా న్యాయ సేవా సంస్థలకు పంపించాల్సిందిగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.**

చురకలు

## సంపాదకీయం

# రాజకీయంగా 'ఒంటరి'గా ట్రంప్ ఎందుకు మిగిలిపోతున్నాడు?

అమెరికా రాజకీయాల్లో డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడూ సంచలనాలకు మారుపేరు. అనూహ్య నిర్ణయాలు, ధీటైన వ్యాఖ్యలు, విభేదాలను లెక్కచేయని పాలనా ధోరణి ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. అయితే, అదే విధానం ఇప్పుడు ఆయన్ను ఒంటరిగా మారుస్తుందా అన్న అనుమానం కలుగుతోంది. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికై కొన్ని నెలలే గడిచినా, ట్రంప్ చుట్టూ ఒక వలయం ఏర్పడుతోంది. అది మిత్రుల విరక్తి వలయం.

**– మిత్రులే శత్రువులుగా!** ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చాక ఆయన గుండెచప్పుడు విన్నవారే ఒక్కొక్కరుగా విపక్షం వైపు మొగ్గుతుండటం గమనార్హం. ఎలాన్ మస్క్, మైక్ పెన్స్, జాన్ బోల్టన్, జిమ్ మ్యాటిస్, జాన్ కెల్లీ, మార్క్ మిల్లే వంటి కీలక నాయకులు ఇప్పుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా బహిరంగంగా గొంతు విప్పుతున్నారు. ట్రంప్‌కు మద్దతుగా నిలిచి ఆయన ప్రచారానికి కోట్ల డాలర్లు ఖర్చు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చాక ట్రంప్ తీసుకున్న "బిగ్ బ్యూటిఫుల్ చట్టం" పట్ల మస్క్ అసంతృప్తిగా ఉన్నారు.

ఈ చట్టం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని బలవంతంగా పెంచే అవకాశం లేకుండా చేయడంతో మస్క్ తన ప్రయోజనాలకు భంగం కలిగిందని భావిస్తున్నారు. తీరా, ట్రంప్ దుశ్శాసనాలను తట్టుకోలేక మస్క్ "అమెరికా పార్టీ" అనే కొత్త రాజకీయ సంస్థను ప్రకటించారు. ఇది ట్రంప్‌కు ఝలక్ అని చెప్పవచ్చు.

**–వ్యతిరేక స్వీర్ల్: రిపబ్లికన్ పార్టీలో విభేదాల ధ్వని...** మైక్ పెన్స్‌ను ట్రంప్ ఒకానొకప్పుడు తన 'సెకండ్ ఇన్ కమాండ్'గా చూశారు. కానీ 2021 క్యాపిటల్ హిల్ దాడి అనంతరం వారిద్దరి మధ్య దూరం పెరిగింది. ట్రంప్ మాటలు పాటించకుండా రాజ్యాంగ విధుల ప్రకారం పెన్స్ పని చేయడాన్ని ఆయన విశ్వాసఘాతుకంగా అభిప్రాయపడ్డారు. జాన్ బోల్టన్, జిమ్ మ్యాటిస్, జాన్ కెల్లీ, మార్క్ మిల్లే వంటి సీనియర్ భద్రతా వ్యవస్థకు చెందినవారు కూడా ట్రంప్ పరిపాలన విధానాలపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. "ఫాసిస్టు", "అత్యంత ప్రమాదకర వ్యక్తి" వంటి పదాలను వారి నోట వినడం ఆందోళన కలిగించే విషయం.

**మూడో పార్టీ మాయాజాలం.. ట్రంప్ భయం నిజమా?..** ఎలాన్ మస్క్ ఏర్పాటు చేసిన "అమెరికా పార్టీ"పై ట్రంప్ తీవ్రంగా స్పందించడం, మూడో పార్టీ అమెరికాలో స్థిరపడలేదని చెప్పడంలో ఆయన భయం స్పష్టంగా కనిపిస్తోంది. మస్క్ వంటి ప్రతిభావంతుడైన వ్యక్తి, భారీ ఆర్థిక వనరులున్న కార్పొరేట్ నేత ఒకవేళ మూడో పార్టీని నిలదొక్కుకునే స్థితికి తీసుకెళ్తే, అది ట్రంప్ లాంటి శక్తిమంతుడికి కూడా నిద్రలేని రాత్రులను కలిగించే అంశం అవుతుంది.

**– ట్రంప్ భవిష్యత్తు ఎటు?....** ట్రంప్ రాజకీయ మంత్రంగా "లాయల్టీ" అనే పదాన్ని ఎప్పుడూ ప్రాధాన్యంలో ఉంచారు. కానీ, అదే పదం ఇప్పుడు ఆయనకు శాపంగా మారుతోంది. వైఖరి మార్చకుండా అన్ని విషయాల్లో తానేం చేసినా సరైందన్న గర్వం చివరకు ఆయన చుట్టూ భయంకరమైన మౌనాన్ని తెచ్చింది. విశ్వసించిన వారు ఒక్కొక్కరుగా వెళ్లిపోతుండగా, కొత్తగా ఆయనవైపు రావాలని ఆశపడే వారెవరూ లేరు. వాస్తవానికి ట్రంప్ ఇప్పుడు రాజనీతి శక్తిగా ఉన్నా, మానవ సంబంధాల పరంగా మాత్రం శూన్యంలోకి అడుగులు వేస్తున్నారని చెప్పొచ్చు. అధికారంలో ఉన్నప్పుడు మిత్రులను ఆదరించని నాయకుడిని, అధికారానికి వచ్చాక మిత్రులే నిలదీస్తున్న దుస్థితి అతడికి ఎదురవుతోంది. మొత్తంగా ట్రంప్ పాలన పునరావృతమవుతోందేమో గానీ, అదే పాత వైఖరులు, అదే పాత పద్ధతులు ఈసారి ఆయన్ను తుడిచిపెట్టే అవకాశాన్ని కల్పించకూడదని ఆయన తక్షణం తెలుసుకోవాలి. లేకపోతే మిత్రుల నీడలే శత్రు ఆకృతులుగా మారతాయి.


# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు - ఆగస్టు 13...పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతి



మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు. 1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా, 2015–16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జాతీయ గీతం జనగణమన





భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలని... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియదు. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. జనగణమన గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. 1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునే వారు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడలేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. దేశభక్తి గేయమైన జనగణమన బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది, 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది... 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం

తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ, 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీ టర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేపట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్య మాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరే కించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను



ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్ర హులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రో ద్యమం పట్ల ఆకర్షితుల య్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యా గ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసు కున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## ఆలయాలు పల్లెల్లో.. కార్యాలయం నగరంలో..

వికారాబాద్ : జిల్లాలో సుమారు 200 వరకు చిన్న, పెద్ద ఆలయాలున్నాయి. వాటి బాగోగులు చూసి సమస్యలను పరిష్కరించే జిల్లా అధికారి కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో ఉంది. దీంతో భక్తులు, కొందరు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. భూములకు సంబంధించిన సమాచారమంతా ఆన్‌లైన్ చేశారు. దీంతో చాలామంది అన్నదాతల పట్టా భూములు 'ఎండోమెంట్ ల్యాండ్' అని చూపుతోంది. దీంతో సమస్య పరిష్కారానికి హైదరాబాద్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది.

**వేధిస్తున్న సమస్యలు..**

జిల్లాలోని చాలా ఆలయాల్లో సమస్యలున్నాయి. కొన్నింట్లో ధూపదీప నైవేద్యాలే లేవు. వికారాబాద్ పట్టణానికి 6 కి.మీ. దూరంలోని శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయముంది. ఏటా పెద్ద జాతర జరుగుతుంది. ఈ ఆలయాన్ని రాష్ట్రస్థాయి ప్రముఖులు దర్శించుకుంటారు. ఆలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. చుట్టుపక్కల ఖాళీ స్థలమున్నా శౌచాలయాలు మాత్రం లేవు. దీంతో మహిళా భక్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోమిన్‌పేట మండలం దుర్గంచర్వులో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం ఉంది. దీనికి ఆనుకొని ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. రహదారి చిన్నగా ఉండటంతో



వాహనాలు ఎదురెదురుగా వస్తే గుట్టపైకి వెళ్లలేకపోతున్నాయి. రోడ్డు మధ్యమధ్యలో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ ఆలయానికి సరైన నీటి సౌకర్యం లేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి కార్యాలయం అందుబాటులో ఉండాలని పలువురు కోరుతున్నారు.

**150 కి.మీ.దూరం..**

జిల్లాలోని దౌల్తాబాద్, కొడంగల్, బషీరాబాద్ మండలాల వాసులు హైదరాబాద్ వెళ్లాలంటే 150-200 కి.మీ. దూరం ప్రయాణించాల్సిందే. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ అధికారి కార్యాలయం లేదు. ఆలయాల ద్వారా ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా వసతులు కల్పించడం లేదు, అధికారులను నియమించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే కార్యాలయం ఏర్పాటు చేస్తే ఆలయాలు అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని పలువురు అంటున్నారు. జిల్లాలో ఈఓల కొరత వేధిస్తోంది. ప్రతి ఆలయానికి అధికారి ఉండాలి. కనీసం పెద్ద వాటికైనా నియమించాలి. జిల్లాలో ఒక్కో ఈఓ 10- 20 ఆలయాలను పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాలు, టెండర్లు, కౌలు భూముల పర్యవేక్షణ తదితర పనులతో వారికి పని ఒత్తిడి పెరిగింది.

## కొత్తవి నిర్మించరు.. మరమ్మతులైనా చేపట్టరు

నిజామాబాద్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్నపాటి జ్వరాలకు బాధితులు స్థానిక ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. చాలాచోట్ల దవాఖానాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అక్కడకు చికిత్స రావాలంటేనే రోగులు జంకుతున్నారు. మరమ్మతులకు అంచనాలు రూపొందించినా నిధులు విడుదల కాకపోవడం, మరోవైపు పనులన్నీ పూర్తయినా కొత్త భవనాలను ప్రారంభించడంలో విపరీతమైన జాప్యం కొనసాగుతోంది. జిల్లాలో 27 పీహెచ్‌సీలు ఉన్నాయి. అర్సపల్లి, స్పీవన్ కాలనీ, దుబ్బ, గౌతమ్‌నగర్, మాలపల్లి, ఎన్‌ఆర్‌నగర్, వినాయక్‌నగర్, పంగపల్లి, రాకాసిపేట అర్బన్ పీహెచ్‌సీలకు మరమ్మతులు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించి ఏళ్లు గడుస్తున్నాయి. సాలూర పీహెచ్‌సీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకొగా.. కొత్త భవన నిర్మాణం వెంటనే చేపట్టాల్సి ఉంది. వీటన్నింటికీ బాగు చేయడానికి రూ.5.37 కోట్లు కావాలని అధికారులు చెబుతున్నారు.

**వీటికి మోక్షం ఇంకెప్పుడో...**

కొత్తపల్లి, కుర్నపల్లి, రామన్నపేట్, పాచెన్‌నడికుడలో ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. చందూర్, ఆలూర్, ముప్కాల్, చిమన్‌పల్లి పీహెచ్‌సీల కొత్త



నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పీహెచ్‌సీలలో 83 మంది వైద్యులు అవసరం. ఇతర సిబ్బంది కొరత కూడా ఉంది. జీజీహెచ్‌తో పాటు, పీహెచ్‌సీలలోని వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ నిర్వహిస్తూ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**జీజీహెచ్‌కే ఏమిటీ గోస...**

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో చిన్నపాటి వర్షానికే కొన్ని గదుల్లో నీళ్లు చేరుతున్నాయి. ఎప్పుడు పెచ్చులూడి పడతాయో అని రోగులు బిక్కుబిక్కుమంటున్నారు. రూ.40 కోట్ల వ్యయంతో మాతా, శిశు సంరక్షణ కేంద్రం, అత్యవసర భవనాలను నిర్మించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఏడాది క్రితం ప్రారంభం సైతం చేశారు. లిఫ్టులు లేవనే సాకుతో నేటికీ జీజీహెచ్ నుంచి మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి ప్రసూతి, క్రిటికల్ కేర్ సేవలను తరలించలేదు. రూ.కోట్లు వెచ్చించి పూర్తిచేసిన భవనం ఏడాది నుంచి వృథాగా ఉంటోంది. అసౌకర్యాల మధ్య నెలకు 650 వరకు ప్రసవాలు చేయాల్సి వస్తున్నదని.. లిఫ్టులను ఏర్పాటును చేసి వెంటనే నూతన భవనంలోకి ప్రసూతి విభాగాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నెల 15వ తేదీలోగా పనులు పూర్తవుతాయని ప్రకటించిన అధికారులు.. సకాలంలో ఎంసీహెచ్‌ను ప్రారంభించేలా చూడాలి.

# నీటి వనరుల్లోకే నిర్మాణ వ్యర్థాలు



సిరిసిల్ల : జిల్లాలో గృహ నిర్మాణాల కూల్చివేత, రహదారుల తవ్వకాలతో వచ్చే వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేదు. వ్యర్థాలను వాగులు, చెరువులు, కుంటలు, కాల్వలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నింపుతుండటంతో జలవనరులు వాటి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అధికారులు సకాలంలో వ్యర్థాలను తొలగించటంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో బండరాళ్లు, ఇటుకలు మురుగునీటి కాల్వల్లోకి చేరి వరద, మురుగు ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రహదారులు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి.

**వందల టన్నులు కుమ్మరింపు**

పురపాలికల్లో నిర్మాణ ఘన వ్యర్థాల తరలింపులో సరైన పర్యవేక్షణ లేదు. జిల్లాలోని రెండు పురపాలికల్లో నిత్యం వందల టన్నుల నిర్మాణ వ్యర్థాలు వెలువడుతున్నాయి. వీటిని కొంత మేరకు డంపింగ్‌యార్డులకు తరలిస్తుండగా.. ఎక్కువ మొత్తం సమీపంలోని ఖాళీ స్థలాలు, వాగులు, చెరువు శిఖాల్లో కుమ్మరిస్తున్నారు. నీటి వనరులను స్థిరాస్తిగా మార్చుతూ.. దీంతో అవి క్రమంగా అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల శివారుల్లోనే ఈ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు రోడ్డువిస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా కట్టడాలు తొలగించారు. ఇప్పుడా వ్యర్థాలు పేరుకుపోయి పట్టణవాసులు, భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పురపాలక శాఖ వ్యర్థాల తొలగింపునకు రూ.23లక్షలతో టెండర్లు పిలిచింది. ఈనెల 11న తెరవనున్నారు.

**ప్రతిపాదన మూలకు..**

ఇసుక, ఇటుక, కంకరను నూర్పిడి చేసి పునర్వినియోగ వస్తువుగా మార్చే కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషింగ్ (సీఅండ్‌డీ) ప్లాంటు జిల్లాలో అందుబాటులో లేదు. గతంలో సిరిసిల్ల పురపాలికలో ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు సంస్థతో ఒప్పందం జరిగింది. అప్పుడు పట్టణంలోని మానేరువాగు సమీపంలో ప్లాంటు కోసం ప్రత్యేకంగా స్థలం కూడా కేటాయించారు. నిధుల కేటాయింపులో జాప్యం జరగడంతో ఈ ప్రతిపాదన మూలకు చేరింది. జిల్లాలో సీఅండ్‌డీ ప్లాంటు ఏర్పాటు చేస్తే నిత్యం వేల టన్నుల నిర్మాణ వ్యర్థాల మట్టి, కంకర, ఇసుక మార్చే అవకాశం ఉంటుంది. యంత్రాల సామర్థ్యాన్ని బట్టి గంటకు 20 నుంచి 100 టన్నుల వరకు పొడిగా మార్చవచ్చు. వ్యర్థాలతో ఇటుక, నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని తిరిగి తయారు చేసుకోవచ్చు.

# ఆదివాసీ ఆహారం.. ప్రకృతి ప్రసాదం!



భద్రాచలం ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి అనే పాట భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీల ఆహార, పానీయాలకు చక్కగా సరిపోతుంది. ఏయ్ చాయ్ చటుక్కున తాగరా భాయ్.. ఈ చాయ్ చమక్కులే చూడరా భాయ్ అనే పాటను జ్ఞప్తికి తెస్తుంది అడవిబిడ్డలు తయారుచేస్తున్న విప్ప పువ్వు టీ. సేంద్రియ పద్ధతిలో పండించిన తృణధాన్యాలతో పాటు అడవుల నుంచి సహజసిద్ధంగా లభించే వాటిని తాము తినటమే కాకుండా అందరికీ అందించాలనే ఉద్దేశంతో అడవిబిడ్డలు మార్కెటింగ్ చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను చూడచక్కని బ్రాండ్లు, లేబుళ్లు, ప్యాకింగ్‌తో తయారుచేస్తూ వ్యాపారంలో ముందడుగు వేసేందుకు సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రోత్సాహమందిస్తున్నారు.

**జీసీసీ ఉత్పత్తులకు ఆదరణ..**

గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులకూ ఆదరణ ఉంటోంది. కుంకుడుకాయలను సబ్బులతో పాటు షాంపూల తయారీకి వినియోగిస్తారు. చింత పిక్కలను వస్త్రాలకు పెట్టే గంజి తయారీకి ఉపయోగిస్తుంటారు. విప్ప పలుకును సబ్బుల తయారీకి, కరక్కాయలు, ముష్టిగింజలను ఆయుర్వేద ఔషధాల తయారీకి వాడతారు. తేనె వల్ల రక్తశుద్ధి, చర్మ సౌందర్యం వస్తుంది. ఉసిరిపప్పుతో మధుమేహం తగ్గుతుంది. ఇలా ప్రకృతిలో దొరికేవి ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా మనిషికి ఇవి అవసరమని జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్ జయరాజు వివరించారు.

**ఆహా.. విప్ప టీ..**

చర్ల మండలానికి చెందిన ఆదివాసీ మహిళలు సొంతంగా శిక్షణ పొంది విప్ప పువ్వు లడ్డూలు తయారుచేశారు. వీటికి ఆదరణ లభిస్తుండటంతో విప్ప పువ్వుతో బర్ఫీలు సిద్ధం చేశారు. చిన్నారులు నచ్చే విధంగా దాదాపు పది గ్రాముల బరువు గల చాక్లెట్లను అందుబాటులోకి తెచ్చారు. విప్ప పువ్వును బాగా ఆరబెట్టి.. అందులో మట్టి లేకుండా జాగ్రత్తలు పాటించి విప్ప పూల టీ ప్యాకెట్లను సరికొత్తగా మార్కెటింగ్ చేస్తున్నారు. 250 గ్రాముల బరువు గల ఈ ప్యాకెట్ ధర రూ.95. ఒక్క స్పూన్ విప్ప పువ్వును తగిన మోతాదు వేడినీటిలో కలిపి కప్పు టీ తాగితే నూతనోత్తేజం వస్తుందని ఆదివాసీ మగువలు చెబుతున్నారు. విప్ప పువ్వు ఉత్పత్తులన్నీ సహజసిద్ధమైనవి. పోషక విలువలు గల ఆహారం ఇది. గర్భిణులు, బాలింతలు వాడొచ్చు. సామలు, కొర్రలు, రాగులు, జొన్నలతో తయారుచేసిన బిస్కెట్లను భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ పేరిట విక్రయిస్తున్నారు. వీటి గురించి తెలుసుకున్న ప్రధాని మోదీ అభినందించారు. ఇదే ఉత్సాహంతో తాజాగా వోట్స్, ఊదలు, అండు కొర్రలు, అవిసెలతో బిస్కెట్లు తయారుచేస్తున్నాం. శారీరకంగా ఇవి బలాన్ని అందిస్తాయి. రోగనిరోధకశక్తిని పెంచుతాయి.

లలిత, బిస్కెట్ల తయారీదారు

# కేసుల నమోదుపై ప్రైవేటు ఏజెన్సీ ఆరా!



వికారాబాద్ :ఈనెల 6న వికారాబాద్ ఠాణాలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. ఈ విషయమై కాల్ సెంటర్ నుంచి ఓ యువతి ఇరువర్గాల వారికి ఫోన్ చేసి.. పోలీసుల ప్రవర్తనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డబ్బులేమైనా డిమాండ్ చేశారా.. అని ఆరా తీశారు.మరో కేసులోనూ బాధితుడికి ఫోన్ చేసి.. పోలీసులు పనితీరు సంతృప్తికరంగా ఉందా.. మీతో ప్రవర్తించిన తీరు ఎలా ఉందని వివరాలు అడిగారు.ఠాణాకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు గౌరవంగా వ్యవహరించేలా ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేస్తున్నా చాలాచోట్ల అది అమలు కావడం లేదు. ఠాణాకు వెళ్లిన సాధారణ వ్యక్తులకు సముచిత గౌరవం దక్కడం లేదు. తాగునీరు అందించి కూర్చోమనడం దేవుడెరుగు.. కసురుకోవడంతోపాటు ఫిర్యాదుదారుల సమస్యలను సరిగా వినడం లేదన్న విమర్శలున్నాయి. గొడవలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి వెళితే కనీసం సమస్య వినడానికి ఆసక్తి కనబర్చడం లేదని పలువురు చెబుతున్నారు. ఫిర్యాదు రాసివ్వండి.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు, రాజకీయ నాయకులు చెప్పిన పనికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అభిప్రాయ సేకరణకు..**

ఫిర్యాదుదారుల నుంచి అభిప్రాయ సేకరణ విషయంలో పక్కాగా వ్యవహరిస్తున్నారు. వివరాల సేకరణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. దీనికి పోలీసు శాఖతో ఎలాంటి సంబంధాలుండవు. రోజూ వీరు ఠాణాలవారీగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను సేకరిస్తారు. ఫిర్యాదుదారుడి చరవాణి సంఖ్యకు ఫోన్ చేసి మాట్లాడతారు. ఈ ఫోన్ సంభాషణ అంతా నమోదవుతుంది. వివరాలను హైదరాబాద్‌లోని ప్రధాన నియంత్రణ కేంద్రానికి ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. ఠాణాలో ఫిర్యాదు నమోదైన వెంటనే సంబంధిత వివరాలన్నీ అంతర్జాలంలో ఫీడ్‌బ్యాక్ కేంద్రానికి చేరవేస్తారు. అక్కడి ప్రైవేటు సిబ్బంది వీటిని పరిశీలించాక సంబంధిత ఫిర్యాదుదారుడితోపాటు అవసరమైతే బాధితుడితోనూ మాట్లాడుతున్నారు.


**మర్యాదలో తేడా వస్తే ఊరుకునేది లేదు..** ఠాణాల్లో ఇదివరకటి పరిస్థితి లేదు. ఎంతో మార్పు వచ్చింది. పరుష పదజాలంతో దూషించడం, దండించడం లాంటివి లేవు. ప్రజలతో మమేకమై పనిచేయాలని, ఠాణాలకు ఎవరొచ్చినా పేద, ధనిక తేడా చూపకుండా మర్యాదగా మసులుకోవాలని పోలీసులకు తరచూ చెబుతున్నాం. మర్యాదలో తేడా వస్తే ఊరుకునేది లేదు.

నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి

## అనుబంధం వద్దు.. పంచాయతీలే ముద్దు

కామారెడ్డి : జిల్లాలో ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలని కొన్ని అనుబంధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం గత ప్రభుత్వం జిల్లాలో 208 గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీల సంఖ్య 5328 చేరింది. ఇది వరకు కొత్త పంచాయతీలు ఏర్పాటైన నేపథ్యంలో మరిన్ని పంచాయతీల డిమాండు ఊపందుకుంది. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కొత్త పంచాయతీల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే...** నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ నుంచి ఎర్రారంను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని లేదా పాత పంచాయతీలో విలీనం చేయాలని తండావాసులు ఇదివరకే ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అడివిలింగాల తండాను కొత్తగా ఆవిర్భవించిన కొక్కొండ పంచాయతీలో విలీనం చేశారు. భిక్కనూరు మండలం లక్ష్మీనగర్‌తండా జంగంపల్లి పంచాయతీలో ఉ



ంది. ఈ రెండు గ్రామాల మధ్య దూరం మూడు కి.మీలు కావడంతో ప్రత్యేక పంచాయతీ డిమాండ్ నెలకొంది. మద్నూర్ మండలంలో సలాబత్‌పూర్ ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ ప్రజల్లో ఉంది. ఇది చిన్నశక్కర్గ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది. బీబీపేట పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న రాంరెడ్డిపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**ఈ పరిస్థితి ఎందుకంటే..**

కొత్త పంచాయతీల డిమాండ్లు జిల్లాలో అక్కడక్కడ వినిపిస్తున్నాయి. కొందరు జిల్లా పంచాయతీ అధికారులను కలిసి చాలాసార్లు వినతిపత్రాలు అందజేశారు. మరికొందరు వారి ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. ఈ ప్రత్యేక పంచాయతీల డిమాండ్లకు వివిధ రకాల కారణాలు ఉన్నాయి. చిన్నగ్రామాలు, రెండు మూడు తండాలను కలిపి ఒకే పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ రెండు మూడు తండాలు, గ్రామాల మధ్య దూరం రెండు మూడు కి.మీ దూరం ఉంటుంది. దీంతో ప్రతి పనికి పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు వెళ్లాల్సి వస్తోందని కారణం చెబుతున్నారు. మరొక ముఖ్య కారణం నిధుల పంపకాల్లో తేడాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు మాత్రమే ఎక్కువ నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేసుకుంటున్నారని అనుబంధ గ్రామాల ప్రజల వాదనగా ఉంది. పంచాయతీ ఉన్న గ్రామాల వారికే పదవులు వరించే అవకాశం ఉండడంతో అనుబంధ గ్రామాల వారు అసంతృప్తిగా ఉంటున్నారు.

## హరితం పెంచండి.. ఆదాయం పొందండి

కామారెడ్డి : పర్యావరణ పరిరక్షణ కోసం సర్కారు వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో మొక్కలు నాటుతుంది. అంతకు ముందు హరితహారం పేరుతో మొక్కలు నాటించారు. గతంలో నాటిన మొక్కలు ఇప్పుడు బతికి ఉంటే అవి ఆదాయ వనరులుగా మారనున్నాయి. ప్రభుత్వం తాజాగా కార్బన్ క్రెడిట్ పేరుతో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. దీనిని తెలంగాణ సౌభాగ్యం అని కూడా పిలుస్తున్నారు. ఈ పథకంలో గత మూడేళ్లలో నాటిన మొక్కలు బతికి ఉంటే అవి విడుదల చేసే ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి యజమానులకు డబ్బులు అందనున్నాయి. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాల్లో నాటిన మొక్కలను లెక్కించడానికి త్వరలో సర్వే చేపట్టనున్నారు.

**ప్రభుత్వంతో ఒప్పందం**

ప్రభుత్వం ఢిల్లీలోని పర్యావరణ సంస్థ ఐఎఆర్‌ఏతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పెరిగిన మొక్కలను పరిశీలన చేసి యజమానులకు డబ్బులు చెల్లించడమే దీని ముఖ్య ఉద్దేశం. జిల్లాలో మూడేళ్లలో సుమారు 70 లక్షల వరకు మొక్కలు నాటారు. ఎన్‌పీసీ పోర్టల్‌లో నుంచి నాటిన మొక్కల వివరాలను ఆయా మండలాలకు పంపిస్తున్నారు. సాంకేతిక సహాయకులు చరవాణుల్లో ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వీరు సర్వే చేసే సమయంలో బతికి ఉన్న మొక్కల ఫొటోలు తీసుకుంటారు. ఉపాధిహామీలో వ్యక్తిగతంగా మొక్కలు పెంచితే యజమాని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాపాస్ పుస్తకాల వివరాలను తీసుకుంటారు. సర్వే పూర్తయిన తర్వాత ఐఎఆర్‌ఏ సంస్థ వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారణ చేసుకుంటారు.

**చెల్లింపులు ఇలా..**

సర్వే పూర్తయిన తర్వాత నాటిన మొక్కలు ఏ స్థాయిలో ఉన్నాయి.. అవి ఎంత ఆక్సిజన్‌ను విడుదల చేస్తున్నాయనే విషయాలను సంస్థ వారు లెక్కగడతారు. ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి లెక్కలు ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలో ఇదే అంశంపై కొన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. చాలా మంది రైతులు తమ మొక్కలను ఇతర కంపెనీ వారు కొనుగోలు చేసినట్లా అని ప్రశ్నిస్తున్నారు. అలా కాదని కేవలం ఆక్సిజన్ పరిమాణం ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లిస్తారని అధికారులు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో నాటిన మొక్కలపై పంచాయతీకి డబ్బులు చెల్లిస్తారు. ఈ విషయమై డీఆర్‌డీవో సురేందర్ మాట్లాడుతూ.. కార్బన్ క్రెడిట్ పేరుతో పెరిగిన మొక్కలకు కొన్ని డబ్బులు చెల్లించడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం గ్రామసభలు నిర్వహిస్తున్నాం. తర్వాత వివరాలను రాష్ట్రానికి పంపిస్తాం. పర్యావరణాన్ని సంరక్షించడానికి ఎవరైతే మొక్కలు నాటి పోషిస్తారో వారికి కొంత పారితోషికం అందుతుందని తెలిపారు.

## అంతర్జాల సౌకర్యం.. రోడ్లు ధ్వంసం

సిరిసిల్ల : ప్రస్తుతం ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అంతర్జాల వినియోగం విపరీతంగా పెరిగింది. పట్టణ ప్రజల్లో చాలామంది ఇంటర్‌నెట్ కోసం ఇంట్లో వైఫై సౌకర్యం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనికోసం ఆయా సంస్థలు ఎక్కడపడితే అక్కడ రోడ్లు తవ్వుతూ కేబుల్ తీగలు వేస్తున్నాయి. వీటి ద్వారా వినియోగదారులకు అంతర్జాల సౌకర్యం అందుతున్నాయి. రహదారులకు సరిగ్గా మరమ్మతులు చేయకపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల పట్టణంలో పలు వీధుల్లో రహదారులు ధ్వంసమయ్యాయి.

**ఆయా సంస్థలదే బాధ్యత**

సిరిసిల్ల పట్టణం జిల్లా కేంద్రంగా మారినా తరువాత నివాస గృహాలతోపాటు జనాభా క్రమంగా పెరిగింది. అందుకు అనుగుణంగా పట్టణంలో రోడ్లు మొత్తం 276.91 కి.మీ మేర విస్తరించాయి. ఇందులో బీటీ రోడ్లు 40 కి.మీ.. సీసీ రోడ్లు 137.44 కి.మీ ఉన్నాయి. ఓ వైపు మిషన్ భగీరథ పైపులైన్, నీటి లీకేజీలకు.. మరోవైపు ఇంటర్‌నెట్ కేబుల్ తీగల కోసం సీసీ రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వారు. ఆయా సంస్థలే మరమ్మతులు చేయాలి. కానీ ఎవరు పట్టించుకోవటం లేదు.



దీంతో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో రహదారులు మొత్తం అధ్వానంగా మారాయి. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఒళ్లు హూనం అవుతోందని వాపోతున్నారు.

**ఎక్కడెక్కడ అంటే..**

సిరిసిల్లలో కొత్తచెరువు నుంచి కొత్తబస్టాండ్ రోడ్డుపై, అంబేడ్కర్ రోడ్డు–ఎల్లమ్మ కూడలి వరకు, బస్టాండ్–వెంకంపేట వరకు విచ్చలవిడి రహదారులపై గుంతలు తీశారు. పాత బస్టాండ్ ఎదుట రోడ్డుపై తవ్విన గుంత పెద్దగా మారి ఇప్పుడు ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయంలో గుంత కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. సంబంధిత అధికారులు ఆయా రోడ్లకు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలి. రోడ్లను తవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలి.

## భరోసా కల్పిస్తున్న భవిత కేంద్రాలు

హుజూరాబాద్ : ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి. నడక, మాట, విద్య మెరుగుపడేలా శిక్షణ అందిస్తున్నారు. మానసిక దివ్యాంగులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ మార్పునకు కృషి చేస్తున్నారు. ఈ భవిత కేంద్రాలపై 'న్యూస్‌టుడే' కథనం.

**ప్రయోజనకరంగా ప్రత్యేక శిక్షణ**

మాట్లాడటం, అక్షరాలను గుర్తించటం, చిత్రాలను గుర్తుపట్టడం, పలికించడంలో శిక్షణ ఇస్తున్నారు. మంచి అలవాట్లను నేర్పిస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నారు. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ ద్వారా అవసరమైన వారికి చికిత్సనందిస్తున్నారు. చిన్న చిన్న




వ్యాయామాలు చేయిస్తూ, వారితో సాధన చేయిస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు వీల్‌ఛైర్, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి యంత్రాలు, తొడుగులు, అంధులకు నడిచేందుకు సహాయ కర్రలు వంటివి అందిస్తున్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు, వారి సహాయకులకు నెలకు రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు.

**సొంత భవనాలు పన్నెండే**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 64 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పన్నెండింటికి మాత్రమే సొంత భవనాలున్నాయి. ఇటీవల ఆకట్టుకునే విధంగా రంగులతో తీర్చిదిద్దారు. చాలావరకు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో చిన్నారులు, నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్రాలకు సొంత భవనాలను మంజూరు చేయాల్సి ఉంది.

## దాత పేరిట ఆలయం.. ప్రకృతి శోభితం

ధర్మపురి :ధర్మపురి పట్టణానికి దూరంగా పచ్చని పొలాల పక్కన వెలిసిన అక్కపల్లి శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం భక్తులను ఆకర్శిస్తోంది. చుట్టూ అయిదు మండలాల భక్తులతోపాటు, పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట ప్రాంతం నుంచి తరలి వస్తుంటారు. క్రీ.శ 15వ శతాబ్దంలో ధర్మపురిని విమతాల సైనికులు దోచుకున్న సందర్భంగా ఇక్కడే ధర్మపురి వాసులు తాత్కాలిక గుడారాలు వేసుకొని జీవించినట్లు తెలుస్తోంది. అక్కపల్లి అనే దాత ఈ ఆలయాన్ని నిర్మించడంతో ఆ



పేరు వచ్చినట్లు చెబుతుంటారు. దీనికి ఈశాన్యంలో కోనేరు, అలాగే ఇక్కడి ఆలయంలోపలి నుంచి కాశీ క్షేత్రానికి చేరేలా సొరంగ మార్గం ఉండేదని ఈ ప్రాంత చరిత్రకారులు పేర్కొంటున్నారు. స్థానికులు, భక్తుల భాగస్వామ్యంతోనే ఈ పురాతన ఆలయం అభివృద్ధి చెందింది. మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివస్తారు. గత ప్రభుత్వ హయాంలో సీజీఎఫ్ ద్వారా నిధులు మంజూరయినా పనులు ప్రారంభం కాకపోవడంతో వెనక్కి వెళ్లాయి. ప్రశాంత వాతావరణంలో పట్టణానికి దూరంగా వెలసిలిన ఈ దేవస్థానం ధర్మపురికి వచ్చిన ప్రతి ఒకరిని ఆకర్శిస్తోంది. మరింత అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

# ఆహార శుద్ధి.. కొరవడిన చిత్తశుద్ధి



పెద్దపల్లి : జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు ముందుకు పడటంలేదు. ఔత్సాహిక యువతకు ఉపాధి కల్పించి, ఉత్పత్తులు చేయాలనే ప్రభుత్వం సంకల్పం నెరవేరడంలేదు. అందుబాటులోని కొంత భూముల సేకరణ తప్ప అవసరమైన స్థలాల లభ్యత సేకరించడంలో జాప్యం నెలకొంది. మౌలిక వసతుల అభివృద్ధి పనుల ఊసే కనిపించడలేదు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలోని జిల్లాలో పరిశ్రమలు విరివిగా స్థాపిస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**ఇదీ అసలు సమస్య**

ఆహారశుద్ధి పరిశ్రమలకు కనీసం 400 ఎకరాల్లోపు ఉండాలి

ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో 102 ఎకరాలు గుర్తించారు

సమీప ప్రాంత రైతులు మరికొన్ని భూములు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు సంబంధిత అధికారులు రైతులను ఒప్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి అందుబాటులోని భూముల్లో పరిశ్రమలు నెలకొల్పే చర్యలు చేపట్టడంలేదు

**ఎక్కడి పనులు అక్కడే**

జిల్లాలో సుమారు 2.70 లక్షల ఎకరాల్లో వరి, మిర్చి, పసుపు, మొక్కజొన్న, కూరగాయల సాగు చేస్తున్నారు. వ్యవసాయరంగ పరంగా ఏటా రెండు పంటల్లో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రైస్ మిల్లులు, బియ్యంతో తయారయ్యే తినుబండారాలు, ఇతరత్రా ఉత్పత్తుల తయారీ పరిశ్రమలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) ర్యాకల్‌దేవ్‌పల్లిలో గుర్తించిన స్థలాల్లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్తు వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

**యువతకు నిరాశే**

ఒకేచోట భారీగా భూసేకరణ అవసరం కానుండటంతో లభ్యత కొంత ఇబ్బందిగా ఉంది. అందుబాటులోని స్థలాల్లో ఆహార పరిశ్రమలు ఏర్పాటుచేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జిల్లాలో ఔత్సాహిక యువత దీనికోసం నిరీక్షిస్తున్నారు. భూసేకరణ అయిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

# ఆడించేది ఒకే ఒక్కడు



పెద్దపల్లి : వ్యాయామ విద్య పటిష్ఠంగా లేక క్రీడాకారుల ప్రతిభ మసక బారుతోంది. అపారమైన ప్రతిభ ఉన్నా లక్ష్య చేధనలో గురి తప్పుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా వనరులు, ప్రోత్సాహం లేక నైపుణ్య శిక్షణ కొరవడుతోంది. ఏళ్ల తరబడి వాటి ఖాళీల భర్తీలో ఉదాసీనత నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు(పీడీ) ఉన్నారంటే ఆటలపై ఎంత నిర్లక్ష్యమో స్పష్టంగా కనిపిస్తోంది. శారీరక, మానసిక ప్రశాంతత, ఉత్తమ భవితకు బాటలు వేసేలా వ్యాయామ విద్యను బలోపేతం చేస్తేనే క్రీడా ప్రతిభ వికసించనుంది.

**పరిస్థితికి కారణమిదే**

పాఠశాలల్లోని పీడీలకు పదోన్నతి కల్పిస్తే కళాశాలలకు వెళ్లనున్నారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలతో పదోన్నతులు లేవు.

పదేళ్లుగా పదోన్నతులు కల్పించకపోవడం, ఉన్నవారు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు భర్తీకి నోచుకోవడంలేదు.

పాఠశాల స్థాయిలో కొందరు ఆటలపై పట్టు సాధించి జూనియర్ కళాశాలల్లో రాణించాలనే లక్ష్యం నెరవేరడంలేదు.

అండర్ 19 పోటీలకు దూరం

ఉమ్మడి జిల్లాలోని 50 కళాశాలల్లో 15,948 మంది చదుతున్నారు.

అయితే కరీంనగర్ జిల్లాలో మాత్రం ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు.

దీంతో కళాశాలల్లో అండర్–19 పోటీలకు చాలామంది దూరమవుతున్నారు. గల్లీ నుంచి మొదలుకొని మైదానాల వరకు క్రికెట్‌కు మోజు పెరగడంతో కళాశాలల్లో భిన్న పరిస్థితి నెలకొంది. కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభావంతులైనవారు ఉన్నప్పటికి సరైన శిక్షకులు లేకపోవడంతో సాధన ప్రశ్నార్థకంగా మారింది. ఆటల పోటీ ఊసే కనిపించడంలేదు. విద్యార్థుల ఉత్సాహాన్ని గుర్తించిన కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటుగా శిక్షణ ఇప్పిస్తున్నారు.

**ఇలా చేస్తేనే క్రీడా వికాసం**

ప్రతి కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించడం

ఆటలను ప్రోత్సహించేలా అకాడమీ, అసోసియేషన్ల ఏర్పాటు

చదువుతోపాటు వ్యాయామ విద్యను నిర్బంధంగా మూల్యాంకనం చేయడం

ఆటలతోపాటుగా చదువులోనూ ముందుంటే ఉద్యోగ సాధనకు, తద్వారా జీవనోపాధికి క్రీడలు దోహదపడతాయని అవగాహన కల్పించడం.

ఉమ్మడి జిల్లా వివరాలు

కళాశాలలు: 50

విద్యార్థులు: 15,948

ఫిజికల్ డైరెక్టర్లు: 1

# ట్యాంకులు పూర్తవలే.. పైపులు నీరివ్వలే!



కోరుట్ల : శివారు గ్రామాలను పురపాలికల్లో విలీనం చేయడంతో పట్టణాల విస్తీర్ణం పెరుగుతుండగా ఇందుకు తగ్గట్టుగా వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనాభాకు సరిపడా తాగునీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2023లో అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న పథకంలో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో జిల్లాలోని అయిదు పట్టణాల్లో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**రూ.127 కోట్లతో నిర్మాణాలు**

ప్యాకేజీ–1 కింద జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలను ఎంపిక చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం, ప్రధాన పైప్‌లైన్, కొత్త కాలనీల్లో అంతర్గత పైప్‌లైన్లు, కుళాయిల బిగింపు పనులకు అంచనాలు రూపొందించారు. ఇందుకోసం అయిదు పట్టణాలకు కలిపి మొత్తం రూ.127 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారులు టెండర్లలో పనులు దక్కించుకొని ఏడాది దాటింది. నెలల తరబడి జాప్యం చేసి కొద్ది నెలల కిందట ట్యాంకుల నిర్మాణం ప్రారంభించినా కొన్ని చోట్ల స్థల సమస్యలతో పనులు జరగడం లేదు. ఇటీవల ప్రారంభమైన పైప్‌లైన్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పైపులు వేయడానికి సీసీ రోడ్లను తవ్వుతుండటంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయిదారేళ్ల కిందటే మిషన్ భగీరథ పథకంలో తవ్వి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారని, మళ్లీ ధ్వంసమైతే ఎలా నడవాలని ప్రశ్నిస్తున్నారు.

**సా..గుతున్న నిర్మాణాలు**

జగిత్యాల పట్టణంలో 3 ట్యాంకులు, ఒక సంపు నిర్మించాల్సి ఉండగా రెండు ట్యాంకుల నిర్మాణం కొనసాగుతోంది. మొత్తం 31 కి.మీ.ల పైప్‌లైన్ నిర్మించాల్సి ఉండగా 6.5 కి.మీ.ల మేర పనులు పూర్తయ్యాయి.

కోరుటలో ఒక ట్యాంకు నిర్మాణం పూర్తయింది. 40 కి.మీ.ల పైపులైన్ వేయాల్సి ఉండగా 6.3 కి.మీ.ల పనులు పూర్తి చేశారు.

మెట్‌పల్లి పట్టణ పరిధిలోని ఆరపేటలో ట్యాంకు నిర్మాణం చేపట్టగా స్థల సమస్యతో పనులు నిలిపివేశారు. మరో చోట నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించారు. మొత్తం 29 కి.మీ.ల పైప్‌లైన్ వేయాల్సి ఉండగా 8 కి.మీ. పనులు పూర్తి చేశారు.

రాయికల్‌లో రెండు ట్యాంకుల నిర్మాణానికి స్థల సమస్య నెలకొంది. 20.76 కి.మీ.లు పైపులైన్ వేయాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు.

ధర్మపురిలో రెండు ట్యాంకులు నిర్మించడంతో పాటు 23 కి.మీ.లమేర పైపులైన్లు వేయాలి. ట్యాంకుల పనులు సగం వరకు పూర్తికాగా 5 కి.మీ.ల మేర పైపులైన్ వేశారు.

## చినుకు పడితే.. వణుకే..!

జాజిరెడ్డిగూడెం చినుకు పడితే చాలు.. ఆ చిన్నారులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకుని రాత్రంతా బిక్కుబిక్కుమంటూ.. తెల్లవారు జామును ఇంటి బాట పట్టాల్సి వస్తోంది. ఇదీ అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినుల దయనీయ పరిస్థితి.. కేజీబీవీని పన్నెండేళ్ల కిందట కుంట పక్కనే నిర్మించారు. గతంలో వర్షం వస్తే వరద సాఫీగా వెళ్లడంతో ఎలాంటి సమస్య తలెత్తలేదు. ప్రధానంగా అర్వపల్లిలో రెండు జాతీయ రహదారుల రాకతో రోడ్లు ఎత్తుగా నిర్మించగా, నీళ్లు వెళ్లడానికి కాల్వలు ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదు. దీంతో మూడేళ్ల నుంచి సమస్య తీవ్రమైంది. గతేడాది వానాకాలంలో కురిసిన వర్షానికి విద్యాలయం ఆవరణ నిండి విద్యార్థులు భవనంలోనే చిక్కుకుపోయారు. అధికారులు అప్రమత్తమై బాలికలను మోసుకుని



నీళ్లలోంచి బయటకు పంపించారు. తాజాగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి నీరు చుట్టుముట్టింది. దీంతో విద్యార్థులందరినీ ఇళ్లకు పంపించారు.

**కన్నవారు లేక.. ఎటు వెళ్లాలో తెలియక...**

కస్తూర్బాలో పేద పిల్లలే ఎక్కువగా చదువుకుంటున్నారు. అందులో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు దూరమైన బాలికలు 20 మంది వరకున్నారు. ఇక కన్నవారు ఉపాధి పనులకు ఇతర ప్రాంతాలకు వలసెల్లిన చిన్నారులు సైతం ఉంటున్నారు. దీంతో వర్షం పడిన ప్రతిసారి వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. అలాంటి విద్యార్థులను ఇళ్లకు పంపించాలన్నా, తల్లిదండ్రులు బడికి రావాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నారు. సమీప బంధువులు వచ్చి తీసుకెళ్తున్నారు. డీఈవో అశోక్, జీసీడీవో పూలన్‌లు శుక్రవారం విద్యాలయానికి వచ్చి విద్యార్థులందరినీ పంపించారు. ఒక విద్యార్థినికి తల్లిదండ్రులు లేకపోవడం, ఆమె బంధువు తన అత్త సంరక్షణలో ఉండటంతో రాలేదు. దీంతో సాయంత్రం వరకు ఆ విద్యార్థినిని పంపించడానికి అష్టకష్టాలు పడ్డారు. వర్షం వచ్చినపుడల్లా ఇదే పరిస్థితి అని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎస్‌వో నాగరాణి చెప్పారు.

## 'సరి'కొత్తగా చేయూత!

ఖమ్మం : నూతనంగా ఏర్పడిన మత్స్య సహకార సంఘాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇవ్వనుంది. ఒక్కో సంఘానికి రూ.3లక్షల చొప్పున మంజూరు చేస్తుంది. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి(ఎన్ఎఫ్‌డీబీ) కింద తొలిసారిగా ఈ నిధులు కేటాయిస్తుండటం విశేషం. గతంలో ప్రభుత్వం కొత్త మత్స్య సహకార సంఘాల కోసం మార్గదర్శకాలు వెలువరించింది. సహకార చట్టం కింద నమోదుచేసి, పాలకవర్గాలను ఎన్నుకోవాలని సూచించింది. ఈమేరకు తెలంగాణలో కొత్తగా 311 సంఘాలను రాష్ట్ర మత్స్యశాఖ ఏర్పాటు చేసింది. వాటిని కేంద్ర బృందాలు తనిఖీ చేసి నిబంధనలకు అనుగుణంగా ఉన్న 67 సంఘాలను గుర్తించాయి. 2023, 2024లో నమోదైన సంఘాలకు మాత్రమే ఆర్థికసాయమందించాలని కేంద్రం నిర్ణయించింది. ఈలెక్కన ఖమ్మం 18, భద్రాద్రి జిల్లాలో ఏడు సంఘాలకు లబ్ధి కలగనుంది.

**ఒక్కో సంఘానికి రూ.3 లక్షలు**

ఖమ్మం జిల్లాలో తనగంపాడు, వందనం, బుర్హాన్‌పురం గణేశ్‌నగర్, కుప్పెనకుంట్ల, గోవింద్రాల, మాణిక్యారం, హస్నాబాద్, రామన్నపాలెం, తీర్థాల, విశ్వనాథపల్లి, ఊటుకూరు, భావన్నపాలెం, సందర్లగూడెం సూర్యాతండా, గోపాలపేట, మాదాపురం, ఎర్రబోడు, బల్లేపల్లి, జోగ్గూడెం, భద్రాద్రి జిల్లాలో మర్రిగూడెం, పాములపల్లి, పెద్దిరెడ్డిగూడెం, ఊటుపల్లి, గణేశ్‌పాడు, ఆసుపాక, నాచారం మత్స్య సహకార సంఘాలకు ఆర్థిక సాయం అందనుంది. మొదటి విడతలో రూ.లక్ష చొప్పున, రెండో విడతలో రూ.2లక్షల చొప్పున మంజూరవుతాయి. కంప్యూటర్లు, సామగ్రి తదితరాల కొనుగోలు, వ్యాపారాభివృద్ధి కోసం సంఘాలు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ఒక్కో సంఘంలో 35–50 మంది సభ్యులు ఉంటారు. తొలి విడతలో మంజూరైన సొమ్మును సక్రమంగా వినియోగించినట్లు తనిఖీలో తేలిన తర్వాతే రెండో విడత నిధులను ప్రభుత్వం కేటాయించనుంది. ఇందుకోసం ప్రతి మూడు నెలల పనితీరును పరిగణనలోకి తీసుకుంటుంది. వలలు, తెప్పలు, ఇతర పరికరాలను కొనేందుకు సంఘాల్లోని సభ్యులకు నిధులు మంజూరుచేస్తే వేలాది కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని మత్స్యకారులు కోరుతున్నారు. 'ప్రభుత్వం కేటాయించే నిధులను మత్స్య సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి. సంఘాల అభివృద్ధికి వెచ్చించాలి' అని ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్‌కు తెలిపారు.

## మేల్కొందామా.. పుడమికి మేలు చేద్దామా..

ఖమ్మం : రోజురోజుకూ ప్లాస్టిక్ మహమ్మారి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా నగరపాలిక/పురపాలికలకు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్ ప్లాస్టిక్)ను పూర్తిస్థాయిలో



నివారించేందుకు ఇప్పటికే సిబ్బంది జరిమానాలు విధిస్తున్న విషయం విదితమే. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రజలు ఇతర వస్తువులను వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సర్కారు నిర్దేశించింది. ప్రత్యామ్నాయ వస్తువులను ఉచితంగానే అందించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర వర్గాలను భాగస్వాములను చేయాలని సూచించింది.

**ఉభయ జిల్లాల్లో 4 కేంద్రాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రొంపేడు, కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో చుంచుపల్లి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రఘునాథపాలెం, కూసుమంచి మండలం పాలేరులో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.50లక్షలు కేటాయిస్తుంది. రొంపెడ, చుంచుపల్లిలో ఇదివరకే స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. రఘునాథపాలెం, పాలేరులో స్థల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఖమ్మం నగరంలో ఇప్పటికే బయోమైనింగ్ విధానం అమలవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుతో మరింత ప్రయోజనం చేకూరనుంది.

# ఆస్తుల సేకరణ వేగవంతం

హైదరాబాద్: నగరంలో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్ట్‌లేవీ సకాలంలో పూర్తయిన దాఖలాలు లేవు. రహదారుల విస్తరణ, పైవంతెనలు, మెట్రో, విద్యుత్తు, తాగునీటి, మురుగునీటి, వరద కాల్వ పనులవంటి వసతులకు సంబంధించిన ఏ ప్రాజెక్ట్ చేపట్టినా రైట్ ఆఫ్ వే (పనులు చేపట్టేందుకు కావాల్సిన స్థలం) లేకనే ఆలస్యం అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం భూసేకరణలో



జాప్యమే. మెట్రోరైలు రెండోదశలోని పాతబస్తీ మెట్రోకు ఈ సమస్య లేకుండా చూడాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) దృష్టి పెట్టింది. కేంద్రం అనుమతులు వచ్చేలోపే ఆస్తుల సేకరణ చేపట్టింది. మెట్రోరైలు రెండోదశలో కారిడార్–6ని ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. ప్రతిపాదించారు. ఈమేరకు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం గత ఏడాది నవంబరులో పంపించారు. ఈ ఏడాది ఆఖరు లేదా వచ్చే ఏడాది జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి అనుమతులు వస్తాయనే ఆశాభావంతో అధికారులు ఉన్నారు. ఆలోపే ఆస్తుల సేకరణ పూర్తి చేయాలనేది హెచ్ఏఎంఎల్ లక్ష్యం.

**ఇంకో 250 ఆస్తులు**

మెట్రో మార్గంలో 1100 వరకు ఆస్తులు ప్రభావితం అవుతున్నాయి. వీటిలో ఇప్పటికే 850 ఆస్తులను హెచ్ఏఎంఎల్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. యాజమానులు అంగీకరించడంతో రూ.300 కోట్ల వరకు పరిహారం అందజేశారు. ఆస్తుల సేకరణకు రూ.వెయ్యికోట్ల వరకు అవుతుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈమేరకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించింది. దశలవారీగా నిధులను విడుదల చేస్తోంది.

**అనేక సవాళ్ల నడుమ..**

పాతబస్తీలో ఆస్తుల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఒకదానికొకటి ఆనుకుని ఉన్న భవనాలు, వారసత్వ కట్టడాలు ఉండటంతో వాటికి నష్టం జరగకుండా పనులు చేపట్టారు. కూలీలతో కూల్చివేతలు జరుగుతుండటంతో కొంత ఎక్కువ సమయం పడుతోంది.

# కను'మురుగు' చేసేలా..

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రత్యేక మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి సిద్ధమైంది. నదికి ఉత్తర, దక్షిణంవైపున 1,837 కి.మీ. మేర ప్రత్యేకంగా మురుగునీటి నెట్‌వర్క్‌ను రూపొందించనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు వివిధ ప్రాంతాల మురుగునీటి వ్యవస్థలు ఇందులో భాగం కానున్నాయి. జలమండలికి 15 జోన్ల పరిధిలో ఈ ప్రత్యేక మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రాజెక్ట్‌కు రూ.4,700 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేయగా ఇందులో 70 శాతం వాటాగా రూ.3,290 కోట్లను ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటారు. మిగిలిన 30 శాతం వాటా రూ.1,410 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇవ్వనుంది.



డీపీఆర్‌ను జలమండలి సిద్ధం చేస్తోంది. 2019లో షా కన్సల్టెన్సీ రూపొందించిన మాస్టర్ ప్లాన్ మేరకు 2050 వరకు నగర విస్తరణ, పెరగనున్న జనాభా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికను జలమండలి రూపొందిస్తోంది. **జోన్ 15లో ప్రాంతాలు** నార్సింగి, బాపూఘాట్, హైదర్షాకోట్, అత్తాపూ ర్, అంబర్‌పేట, నాగోల్, నల్లచెరువు, పీర్జాదిగూడ, కొర్రెముల, గౌరెల్లి

# నిర్మల్-జగిత్యాల రోడ్డు విస్తరణ

రాయికల్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్మల్–జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది. జాతీయ రహదారి–61 నిర్మాణ ఏర్పాటుకు 2018లో ప్రాథమిక సర్వే చేపట్టగా.. 2020లో తొలి విడత పనులు నిర్మల్–ఖానాపూర్ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఖానాపూర్ మండలం సుర్జాపూర్ వరకు పనులు పూర్తి కావొస్తున్నాయి. రెండో విడతలో భాగంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఒబులాపూర్ నుంచి జగిత్యాల గ్రామీణ మండలం చల్‌గల్ వరకు పనులకు మోక్షం లభించింది. జాతీయ రహదారులు, రవాణా



మంత్రిత్వశాఖ(ఎంవోఆర్‌టీహెచ్) ఆమోదముద్ర వేసింది. నిర్మల్–జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంతో ఇరు జిల్లాల మధ్య మార్గం మరింత సుగమం కావడంతోపాటు మహారాష్ట్రతోపాటే పలు రాష్ట్రాలకు ప్రయాణం సులువు కానుంది.

**జిల్లాలో 39 కి.మీ మేర..**

మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి ప్రారంభమయ్యే 61వ నంబరు జాతీయ రహదారి.. భైంసా మీదుగా నిర్మల్ వరకు నిర్మాణం జరిగింది. నిర్మల్, జగిత్యాల జిల్లాలో మొత్తం 74 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. గతంలో ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. తొలి విడతలో నిధులు మంజూరుకాగా.. నిర్మల్ నుంచి ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి వరకు 35 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చివరిదశలో ఉంది. రెండో విడత జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ఒబూలాపూర్ నుంచి చల్‌గల్ వరకు 39 కి.మీ మేర పనులు చేపట్టాల్సి ఉంది. తొలి విడతలో నిర్మల్–ఖానాపూర్ పూర్తికాగా.. రెండో విడతలో ఒబులాపూర్–చల్‌గల్ నిర్మాణానికి జిల్లా జాతీయ రహదారుల అధికారులు అలైన్‌మెంట్ ప్రక్రియ పూర్తిచేసి ప్రతిపాదనలు పంపించారు. అనుమతులు రాగానే డీపీఆర్ పూర్తిచేసి భూసేకరణ చేపట్టనున్నారు.

# రైతులకు భరోసా

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసాను ప్రభుత్వం అమలు చేస్తుండటంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4.82 లక్షల ఎకరాలు కాగా 2,82,490 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. 1,39,690 మంది రైతులు లబ్ధిపొందనుండగా రూ.153,28,81,264ల పెట్టుబడి సాయం అందనుంది. ఈ మేరకు జిల్లాలోని 175 రెవెన్యూ గ్రామాలకు చెందిన 1,10,424 మంది రైతులకు సోమ, మంగళవారాల్లో రూ.99,61,65,241లను సర్కారు జమ చేసింది. 1,39,690 మంది రైతులు.. రూ.153.28 కోట్లు

ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంలోనే ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం వ్యవసాయానికి ఊతంగా మారనుంది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 184860 ఎకరాల్లో వరి, 1600 ఎకరాల్లో మొక్కజొన్న, 49760 ఎకరాల్లో పత్తి, 14.04 ఎకరాల్లో జొన్న, 1155.1 ఎకరాల్లో కంది, 79 ఎకరాల్లో పెసర, 6304.96 ఎకరాల్లో ఇతర పంటలు కలుపుకొని మొత్తం 243773.1 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ఇప్పటికే రైతులు బోర్లు, బావుల కింద నార్లు పోసి, వరినాట్లకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని మండలాల్లో పత్తి విత్తనాలను కూడా విత్తారు. మరికొన్ని మండలాల్లో పత్తిని విత్తేందుకు భారీ వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఈ ఏడాది వానాకాలంలో భారీగా దిగుబడి సాధిస్తామనే



ధీమాను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగులో భాగంగా విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. సమయానికి డబ్బులు అందుతుండడంతో ఇతరుల వద్ద చేయిచాచే అవసరం లేకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాల విస్తీర్ణంతో సంబంధం లేకుండా పరిమితులను ప్రభుత్వం తొలగించడంతో ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ సంఖ్యలోని రైతులకు మేలు చేకూరనుంది. అదునులోనే ఎకరానికి రూ. 6 వేల చొప్పున రైతు భరోసా పథకం అమలుతో జిల్లాలో పంటల సాగుబడి కూడా వడివడిగా కొనసాగనుంది.

# స్వీయ మదింపులో ఆగని అక్రమాలు



కరీంనగర్ : పురపాలికల్లో ఆస్తిపన్ను, ఇంటినంబర్ జారీకి సంబంధించిన సెల్ఫ్ అసెస్‌మెంట్(స్వీయ మదింపు) ప్రక్రియలో అక్రమాలు ఆగడం లేదు. ఆన్‌లైన్‌లో ఇళ్ల యజమానులు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే ఆమోదించడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇదే తరహాలో వారం కిందట ఒక గది నిర్మించిన ఇంటినంబర్ కేటాయించడం వివాదాస్పదమైంది.

**కంప్యూటర్ ఆపరేటర్ వారధికి సరెండర్**

అన్నీ సవ్యంగా ఉన్న ఇళ్లకు నంబర్లు ఇవ్వకుండా దాటేస్తున్న రెవెన్యూ అధికారులు, రేకుల షెడ్డుతో ఒక గది నిర్మించి.. అందులో నివాసముండకున్నా ఎలా ఇస్తారని ఫిర్యాదు రావడంతో కమిషనర్ విచారణకు ఆదేశించారు. ముందుగా సంబంధిత ఆర్‌ఐకి మెమో ఇవ్వడంతో అసలు విషయం బయటకు వచ్చింది.

మార్చి నెలలో రెవెన్యూ అధికారులంతా ఆస్తి పన్నుల వసూళ్లపై ఉండగా ఓ ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించిన అసెస్‌మెంట్ పూర్తి చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్‌కు సూచించారు. ఎలాంటి విచారణ చేయకుండా ఓ ఇంటికి సంబంధించిన ఒక గదికి సంబంధించిన అసెస్‌మెంట్ చేసినట్లు తేలింది.

ఆ సమయంలో పని చేసిన ఆర్ఐ, డిప్యూటీ కమిషనర్ లాగిన్లతో ఉత్తర్వు జారీ అయినట్లు సమాచారం. దీనిని తీవ్రంగా పరిగణించి ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ అజిత్‌రావును వారధికి సరెండర్ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహిదుద్దీన్ తెలిపారు.

**తప్పుడు నమోదుకు 25 రెట్ల జరిమానా..**

నిర్మాణం పూర్తయిన తర్వాతే ఇంటి నంబర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఒక గది కాకుండా కుటుంబం నివసించేలా ఉంటే తప్ప అసెస్‌మెంట్ కాదు. గత ప్రభుత్వ హయాంలో స్వీయ మదింపు చేసుకునే విధానాన్ని తీసుకు రావడం అక్రమాలకు తావిచ్చింది.

శివారు ప్రాంతాల్లో మైదానాల్లో కూడా గుడిసెలు వేసుకొని ఇంటినంబర్లు వేసుకొని ప్లాట్లు చేసుకొని విక్రయించుకున్నారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదులు రావడంతో నేరుగా ఇచ్చే విధానాన్ని నిలిపి వేసి, క్షేత్రస్థాయి పరిశీలన చేసేలా లాగిన్లను ఇచ్చారు. అప్పటి నుంచి పరిశీలించిన తర్వాతే ఆస్తిపన్ను, ఇంటినంబర్ కేటాయింపు చేస్తున్నారు. ఇంటి విస్తీర్ణం, కొలతలు తప్పుగా నమోదు చేస్తే రెవెన్యూ అధికారులు పరిశీలించి 25 రెట్లు జరిమానా విధించే అవకాశముంది.

# ఇక్కడ పని చేయదు.. అక్కడ మొరాయిస్తది



కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎక్స్‌రేలు పని చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సిబ్బందికి అవగాహన లేకపోవడంతో టీ–హబ్ సమీపంలోని రేడియాలజీ హబ్‌కు వెళ్లాలని సూచిస్తున్నారు. అక్కడ కూడా కొన్నిసార్లు యంత్రం మొరాయిస్తోంది. సాంకేతికంగా ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కొందరు రోగులు వారి సమయం వచ్చే వరకు ఓపికగా ఎదురుచూసి ఎక్స్‌రే తీయించుకుంటుండగా మిగతా వారు వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**తరచూ మరమ్మతుకు..**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ప్రతిరోజు బయటి విభాగం (ఓపీ) 500 వరకు ఉంటుంది. ఇందులో దాదాపు 100కుపైగా ఆర్థో కేసులు ఉంటాయి. ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు విరిగిన వారితోపాటు వయసు పెరిగిన కొలదీ వచ్చే సమస్యలు మోకాళ్లు అరగడం, ఇతరత్రా ఉంటాయి. వీటితోపాటు గొడవల ఘటనల్లో గాయపడిన వారిని పోలీసులు మొదట ఇక్కడకే పంపిస్తారు.

ఎక్స్‌రే యంత్రాలు కొన్నేళ్ల కిందటివి కావడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. వాటి స్థానంలో కొత్త వాటికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకపోవడంతో మరమ్మతు చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. ఆసుపత్రిలో యంత్రాలు పాడవడంతో మొదట రోగులను సమీపంలోని రేడియాలజీ హబ్‌కు పంపుతున్నారు. ఇక్కడ 'ఆరోగ్య మహిళ'కు మొదటి ప్రాధాన్యం ఇస్తుంటారు. హబ్‌లో రద్దీ అధికం కావడంతో సాంకేతిక సమస్యలతో యంత్రం మొరాయిస్తోంది. ఆలస్యంగా ఎక్స్‌రేలు తీస్తుండటం.. కొన్నిసార్లు సిబ్బంది యంత్రం పని చేయడంలేదని వివరాలు నమోదు చేయడానికి వెనుకాడుతున్నారు.

ఆసుపత్రిలో ఎక్స్‌రే యంత్రాలు మొత్తం అయిదు వరకు ఉండగా, వాటికి అనుబంధంగా ఉండాల్సిన మిషనరీలో సాంకేతిక సమస్యలు రావడంతో సరిగా పని చేయడం లేదు.

**సాంకేతిక సమస్యతో..**

శనివారం ఉదయం ఎక్స్‌రే యంత్రంలో కొంత ఇబ్బంది ఉంటే టీహబ్‌కు పంపించాం. మధ్యాహ్నం నుంచి పని చేసింది. ఇటీవల కొత్తగా వచ్చిన యంత్రం తరచూ సాంకేతిక సమస్యతో ఆగిపోతోంది. ఇంజినీర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. సీఆర్ యంత్రాల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ నవీనా, ఆసుపత్రి ఆర్‌ఎంవో

# అంజన్న ఆలయ భూమికి రక్షణ కరవు!

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. స్వామివారి పేరిట మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో దాదాపు 42 ఎకరాల విలువైన భూములున్నాయి. వీటికి తోడు ఏడేళ్ల కిందట రెవెన్యూ శాఖ పరిధిలోని 333 ఎకరాలను అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ ఆలయానికి స్వాధీనం చేశారు. కొండగట్టు దిగువ ప్రాంతంలోని స్టేజీ వద్ద 380సి సర్వే నంబరులో ఆలయానికి చెందిన 1.21 ఎకరాల స్థలం ఉంది. దీని సంరక్షణకు అధికారులు ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు తాత్కాలిక షెడ్లు వేసుకొని వినియోగించుకుంటున్నారు. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి పక్కన గల ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో కొందరు ఆలయ భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో అధికారులు నిలిపివేయించినా ఇప్పటివరకు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. బొజ్జపోతన్న గుడి సమీపంలోని ఆలయ భూమి కూడా కొంత ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఆలయ మాన్యాల సంరక్షణకు దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



**ఆలయ స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తాం**

కొండగట్టు దిగువ ప్రాంతంలోని స్టేజీ వద్ద ఆలయ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తొలగించి స్థానికుల సహకారంతో కల్యాణమండపం, దుకాణ భవన సముదాయం నిర్మిస్తాం. గదులను కొన్నేళ్లపాటు స్థానిక వ్యాపారులకు అద్దెకు ఇస్తాం. ఆలయం పేరిట ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం.

శ్రీకాంతరావు, ఈవో

# మాఫియా మయం.. ఇసుక మాయం

సిరిసిల్ల: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు ఇసుకను రెవెన్యూశాఖ వే బిల్లులు జారీ చేస్తోంది. దీనికోసం మానేరు, మూల వాగులో ఆరు ప్రాంతాల్లో రీచ్‌లను గుర్తించారు. ఒక్కో మండలానికి వారంలో రెండు రోజుల చొప్పున వేబిల్లులు ఇస్తారు. ఇదంతా అధికారికంగా జరిగేతంతు. వర్షాలు భారీగా కురిస్తే నెలల తరబడి వాగుల్లోంచి ఇసుక తీయడం సాధ్యం కాదు. దీనికి అక్రమార్కులు ముందుగానే సిద్ధమయ్యారు. వాగుల్లో అక్రమంగా తవ్వుతూ.. ట్రాక్టర్లలో తరలిస్తూ జిల్లా సరిహద్దుల్లో ఎవరికీ అనుమానం రాని ప్రాంతాల్లో నిల్వలు చేస్తున్నారు. వీటిని తరలించడంలోనూ ఒక మాఫియాను తలపించేలా ఉంటుంది.

**తనిఖీ కేంద్రాల్లేకే..**

జిల్లా సరిహద్దులో కరీంనగర్ రహదారిలో నర్సింగాపూర్, సిద్దిపేటవైపు జిల్లెల, కామారెడ్డి మార్గంలో పెద్దమ్మకూడలిలో పోలీసులు, రెవెన్యూ చెక్‌పోస్టులు ఉండేవి. వీటిని ఎన్నికల సమయాలు, బక్రీదుకు ముందు



మాత్రమే సిబ్బంది ఉంటారు. మిగతా సమయాల్లో ఇక్కడ ఎవరూ ఉండరు. దీంతో అక్రమార్కుల రవాణాలకు అడ్డే ఉండదు. జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఎన్నికలు, శాంతిభద్రతల సందర్భాల్లో మాత్రమే తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే నిరంతరం పర్యవేక్షణ, తనిఖీలు ఉండటంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది.

**ఎలా తరలుతోందంటే..**

జిల్లాలో తంగళ్లపల్లి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి, ఇల్లంతకుంట ప్రాంతాలకు చెందిన కొందరు ఒక బృందంగా ఏర్పడి రాజకీయ పలుకుబడితో దందాకు తెరతీశారు. ప్రధానంగా ఇల్లంతకుంట మండలం మానేరు వాగు సమీపంలోని పొత్తూరు, కందికట్కూరు, మల్లాపూర్ గ్రామాల పరిధిలో ఇసుకను తవ్వుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా జిల్లా సరిహద్దు గ్రామం సిరికొండ అటవీ ప్రాంతంలో నిల్వలు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఇసుక రీచ్‌లను మూసివేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసమని తవ్వకాలు జరుపుతున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించరు.

ట్రాక్టర్‌తో తరలిస్తున్నప్పుడు అధికారులు ఆపితే ఇందిరమ్మ ఇంటి కోసమని చెబుతున్నారు. వేబిల్లు చూపించని వారికి పెనాల్టీ.. లేకుంటే సాఫీగా వెళ్తున్నారు.

**నిల్వచేసిన ఇసుకను రాత్రి సమయాలు..** సెలవు రోజుల్లో లారీల్లో నింపి సిద్దిపేట, కామారెడ్డి, హైదరాబాద్‌లకు తరలిస్తున్నారు. లారీల్లో ఇసుక తరలించే ముందు ఎక్కడా తనిఖీలు జరగట్లేదని నిర్ధారించుకున్నాకే బయలుదేరుతారు. అనుమానం వస్తే మధ్యలోనే ఉండిపోతారు. ఇసుక వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతంలోని రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ద్విచక్రవాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# చిన్నబోతున్న కమతం!


ఎల్లారెడ్డిపేట: మెట్టప్రాంతమైన జిల్లాలో వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. భూగర్భజల మట్టాల పెరుగుదలలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. వ్యవసాయానికి దన్నుగా నిలిచే గొట్టపు బావులు వెనక్కి తగ్గుతున్నాయి. ఓ వైపు ఎండల తీవ్రత.. మరోవైపు ఈదురు గాలుల ధాటికి వరినాట్ల కోసం సిద్ధం చేసిన దుక్కులు, నాట్లు వేసిన కమతాల్లోని నీరు ఆవిరై తడారి చిన్నబోతున్నాయి. సమృద్ధిగా వర్షాలు లేక వ్యవసాయ పనుల ప్రక్రియ తడబడుతూ 'సాగు'తోంది.

**జలధార తగ్గుముఖం**

జిల్లాలో 600లకుపైగా చెరువులున్నాయి. వాటిలో కొన్ని చెరువులు పూర్తిగా వట్టిపోగా మరికొన్ని చెరువులు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. భూగర్భజల మట్టాలు ఒక్కసారిగా పెరిగి, అదే స్థాయిలో కిందికి దిగజారడం జిల్లాలో పరిపాటి. ఈ వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడంతో ఆ ప్రభావం భూగర్భజల మట్టాలపై పడుతోంది. బోరుబావుల్లో జలధార తగ్గుముఖం పడుతోంది. చాలా చోట్ల పాతాళగంగ పైకిరావడం లేదు.

జూన్‌లో సగటున భూగర్భజల మట్టాలు 10.53 మీటర్లలో ఉన్నాయి. 18.52 మీటర్ల లోతుతో వేములవాడ అర్బన్ ప్రమాద ఘంటికలను మోగిస్తుండగా 17.80 మీటర్ల లోతుతో ఎల్లారెడ్డిపేట మండలం రెండోస్థానంలో నిలుస్తోంది. ఒక్క చందుర్తి మండలంలో అతి తక్కువ లోతు 5.65 మీటర్లలో లభిస్తున్నాయి.

గతేడాది నవంబరు మాసంతో పోల్చితే ఈ సంవత్సరం జూన్‌లో



4.65 మీటర్ల లోతుకు భూగర్భజలాలు వెళ్లాయి. గత సంవత్సరం జూన్ మాసానికి ఈ ఏడాది జూన్‌తో సరిచూస్తే 0.99 మీటర్లు పెరిగాయి. ఈ సంవత్సరం మే మాసానికి జూన్‌తో పోల్చితే 0.48 మీటర్ల మేర పెరిగాయి. ఇది స్వల్పమే. భూగర్భజల మట్టాల్లో చెప్పుకోదగిన పెరుగుదల లేకపోవడం అనేది ఆందోళనకర విషయం.

**ఆగస్టు వరకు 'నాటు'కోవచ్చు..**

జులై నెలాఖరు వరకు పెసర, మక్క, కంది తదితర ఆరుతడి పంటలు వేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆగస్టు నెలాఖరు వరకు వరి పంటను సాగు చేసుకోవచ్చని చెబుతుండటం వర్షాధార రైతులకు కాస్త ఊరటనిచ్చే అంశం.

# విస్తరణ.. విస్మరణ

గిద్దలూరు : రాయలసీమ ప్రాంత వాసులు రాజధానిని సులువుగా చేరుకునేందుకు 544డీ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. అనంతపురం జిల్లా బుగ్గ నుంచి గిద్దలూరు వరకు 135 కిలోమీటర్ల రహదారి తోపాటు వినుకొండ నుంచి గుంటూరు వరకు 84.80 కిలోమీటర్ల రహదారిని రెండు ప్యాకేజీలుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. అనంతపురం-గుంటూరు మార్గంలో గిద్దలూరు నుంచి వినుకొండ వరకు 112 కిలోమీటర్ల మేర రహదారి మాత్రం విస్తరణకు నోచుకోలేదు. దీనికి డీపీఆర్ సిద్ధం చేసి ఉంటే రహదారి నాలుగు వరుసలుగా మారేది.

రాష్ట్ర ప్రభుత్వం గిద్దలూరు – వినుకొండ మార్గాన్ని నాలుగు వరుసలుగా మార్పు చేయాలని ప్రతిపాదనలను కేంద్రానికి పంపించకపోవడంతో అనుమతులు రాలేదు. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా మార్పు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తే కడప, కర్నూలు, పశ్చిమ ప్రకాశం తదితర ప్రాంతాల ప్రజలు వేగంగా, సులువుగా రాజధాని ప్రాంతానికి చేరుకునే అవకాశం కలుగుతుంది. కంభం, బేస్తవారపేట పట్టణాల్లో బైపాస్‌లు వచ్చే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఉన్న ఈ రహదారిలో కడప వైపు నుంచి వచ్చే వాహనాలు జిల్లాలోని కొమరోలు మండలం



మోటు వద్ద జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. కర్నూలు ప్రాంతం నుంచి వచ్చేవారు పెద్దారవీడు మండలం కుంట వద్ద 544డీ జాతీయ రహదారిపైకి వస్తున్నారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతంలోనూ నాలుగు వరుసలుగా మార్పు చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్‌హెచ్ఏఐ పీడీ పార్వతీశం మాట్లాడుతూ జాతీయ రహదారి 544డీలో అనంతపురం–గిద్దలూరు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్‌లు సిద్ధమై కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల నిర్మాణం పూర్తయిన అనంతరం వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. దాన్ని ఆధారంగా గిద్దలూరు–వినుకొండ మార్గాన్ని నాలుగు వరుసలుగా మార్పు చేసే అవకాశం ఉందని తెలిపారు.

# ఉపాధికి ఊపిరి!

ప్రకాశం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2018–19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియలో కదలిక వచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి సుమారు 19,393 పనులకు రూ.16.17 కోట్ల మేర బిల్లుల బకాయిలున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని చెల్లించకుండా వదిలేసింది. వివిధ శాఖలకు చెందిన నాణ్యత విభాగం అధికారులతో తనిఖీలు చేయించి నివేదికలిచ్చినా బిల్లులు మాత్రం ఇవ్వలేదు. ఫలితంగా 2018–19 మధ్యకాలంలో ఉపాధిహామీ పథకం మెటీరియల్ నిధులతో పనులు చేసినవారు ఆర్థికంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లుల బకాయిలు విడుదల చేయాలని కేంద్రానికి విన్నవించింది. ఇందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అనుమతి ఇవ్వడంతో బిల్లుల బకాయిల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అనుమతులిచ్చింది. ఈ మేరకు జిల్లాల వారీగా బిల్లుల వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులను ఆదేశించింది. పనుల వివరాల నమోదులో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. పూర్తి వివరాలను మరో రెండు రోజుల్లోగా నమోదు చేయనున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేశాక ప్రభుత్వం బిల్లుల మొత్తం విడుదల చేయనుంది.

**సీసీ రహదారులవే ఎక్కువ**

2018–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకం అనుసంధాన నిధులతో గ్రామాల్లో ఎక్కువగా సిమెంటు రహదారుల నిర్మాణ పనులు చేపట్టారు. వీటి బిల్లులే ఎక్కువ శాతం బకాయిలున్నాయి. మురుగు కాలువలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, మినీ గోకులాలు, మండల మహిళా సమాఖ్య భవనాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, పక్కాగృహాల నిర్మాణాల్లో భాగంగా 90 రోజుల పనిదినాలకు సంబంధించి నగదు చెల్లింపులు బకాయి పడ్డాయి. బిల్లుల నిలుపుదల కారణంగా పలు చోట్ల నేటికీ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్లలో బిల్లుల బకాయిలుండడంతో 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టింది.

# సాగర్ జలాలు వచ్చేశాయి!

చాట్రాయి : సాగర్ జలాలు ఉమ్మడి కృష్ణా జిల్లా ఎడమ కాల్వలో సవ్వడి చేస్తున్నాయి. శనివారం ఖమ్మం జిల్లా కుంచపర్తి 102 కి.మీ. వద్ద లాకుల నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వాస్తవానికి రబీలో ఇవ్వాల్సి ఉండగా జలాశయంలో వరద భారీగా చేరింది. ఉమ్మడి కృష్ణాలో సాగర్ ఆయకట్టులో నీటి ఎద్దడిని దృష్టిలో



పెట్టుకుని 'ఈనాడు'లో ఆగస్టు 1న 'సాగర్ జలాలు చేరువయ్యేనా..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. నూజివీడు నియోజకవర్గంలో సాగర్ జలాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి పార్థసారథి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడగా సానుకూలత వ్యక్తం చేశారు. దీనిపై 'ఈనాడు'లో 'సాగర్ జలాలు వచ్చేనా.. వరి పండేనా' శీర్షికతో శనివారం కథనం ప్రచురితమైంది. శనివారం జలాలను విడుదల చేయగా సాయంత్రానికి 117 కి.మీ. లాకుల వద్దకు చేరాయి. వీటిని నేరుగా దిగువకు విడుదల చేసేందుకు ఎన్నెస్పీ అధికారులు సన్నాహాల్లో ఉన్నారు. మంత్రి పార్థసారథి స్థానిక ఎన్నెస్పీ ఈఈ రాందాస్‌ను తెలంగాణ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడాలని చెప్పారు. ఎడమ కాలువ 112 కి.మీ. లాకుల నుంచి 1500 క్యూసెక్కుల నీరు ఇవ్వాలని తెలంగాణ ఎన్నెస్పీ అధికారులను కోరినట్లు రాందాస్ తెలిపారు. పదిహేను రోజులు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. సాగర్ జలాలు రావడంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# ఇంకా 'ప్రైవేటు' పెత్తనమే!!



విశాఖ : దేశంలో ఎంపిక చేసిన నగరాలను అత్యాధునికంగా తీర్చిదిద్దడానికి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ 2015లో స్మార్ట్ సిటీ ప్రాజెక్టును ప్రారంభించింది. ఏడాదికి 20 నగరాల చొప్పున ఎంపిక చేయాల్సి ఉండగా, అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం.వెంకయ్య నాయుడు విశాఖ నగరానికి తొలి జాబితాలోనే చోటు కల్పించారు. ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీసీఎల్)ను ఏర్పాటు చేశారు.

**ప్రైవేటు ఏజెన్సీలతో:** ఈ ప్రాజెక్టులో ప్రజాప్రతినిధుల జోక్యం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనలు రూపొందించి అమలు చేశారు. నగరంలో జీవీఎస్‌సీసీఎల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ మరో రూ.500 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టడానికి కేంద్రం అనుమతించింది.

అయితే జీవీఎస్‌సీసీఎల్ ద్వారా అధికారులు రూ.1,967 కోట్లతో 59 ప్రాజెక్టుల పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రాజెక్టు జీవీఎంసీకి కేటాయించినా... దాన్ని స్మార్ట్ సిటీ ద్వారా చేపట్టేలా జీవీఎస్‌సీసీఎల్‌లో భాగ స్వామ్యులైన కొందరు ఒత్తిడి తీసుకొచ్చారనే ఆరోపణలున్నాయి.

**వారికే అధిక ప్రాధాన్యం:** సిటీస్ (సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టైన్) పథకం ద్వారా నగరంలోని పాఠశాలల్ని అభివృద్ధి చేయడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం రూ.65 కోట్లు ఇవ్వడానికి ముందుకొస్తే, ఆయా పనుల్ని జీవీఎంసీ చేపట్టకుండా స్మార్ట్ సిటీకి అప్పగించారు.కేవలం 1700 ఎకరాల పరిధిలో మాత్రమే స్మార్ట్ సిటీ ప్రాజెక్టును అమలు చేయాల్సి ఉన్నా, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో రూ.902 కోట్లతో చేపడుతున్న భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులను వారికే అప్పగించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.172 కోట్లతో నగరంలో నిర్మించతలపెట్టిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల పనులను జీవీఎస్‌సీసీఎల్ ద్వారానే చేపట్టాలని పేర్కొనడం గమనార్హం. కొందరు చెప్పినట్లే ఇక్కడి కార్యకలాపాలు సాగుతున్నాయి.

**మార్చితో గడువు ముగిసినా:** దేశంలో స్మార్ట్ ప్రాజెక్టుల గడువు 2025 మార్చితో ముగిసింది. ఇతర నగరాల్లో స్మార్ట్ సిటీ ప్రైవేటు ఏజెన్సీలను మూసేసి, అప్పటి వరకు పూర్తయిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న పనులను స్థానిక సంస్థలకు అప్పగించారు.

విశాఖలో మాత్రం ఇంకా ప్రైవేటు ఏజెన్సీల పెత్తనమే కొనసాగుతోంది. వారిని కొనసాగించడం వెనుక మున్సిపల్‌శాఖలోని ఉన్నతాధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.

జీవీఎంసీ ఆస్తులు తనఖా పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తున్న జీవీఎస్‌సీసీఎల్ కార్యకలాపాలపై విచారణ జరపాలని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు.

ప్రైవేటు ఏజెన్సీలతో: ఈ ప్రాజెక్టులో ప్రజాప్రతినిధుల జోక్యం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనలు రూపొందించి అమలు చేశారు. నగరంలో జీవీఎస్‌సీసీఎల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ మరో రూ.500 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టడానికి కేంద్రం అనుమతించింది.

అయితే జీవీఎస్‌సీసీఎల్ ద్వారా అధికారులు రూ.1,967 కోట్లతో 59 ప్రాజెక్టుల పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రాజెక్టు జీవీఎంసీకి కేటాయించినా... దాన్ని స్మార్ట్ సిటీ ద్వారా చేపట్టేలా జీవీఎస్‌సీసీఎల్‌లో భాగ స్వామ్యులైన కొందరు ఒత్తిడి తీసుకొచ్చారనే ఆరోపణలున్నాయి.

**వారికే అధిక ప్రాధాన్యం:** సిటీస్ (సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టైన్) పథకం ద్వారా నగరంలోని పాఠశాలల్ని అభివృద్ధి చేయడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం రూ.65 కోట్లు ఇవ్వడానికి ముందుకొస్తే, ఆయా పనుల్ని జీవీఎంసీ చేపట్టకుండా స్మార్ట్ సిటీకి అప్పగించారు.

కేవలం 1700 ఎకరాల పరిధిలో మాత్రమే స్మార్ట్ సిటీ ప్రాజెక్టును అమలు చేయాల్సి ఉన్నా, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో రూ.902 కోట్లతో చేపడుతున్న భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులను వారికే అప్పగించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.172 కోట్లతో నగరంలో నిర్మించతలపెట్టిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల పనులను జీవీఎస్‌సీసీఎల్ ద్వారానే చేపట్టాలని పేర్కొనడం గమనార్హం. కొందరు చెప్పినట్లే ఇక్కడి కార్యకలాపాలు సాగుతున్నాయి.

మార్చితో గడువు ముగిసినా: దేశంలో స్మార్ట్ ప్రాజెక్టుల గడువు 2025 మార్చితో ముగిసింది. ఇతర నగరాల్లో స్మార్ట్ సిటీ ప్రైవేటు ఏజెన్సీలను మూసేసి, అప్పటి వరకు పూర్తయిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న పనులను స్థానిక సంస్థలకు అప్పగించారు.

విశాఖలో మాత్రం ఇంకా ప్రైవేటు ఏజెన్సీల పెత్తనమే కొనసాగుతోంది. వారిని కొనసాగించడం వెనుక మున్సిపల్‌శాఖలోని ఉన్నతాధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.జీవీఎంసీ ఆస్తులు తనఖా పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తున్న జీవీఎస్‌సీసీఎల్ కార్యకలాపాలపై విచారణ జరపాలని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు. పూర్తిగా సమీక్షిస్తాం: 'జీవీఎస్‌సీసీఎల్ చేపట్టిన ప్రాజెక్టులపై సమీక్షించి, ఆదాయ, వ్యయాలపై వివరణ కోరతాం. గడువు ముగిసిన నేపథ్యంలో ఆయా ఏజెన్సీలను రద్దు చేసి, అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను, పెండింగ్ పనులను జీవీఎంసీకి అప్ప గించేలా చర్యలు చేపడతాం' అని మేయర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# మారేందుకు మార్గం.. మానేందుకు వైద్యం



అనకాపల్లి : మద్యం తాగడం నీకు ఆనందం కావచ్చు. అది నీ కుటుంబానికి ఎంత విషాదమో తెలుసా? ఈ మాట మందుబాబులకు ఎవరు చెప్పినా వినరు. కానీ ఈ అలవాటు వల్ల ఆర్థికంగా చితికిపోయి.. ఆరోగ్యంగా నష్టపోయి.. తప్పు తెలుసుకుని ప్రస్తుతం గౌరవప్రదంగా జీవిస్తున్న వ్యక్తి తన అనుభవాలుగా చెబితే కొందరిలో అయినా మార్పు వస్తుంది. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం వ్యసన విముక్తి కేంద్రాల్లో కొత్త మార్పులు తీసుకొస్తోంది. వీటిలో పీర్ ఎడ్యుకేటర్‌గా దురలవాట్లను జయించిన వారిని నియమించి వారితో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. మద్యం తాగే అలవాటు ఇటీవల కాలంలో చాలా ఎక్కువైంది. సరదాగా మొదలెట్టిన కొద్దిరోజుల్లోనే అలవాటుగా మారుతోంది. ముఖ్యంగా యువత జీవితాలను నాశనం చేస్తున్న ఈ అలవాటును మాన్పించే లక్ష్యంతో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో దీనిని 2020లో ఏర్పాటుచేశారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఇది సక్రమంగా పనిచేయలేదు. వైద్యాధికారి పోస్టు సైతం భర్తీ చేయకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో దీని ఏర్పాటు లక్ష్యం అటకెక్కింది. అసలు ఈ కేంద్రం అంటూ ఒకటి ఉందని చాలామందికి తెలియని పరిస్థితి నెలకొంది. వైకాపా హయాంలో నాసిరకం మద్యం తాగి చాలామంది ఆసుపత్రి పాలయ్యేవారు. వీరికి చికిత్స అందించేవారే కానీ మాన్పించే చర్యలు అంతగా చేపట్టేవారు కాదు.

**పోలీసుల చొరవ:** కూటమి ప్రభుత్వ హయాంలో వ్యసన విముక్తి కేంద్రాల బలోపేతానికి చర్యలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రాన్ని మూడునెలల క్రితం ఎస్పీ తుహిన్‌సిన్హా పరిశీలించారు. రెండో అంతస్తులో ఉన్న ఇన్‌పేషెంట్ వార్డును గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చాలని సూచించారు. వైద్యాధికారులు ఈ సూచన అమలుచేసి వార్డును మార్చారు. జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని గుర్తించి కేసులు నమోదు చేయడమే కాకుండా తరచూ దొరుకుతున్న వారిని స్వయంగా పోలీసులే వ్యసన విముక్తి కేంద్రానికి తీసుకొస్తున్నారు.

వ్యసన విముక్తి కేంద్రానికి రోజూ 20 ఉంచి 30 మంది బాధితులు వస్తుంటే.. వీరిలో ఐదు నుంచి ఆరుగురు బాగా అలవాటు పడిన వారుంటున్నారు. వారిని వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. 10 నుంచి 15 రోజులు చికిత్స అందించి ఇంటికి పంపుతారు.

ఇంటికి వెళ్లాక మళ్లీ పాత అలవాటువైపు మళ్లుతున్నారా అనేది ఫోన్ చేసి కౌన్సిలర్లు కుటుంబ సభ్యులతో ఆరా తీస్తున్నారు. ఇలా ఈ కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇంతవరకు సుమారు 1200 మందితో మద్యం తాగే అలవాటు మానిపించగలిగారు.

కేంద్రంలో వైద్యాధికారి, ముగ్గురు కౌన్సిలర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు వార్డ్‌బాయ్స్, డీఈఓ విధులు నిర్వహిస్తున్నారు కొత్తగా పీర్ ఎడ్యుకేటర్, యోగాథెరపిస్టు సిబ్బంది పోస్టులను భర్తీ చేయనున్నారు.

**పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం**

మద్యపానం దురలవాటు మానిపించేలా వ్యవస విముక్తి కేంద్రంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రంలో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలోని ఆసుపత్రుల పరిధిలో వ్యసనపరులు చికిత్సకు వస్తే వారిని అనకాపల్లి కేంద్రానికి పంపి అలవాటు మానిపించేలా చర్యలు తీసుకుంటున్నాం. చాలా మందిలో మార్పు వస్తోంది.

డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్‌ఎస్, అనకాపల్లి

# పరిపూర్ణం.. అప్పన్న స్వామి రూపం

సింహాచలం : ఏ ఆలయంలోనైనా మూలవిరాట్టును స్థిరమైన రూపంలో చూడొచ్చు. పర్వదినాలు, ప్రత్యేక రోజుల్లో అలంకరణలో మార్పులు జరుగుతాయి తప్ప.. ఏకంగా మూలమూర్తి రూపమే వివిధ రూపాల్లో దర్శనమివ్వడం సింహాచల క్షేత్రం ప్రత్యేకత. సుగంధ పరిమళ చందనంలో కొలువైన సింహాద్రినాథుడు వైశాఖ శుద్ధ తదియ నాడు కేవలం కొన్ని గంటలు మాత్రమే నిజరూపంలో కనిపిస్తారు. దీనినే చందనోత్సవం అంటారు. అదే రోజు తొలి విడతగా సుగంధద్రవ్యాలు మిళితం చేసిన మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పిస్తారు. ఈ రూపాన్ని గుమ్మడి పండు దర్శనంగా అభివర్ణిస్తారు. అనంతరం వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మూడు మణుగుల చొప్పున... మొత్తంగా 12 మణుగుల (సుమారు 500కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి ఆచ్ఛాదన చేస్తారు. చందన సమర్పణ ప్రక్రియలో భాగంగా నరహరి నాలుగు నెలల పాటు వివిధ పరిమాణాల్లో భక్తులకు కనిపిస్తారు. చివరిగా శ్రావణ పౌర్ణమి నాడు కరాళ చందనం సమర్పణతో దర్శనమిస్తారు.

**అదే విశిష్టత:** సంస్కృతంలో కరాళం అంటే ముఖం. కరాళ చందనం సమర్పణకు ఎంతో విశిష్టత ఉంది. నాలుగు విడతల చందనం సమర్పణ అనంతరం స్వామి నిండైన రూపాన్ని సంతరించుకోవడానికి అర్చకులు సుమారు 5 కిలోల శ్రీగంధంలో తిరుచూర్ణం, ఛాయ పసుపు, సుగంధద్రవ్యాలు మిళితం చేసిన కస్తూరి చందనాన్ని పైపూతగా అలంకరిస్తారు. ఈ ప్రక్రియ 8 రోజుల పాటు ఉదయం ఆరాధనలో జరుగుతుంది. ఈ సమయంలో స్వామికి ఎలాంటి ఆభరణాలు, పూలు అలంకరించరు. కరాళ చందనం సమర్పణ సందర్భంగా శనివారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, ఉదయం ఆరాధన సేవల టికెట్లు రద్దు చేసినట్లు స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిరంతరాయంగా సర్వదర్శనాలు కొనసాగుతాయన్నారు.

# ముసురు.. వ్యాధులు విసురు

కర్నూలు : గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. చెత్తాచెదారాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. దోమల బెడద తీవ్రమైంది. జనానికి కంటిపై కునుకు కరవైంది. దోమల నివారణ చర్యలు కానరావడం లేదు. చాలా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడమే మరిచారు. చివరికి జనం రోగాల బారిన పడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతోపాటు డెంగీ, మలేరియా కేసులు పెద్దఎత్తున నమోదవుతున్నాయి.

**పెరుగుతున్న డెంగీ బాధితులు**

దోమల నివారణ పేరుతో నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాలు ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నాయి. దోమల బెడద తగ్గకపోగా నిధులు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవైంది.

ఈ ఏడాది కర్నూలు జిల్లాలో జనవరి నుంచి జులై వరకు పరిశీలిస్తే 143 డెంగీ, 5 మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో మే, జూన్, జులై నెలల్లోనే 8 మలేరియా, 28 డెంగీ కేసులు రావడం గమనార్హం.యాంటీ లార్వా నివారణకు టీమోఫాస్ బీటీఐ పొడి వినియోగించాలి. చీకటి పడ్డాక పుర వీధుల్లో ఫాగింగ్ చేయాలి. మలాథియన్, సైఫనోటీబ్రెక్సాన్ ద్రావణంతో పిచికారి చేయాలి. గతంలో



వీటిని వైద్య, ఆరోగ్య శాఖ సరఫరా చేసేది. ప్రస్తుతం పురపాలక సంఘాలే డిమాండ్‌కు తగ్గట్లు నేరుగా తెప్పించుకుంటున్నాయి. నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాల్లో దోమల నివారణ యంత్రాలు కానరావడం లేదు.యంత్రాలు మూలకుఆదోని పురపాలక సంఘం పరిధిలో 2 లక్షలకుపైగా జనాభా ఉండగా.. ఒక్క నడకతో చేసే ఫాగింగ్ యంత్రం మాత్రమే ఉంది. ఇక్కడ ఫాగింగ్ కోసం రూ.5 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు.కర్నూలు నగరపాలక సంస్థలో 6.50 లక్షలకుపైగా జనాభా ఉంది. ఇక్కడ కేవలం 10 ఫాగింగ్ యంత్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. నంద్యాలలో 11 ఫాగింగ్ యంత్రాలకుగాను 8 మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం.ఎమ్మిగనూరులో ఐదింటిలో మూడు, డోన్‌లో నాలుగుకు రెండే పనిచేస్తున్నాయి. దోమల నివారణ పేరుతో కర్నూలు నగరపాలక సంస్థలో ఏటా రూ.60–70 లక్షలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేదు.

# చెప్పినంత చెల్లిస్తేనే.. లోపలికి..

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో గుత్తేదారులు అక్రమాలకు పాల్పడుతూ భక్తులను దోచేస్తున్నారు. అధికారులకు తెలిసినా చేసేది ఏముందిలే అనుకున్నాడో ఏమో గానీ ఓ గుత్తేదారు నిబంధనలకు విరుద్ధంగా టోల్ గేట్‌లో అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో టికెట్‌పై రూ.10 అదనంగా వసూళ్లు చేస్తూ.. భారీగా ఆర్జిస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

**కొండపైకి వాహనాల..**

ద్వారకాతిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. కొండపైకి వాహనాలతో వచ్చే భక్తుల వద్ద నుంచి దేవస్థానం టోల్ గేట్ వద్ద టోల్ రుసుము వసూలు చేసుకునే హక్కును బహిరంగ వేలం ద్వారా హెచ్చు పాటదారుడికి అప్పగించారు. దీనికి సంబంధించి ఏడాదికి రూ.1.37 కోట్లు దేవస్థానానికి ఆదాయం వస్తోంది. టోల్ గేట్ పాట కాలపరిమితి 2024 ఆగస్టు 1 నుంచి 2026 జులై 31 వరకు ఉంది. అయితే నిబంధనలు ప్రకారం దేవస్థానం నిర్ణయించిన టోల్ ధరలను మాత్రమే గుత్తేదారు భక్తుల వద్ద నుంచి వసూలు చేయాల్సి ఉంది. లారీ, బస్సు, ఇతర భారీ వాహనాల నుంచి రూ.150, మినీ బస్సు, వ్యాన్‌ల నుంచి రూ.100, ట్రాక్టర్ ట్రక్కుతో రూ.50, ట్రక్కు ఆటో, నాలుగు చక్రాల ఆటోల నుంచి రూ.50, ట్రాక్టర్ ఇంజిన్ రూ.50, కారు, జీపులకు రూ.50, ద్విచక్ర వాహనాల నుంచి రూ.10, పాసింజర్ ఆటో నుంచి రూ.25 వసూలు చేయాల్సి ఉంది. అయితే గుత్తేదారు తన ఇష్టానుసారం వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనానికి రూ.20 టికెట్ ఇచ్చి మరీ వసూలు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**విచారణ చేసి చర్యలు..**

టోల్ గేట్‌లో గుత్తేదారు అదనపు వసూళ్లకు పాల్పడుతుండటంపై విచారణ జరిపిస్తా. రుజువు అయితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటా. ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, దేవస్థాన ఈవో

# చిన్న 'చూపు'!

ఏలూరు : సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్నారు పెద్దలు. సాధారణంగా 40 ఏళ్లు దాటాక దృష్టి లోపం మొదలవుతుంది. నేడు ఆహార అలవాట్లు, జన్యుపరమైన లోపాలు తదితర కారణాలతో చిరుప్రాయంలోనే కొందరు బాలబాలికలు దృష్టి లోపంతో బాధపడుతున్నారు. ప్రాథమిక దశలోనే సమస్యను గుర్తించడం ద్వారా పెద్ద నష్టాన్ని ఆదిలోనే నివారించవచ్చు.

సంస్థలు సూచిస్తున్నా.. బాలల కంటి చూపు పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని యునిసెఫ్, డబ్ల్యూహెచ్‌వో తదితర అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వాలకు సూచిస్తున్నాయి. ఆ దిశగా పాలకులు చొరవ చూపడం లేదు. గత వైకాపా హయాంలో కంటి వెలుగు పేరిట బాలలకు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. కొవిడ్ తర్వాత నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. పిల్లల నేత్ర పరీక్షలపై దృష్టి సారించలేదు.'పాఠశాలల్లో బాలలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించే బాధ్యతలను వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తోంది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నెలాఖరు నుంచి నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అవసరాల బాలల గుర్తింపునకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నాం. ఈ శిబిరాల్లో నేత్ర వైద్య పరీక్షలు సైతం చేస్తాం' అని సమగ్ర శిక్షా ఐఈ సమన్వయకర్త భాస్కరరాజు తెలిపారు.డీపీసీబీ పేరిట.. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫ్ కంట్రోల్ బ్లైండ్‌నెస్– (డీపీసీబీ) పేరిట 6–18 ఏళ్లలోపు వయసున్న వారికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. వీటి నిర్వహణ సక్రమంగా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ నేత్ర పరీక్షలు చేసినా.. కళ్లజోళ్లు అవసరమైన వారికి పంపిణీ చేయలేదు. డీపీసీబీ లక్ష్యం నీరుగారుతోంది. ప్రస్తుత ప్రభుత్వం స్కూల్ హెల్త్ ఐ స్క్రీనింగ్ పేరిట చేపట్టిన నేత్ర వైద్య పరీక్షల నిర్వహణకు నిర్ణీత షెడ్యూలు ప్రకటించాల్సిన అవసరం ఉంది.

# లక్ష్యం.. పక్కా నిర్లక్ష్యం!



పుట్టపర్తి : మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్లపల్లిలో అనువుగాని చోట గుట్ట మీద గోదాం నిర్మించారు. విద్యుత్తు, నీటి సౌకర్యం లేదు. ఏడాదిగా నిరూపయోగంగా ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చేశారు. గోదాం నిర్మాణానికి రూ.31.51 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు వడ్డీ రూ.1.21 లక్షలు సెంట్రల్ బ్యాంకుకు పుట్టపర్తి వ్యవసాయ సహకార సంఘం చెల్లించింది.

గత ప్రభుత్వం ఆర్భాటంగా నిర్మించిన గోదాములు ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు గుదిబండగా మారాయి. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వెయ్యి మెట్రిక్ టన్నులు, 21,500 టన్నుల సామర్థ్యం ఉన్నవి 61 గోదాములు మంజూరయ్యాయి. వీటిలో 22 వరకు వివిధ దశల్లో అర్ధాంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వం సహకార సంఘాల కార్యాలయాలు, రైతులకు దూరంగా ప్రభుత్వ స్థలాల్లోనే గోదాములను నిర్మించారు. అవేవీ ఉపయోగపడం లేదు.

**రెండు తప్ప అన్నీ నిరుపయోగమే!**

సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు నిల్వలు చేయడానికి, రైతులు పండించిన పంటలు అందులో ఉంచేందుకు రూ.లక్షలతో నిర్మించిన గోదాములు ఖాళీగా ఉన్నాయి. గోదాములన్నీ దూరంగా ఉండటంతో పాలసముద్రంలోని రెండు గోదాములు తప్పా మిగిలినవి ఏవీ వినియోగంలో లేవు. వీటివల్ల ఉపయోగం లేకున్నా ఏటా సొసైటీలు తమ లాభాల్లోంచి కొంత నగదు తీసుకొచ్చిన రుణాలకు వడ్డీ, అసలు కింద సెంట్రల్ బ్యాంకు చెల్లిస్తున్నారు. వ్యవసాయ సహకార సంఘాలు దాదాపు రూ.50 లక్షలకు పైగా వచ్చే ఆదాయం నుంచి సెంట్రల్ బ్యాంకు వడ్డీ, అసలు రుణం చెల్లించారు.

ఇటీవల ప్రభుత్వం గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు రావడంతో అధికారులు వెళ్లి వాటిని శుభ్రం చేయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరారు.

**వినియోగంలోకి తీసుకొస్తాం –కృష్ణానాయక్, డీసీవో**

జిల్లాలోని గోదాములన్నింటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల పాలసముద్రంలోని రెండు గోదాములను నెలకు రూ.లక్ష చొప్పున అద్దెకు ఇచ్చాం. ఇటీవల అన్నింటిని పరిశీలించాం. వివిధ దశల్లో ఉన్న 21 భవన నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

# ప్లాస్టిక్ బాటిలొద్దు చిన్నా!

పాయకరావుపేట : ప్లాస్టిక్ సీసాల్లో నీటిని వాడటం వల్ల అనర్థాలు వస్తాయనేది జగమెరిగిన సత్యం. ఇది తెలిసినా వాటినే వినియోగిస్తే.. రోగాలు బహుమతిగా వస్తాయి. పెద్దల మాట అటుంచితే పిల్లల ఆరోగ్యంపై ఎక్కడా శ్రద్ధ కానరావడంలేదు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వాడేసిన కూల్‌డ్రింక్, ఇతర ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కొన్నిచోట్ల ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇంటి నుంచి తెచ్చుకున్న ప్లాస్టిక్ సీసాల్లో నీటిని నింపుకొని వాడుతున్నారు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడంతో చేతులారా పిల్లలను రోగాల బారిన పడేట్టు చేస్తున్నారు. దాతల సహకారంతో స్టీలుతో ఉన్న సీసాలు అందిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

**తాగితే వచ్చే నష్టాలివీ**

కూల్ డ్రింకులు, ఇతర ప్లాస్టిక్‌తో తయారుచేసే సీసాలు భూమిలో కలవాలంటే వందేళ్లకు పైగా పడుతుంది. ఒకసారి వాడిన వీటిని మళ్లీ వినియోగించకూడదు. సాధారణంగా ఈ సీసా లోపల బ్యాక్టీరియా ఎక్కువగా పెరుగుతుంది. దీన్ని శుభ్రం చేయాలంటే వేడి నీటిని వాడాలి. దానివల్ల ప్లాస్టిక్ కరిగి నీటిలోకి చేరుతుంది. అనారోగ్యం బారిన పడే ప్రమాదముంది. నేరుగా కడుపులోకి ప్లాస్టిక్ చేరుతుంది.

పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంటు పని



చేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలో 250 మందికి పైగా హాజరయ్యారు. వీరిలో 90 మందికి పైగా ప్లాస్టిక్ సీసాల్లో నీటినే తాగుతున్నారు.

ఈదటం ఉన్నత పాఠశాలలో 105 మంది ఉంటే.. ఇక్కడ 70 మంది ప్లాస్టిక్ సీసాల్లో తెచ్చుకున్న నీటిని వినియోగిస్తున్నారు.

నక్కపల్లి ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉండగా 100 మందికి పైగా పిల్లలు ప్లాస్టిక్ సీసాలు వాడుతున్నారు.

ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి ఉన్నత పాఠశాలలో 400 మందికి పైగా 150 మంది వరకు ఈ సీసాలనే వాడుతున్నారు.

కొరుప్రోలు పాఠశాలలో 50 మంది, ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో 60 మంది వరకు తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టిక్ సీసాల్లో తెచ్చుకున్న నీటిని తాగుతున్నారు.

నక్కపల్లి ఉపమాక, గొడిచెర్ల, వేంపాడు తదితర పాఠశాలల్లో సగానికి పైగా ప్లాస్టిక్ సీసాలనే వాడుతున్నారు.

**రోగాలు కొని తెచ్చుకున్నట్టే...**

ప్లాస్టిక్ సీసాల్లో నీరు వాడితే రోగాలు కొని తెచ్చుకున్నట్లే. విద్యార్థుల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ఆడపిల్లల్లో సాధారణ వయస్సు కన్నా ముందుగానే అంటే 8 ఏళ్ల కంటే ముందే యుక్త వయస్సు లక్షణాలు వచ్చేస్తాయి. మగ పిల్లల్లోనూ ఇబ్బందులు వచ్చే ప్రమాదముంది. లోపల స్టీలు ఉన్న సీసాలను వాడుకోవాలి. దాన్ని శుభ్రం చేసుకునేందుకు వీలుంటుంది. ఆరోగ్యకరం.


సుభాష్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాయకరావుపేట

# ఒంగోలు గిత్త.. వేలంలో సత్తా!

ఒంగోలు : ఒంగోలు పేరు చెప్పగానే మనకు గుర్తొచ్చేది మేలుజాతి వృషభ రాజాలే. ఎత్తుగా బలిష్ఠంగా ఉండి అవి రంకెలేస్తే రాజసం ఉట్టిపడుతుంది.. చూడగానే కనువిందు చేసే ఒంగోలు గిత్తల గురించి ఎంత చెప్పినా తక్కువే. వీటిని పెంచుకునేందుకు పశు పోషకులు మక్కువ చూపుతున్నారు. జిల్లాలోని చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రంలో నిర్వహించే వేలంలో వీటిని కొనేందుకు పోటీ పడుతున్నారు.

ఒంగోలు జాతి పశువుల సంరక్షణలో భాగంగా చదలవాడ కేంద్రంలో 200 వరకు ఆవులను పెంచే అవకాశం ఉంది. ఏటా వంద వరకు దూడలు పుడుతుంటాయి. మూడొందల వరకు పశువులను ఉంచుకుని మిగిలినవి వేలంలో విక్రయిస్తుంటారు. గతంలో ఒంగోలు జాతి పశువుల విక్రయాలు జరుగుతాయనే సమాచారం తెలియకపోవడంతో పోటీ అంతగా ఉండేది కాదు. ఈ జాతి గొప్పదనం ప్రస్తుత తరాలకు తెలియడం, వేలం నిర్వహించే తేదీలపై అవగాహన పెరగడంతో వీటిని రెట్టింపు ధరకు కొనేందుకు పశు పోషకులు పోటీపడుతున్నారు.

గత నెల 30న 16 కోడె దూడలు, 16 పెయ్య దూడలు, 14 ఆవులకు వేలం నిర్వహించగా రూ.9.24 లక్షల ఆదాయం లభించింది. వాస్తవానికి వీటికి రూ.4.38 లక్షల ధర నిర్ణయించి వేలం ప్రారంభించగా పోటీ పడి మరీ కొన్నారు. పశు సంవర్ధకశాఖ అధికారుల బృందం వాటి నాణ్యత లక్షణాలను బట్టి ధర నిర్ణయిస్తారు. మేలైన వాటికి పోటీ నెలకొంటుంది. రూ.5 వేలు ధర నిర్ణయించిన కోడె దూడ



వేలంలో రూ.25 వేలు పలికింది. ఇదే మాదిరి పెయ్య దూడలను సైతం కొనుగోలు చేస్తున్నారు.

**మేలైన జాతిని దేశవ్యాప్తం చేసుకునేందుకు..**

ఒంగోలు జాతి ఆవుల పాల దిగుబడి మిగతా దేశవాళీ వాటితో పోలిస్తే కాస్త తక్కువే. గానీ ఇవి కనే దూడలు సాగుకు, ఎడ్ల పందేల పోటీలకు ఎంతగానో పనికొస్తాయి. దీంతో హైదరాబాద్, సంగారెడ్డి తదితర తెలంగాణ జిల్లాలతో పాటు గోదావరి ప్రాంతాల నుంచి పశు పోషకులు వచ్చి కొంటున్నారు. ఒంగోలు గిత్తలు పెంచుతున్నామని గర్వంగా చెప్పుకొనేందుకు కొంతమంది తీసుకెళ్తున్నారు. నాణ్యమైన దేశవాళీ రకం కావడం, వ్యాధులు సోకడం చాలా తక్కువగా ఉండడం వీటికి డిమాండు నెలకొందని ఉత్పత్తి కేంద్రం పశు వైద్యాధికారి కృపారావు చెబుతున్నారు.

**ఉత్పత్తి పెంచడంతో ఆదాయం**

గతంలో రూ.5 లక్షలకు వేలం నిర్ణయిస్తే రూ.7 లక్షలు మాత్రమే పలికేవి. ప్రస్తుతం రెట్టింపు ధరలకు కొనేందుకు పోటీపడుతున్నారు. గతంలో ఏడాదికి 70 నుంచి 80 వరకు మాత్రమే దూడలు పుట్టేవి. ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవడంతో ఏటా వందకు పైగా దూడలు పుడుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. – డాక్టరు రవి, పశు ఉత్పత్తి కేంద్రం పర్యవేక్షకుడు

# ఆదాయమొస్తే చాలు.. ఎక్కడైనా మత్తెకిస్తాం!



చిత్తూరు : 'మద్యపానం ఆరోగ్యానికి హానికరం' ఇది ఎక్సైజ్ శాఖే చెప్పేమాట. అదే మద్యం దుకాణాలు జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనే ఉంటే ఆరోగ్యం సంగతి పక్కన పెడితే విలువైన ప్రాణాలు రోడ్డు ప్రమాదాల కారణంగా క్షణాల్లో గాలిలో కలవడం ఖాయం. ఇటువంటి ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. వీటిని ఏ మాత్రం లెక్క చేయకుండా మద్యం దుకాణాల నిర్వాహకులు రోడ్డుకు ఆనుకుని కొన్నిచోట్ల, సమీపంలోనే మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వస్తున్నాయి. బయటి ప్రాంతాల నుంచి రోజూ తిరుపతికి సుమారు లక్ష మంది వస్తుంటారు. వీరిలో సింహభాగం తిరుమల దర్శనానికి, కొందరు విద్య, వైద్య అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణ, సరకు రవాణా వేగంగా జరగడానికి ఎక్కడా లేని విధంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జాతీయ రహదారులు నిర్మించారు. ఇలాంటి కీలకమైన రోడ్ల పక్కనే నిర్వాహకులు మద్యం దుకాణాలు పెట్టి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

**ఇవీ నిబంధనలు..**

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఎక్కడైనా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. దేవాదాయ శాఖ పరిధిలోని గుడులతోపాటు మసీదులు, చర్చిలు, 30 పడకలకుపైగా ఉన్న ఆసుపత్రులకు మాత్రం వంద మీటర్ల దూరంలో ఉండాలి. మండల కేంద్రాలు, పంచాయతీల మీదుగా జాతీయ రహదారులు వెళ్తుంటే 220 మీటర్ల వరకు దుకాణాలు నెలకొల్పకూడదు. లైసెన్సులు ఇవ్వడానికి ముందే ఎక్సైజ్ శాఖ ఈ నిబంధనల గురించి స్పష్టంగా చెప్పింది. ఇందుకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని పేర్కొంది. ఎవరైనా అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించింది.

**తాత్కాలికమని చెప్పి శాశ్వతంగా..**

ప్రాథమికంగా లైసెన్సు జారీ చేసిన సందర్భంలో స్థలం వెతకడం ఆలస్యమవుతోందని కొందరు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో హైవేల పక్కనే మద్యం దుకాణాలు పెట్టారు. ఎక్సైజ్ శాఖ అధికారులు అప్పట్లో అనుమతించారు. నెల రోజుల వ్యవధిలోనే మార్చుకోవాలని సూచించారు. ఆదాయం వస్తుండటంతో పది నెలలు దాటినా నిర్వాహకులు తాత్కాలికం ముసుగులో శాశ్వతంగా అక్కడే కొనసాగిస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

పలమనేరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిలో బైరెడ్డిపల్లె, వి.కోట, శాంతిపురం మండలాల్లో రోడ్డుకు ఆనుకునే దుకాణాలు ఉన్నాయి. పాకాల మండలం నేంద్రగుంటలో జాతీయ రహదారికి సమీపంలో, చిత్తూరు– పీలేరు మార్గంలో కల్లూరులో దుకాణాలు ఏర్పాటు చేశారు. రేణిగుంట– నాయుడుపేట జాతీయ రహదారిలో ఏర్పేడు, శ్రీకాళహస్తి– వెంకటగిరి రోడ్డులో పంగూరులో మద్యం దుకాణాలు వెలిశాయి.

**మద్యం మత్తులో భారీ వాహనాల డ్రైవర్లు**

హైవేను ఆనుకునే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో భారీ వాహనాల డ్రైవర్లు.. అక్కడే తాగి రోడ్డు ఎక్కుతున్నారు. ఫలితంగానే ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వారి తప్పిదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. చిత్తూరు– తిరుపతి, రేణిగుంట– నాయుడుపేట మార్గాల్లో ఎక్కువగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

మద్యం దుకాణాలు

చిత్తూరు జిల్లాలో 104

తిరుపతి జిల్లాలో 227

# ఆదేశాలొచ్చాయి.. ఆచరణే తరువాయి



శ్రీకాళహస్తి: తెదేపా హయాంలో ప్లాస్టిక్‌పై సమరం కొనసాగినా.. వైకాపా పాలనలో దీన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. దీంతో మళ్లీ యథాప్రకారం పాలిథిన్ వాడకం పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సమూలంగా నియంత్రించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆలయాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై మరింత కసరత్తు చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత భక్తజన ఆదరణ కలిగిన తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, బోయకొండ ఆలయాలకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఇక్కడ ప్లాస్టిక్ నియంత్రణ దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉంది.

**దశల వారీగా మార్పులు..** ఆలయాలకు వచ్చే భక్తులకు ఆలయం తరపున పంపిణీ చేసే ప్రసాదాలు, పూజా సామగ్రి తదితర వాటిల్లో దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ పద్ధతులు అమల్లోకి తీసుకురావడమే కాకుండా ఇప్పటికీ వాటినే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పంపిణీ చేసే కవర్లు స్వల్ప వ్యవధిలో భూమిలో కలిసిపోయేవే. పూర్తిగా నిర్మూలించడంపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

**కట్టడి లేక.. నిర్మూలనకు వీలుగాక**

ప్లాస్టిక్ వాడకం లేదని ఆయా ఆలయాల యాజమాన్యాలు చెబుతున్నా.. బయటి నుంచి వచ్చే వాటిని పూర్తి స్థాయిలో నిలువరించడంలో విఫలం అవుతున్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, బోయకొండ ఆలయాలకు వెలుపల ఉన్న దుకాణాల్లో పాలిథిన్ కవర్ల ద్వారానే పూజాసామగ్రిని ఆలయంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ఆలయాల పరంగా పోగవుతున్న వ్యర్థాల్లో పాలిథిన్‌వే ఎక్కువగా ఉంటున్నాయి. దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఇచ్చిన తాజా ఉత్తర్వుల్లోనూ ఈ అంశాన్ని స్పష్టం చేశారు.

# అవుకు ఆరో గేటు అధోగతి

అవుకు : రాయలసీమ జీవనాడి అవుకు జలాశయాన్ని నిర్లక్ష్యం నీడలు వెంటాడుతున్నాయి. కీలకమైన క్రస్ట్ గేట్లు మొదలు కట్టలు, కాల్వలకు నీటిని అందించే తూముల(గేట్ల) వరకు అన్నింటా సమస్యలు నెలకొన్నాయి. జలాశయంలో పూర్తిస్థాయి నీటిని నిల్వ చేయలేని దుస్థితి నెలకొంది. మరమ్మతుల విషయంలో అంతులేని జాప్యం కొనసాగుతోంది. నిధుల కోసం అధికారులు పంపిన నివేదికలను గత వైకాపా ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

**పలకల అమరికలో ఎప్పుడో**

జలాశయం గేట్లు బలోపేతం చేయడానికి వీలుగా పలకలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జలాశయ ఆయకట్టు పరిధిలోని కాల్వలకు నీటిని విడుదల చేయాలన్నా.. ఆపివేయాలన్నా నిపుణులు వస్తేతప్ప పనులు సాగని పరిస్థితి దాపురించింది. తూములు తెరవడానికి వీలుగా పలకలకు అమర్చిన ఇనుప రాడ్డు తుప్పు పట్టి పలకతో సంబంధం తెగిపోయింది. తాత్కాలికంగా అప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. తుప్పుపట్టిన పలకల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**నిధులు సమకూరినా**

రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో మరమ్మతులకు రూ.కోటి



మంజూరు చేయించారు. ప్రస్తుతం నిధులు ఉన్నా పనులు చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గుత్తేదారు అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్నా నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి.

**నీటి ప్రవాహం మాటేంటి..**

గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు–నగరి, ఎస్సార్బీసీ ద్వారా అవుకు జలాశయానికి సమకూరే నీటిని దిగువన ఉన్న మైలవరం కాల్వ, గండికోట కాల్వలకు అందించాల్సి ఉంది. గతేడాది గండికోట కాల్వ ద్వారా దిగువన ఉన్న జలాశయాలకు దాదాపు 60 టీఎంసీల నీటిని అందించారు. ప్రస్తుతం ఏ మేరకు అందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అవుకు జలాశయంలో 4.18 టీఎంసీల నిల్వ ఉంచడానికి వీలున్నా మరమ్మతుల కారణంగా 2 టీఎంసీలకు మించి నిల్వ చేయడానికి అధికారులు సాహసించడంలేదు.

**ప్రధాన గేట్ల వద్ద ఆగని లీకేజీ** జలాశయానికి ఆరు గేట్లు ఉండగా వాటి పలకలు తుప్పుపట్టి, రబ్బరు బీడింగ్ ఊడిపోయింది. ప్రత్యేకించి నాలుగు, ఆరు గేట్ల వద్ద అమర్చిన ఇనుప పలకలు తుప్పు పట్టడంతో చీలికలు ఏర్పడ్డాయి. నీటి మట్టం పెరిగితే గేట్ల నుంచి నీటి వృథా తప్పదు. గేట్ల నియంత్రణకు ఉద్దేశించిన మోటార్లు, ఇనుప తీగలు నిరుపయోగంగా మారాయి. జలాశయం పరిధిలోని తిమ్మరాజు కట్ట వద్ద ఏర్పడిన లీకేజీ ఆందోళన కలిగిస్తోంది. నిపుణులు పరిశీలించి ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదంలేదని చెబుతున్నారు. జలాశయంలో పూర్తి స్థాయిలో నీటిని నిలువరించలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితే పాలేరు కట్టవద్ద నెలకొంది.

# 'డ్రోనా'రీమణులు

నంద్యాల : డ్రోన్ చేతిలో ఉంటే.. ఎనిమిది నిమిషాల్లో ఎకరం పొలంలో 'విత్తు'కోవచ్చు.. ఐదు నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేయొచ్చు.. ఇప్పటికే పలువురు డ్రోనాస్త్రంతో ఉపాధి పొందుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని డ్వాక్రా మహిళల చేతికి డ్రోన్లు అందించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. సాగుబడిలో కీలకంగా ఉన్న మగువలు డ్రోన్ రాకతో మరింత ఉపాధి పొందడానికి వీలుంటుంది. ఉమ్మడి జిల్లాలో 61 డ్రోన్లు రానున్నాయి.. వీటి వినియోగంపై మహిళలకు ఇప్పటికే పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు.

**80 శాతం రాయితీతో పంపిణీ**

'నమో డ్రోన్ దీదీ' పథకం కింద డ్రోన్లు 80 శాతం రాయితీతో అందజేయనున్నారు. డ్రోన్ ధర రూ.10 లక్షలు ఉంటే.. రూ.8 లక్షల రాయితీ ఇస్తారు.. మిగిలిన రూ.2 లక్షలు బ్యాంకు లింకేజీ లేదా స్త్రీనిధి రుణం అందించనున్నారు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకాల ద్వారా 40 శాతం ఇస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ల వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకులు రూ.5 లక్షలు రుణంగా ఇస్తున్నాయి. పది శాతం రైతు సంఘాలు, లేదా స్వయం సహాయక సంఘాలు భరించాల్సి ఉంటుంది.

**61 మంది ఎంపిక**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 లక్షల హెక్టార్లలో 7.31 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి మరింత చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో డ్రోన్లు ఇవ్వనున్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి.. పదో తరగతి పూర్తి చేసిన 'భూ' యజమానులైన మహిళలను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో 31 మంది, నంద్యాలలో 30 మందిని ఎంపిక చేశారు. వీరిలో కర్నూలుకు చెందిన ఐదుగురికి తాండ్రపాడులో శిక్షణ ఇచ్చారు.

**నిత్యం రూ.5 వేల ఆదాయం**

డ్రోన్‌లో ఉంటే కంటెయినర్ (డబ్బా) పది లీటర్లు/ పది కిలోల బరువు మోస్తుంది. అందులో విత్తనాలు నింపి చల్లొచ్చు.. 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. సుమారు 265 అడుగుల ఎత్తు ఎగురుతుంది. ఎకరా భూమికి సరిపడా విత్తనాలు ఎనిమిది నిమిషాల వ్యవధిలో చల్లుతుంది.

నిత్యం 75–100 ఎకరాల్లో మందులు పిచికారీ చేయొచ్చు. క్రిమిసంహారక మందు మొక్క అడుగు నుంచి పైవరకు తడుస్తుంది. ఎకరా పొలంలో 5–10 నిమిషాల్లోనే పూర్తవుతుంది. ఎకరాకు రూ.500 చొప్పున ఒక రోజులో 10 ఎకరాలు పిచికారీ చేస్తే రూ.5 వేలు సంపాదించొచ్చు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వంద మంది వరకు ఇలా ఉపాధి పొందుతున్నారు.

**సాగులో ఖర్చులు తగ్గుతాయి** పది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఎక్కడెక్కడ వాడాలో వివరించారు. మాకు ఆరెకరాల పొలం ఉంది. డ్రోన్ వాడకంతో సాగు ఖర్చులు తగ్గి, పనులు వేగంగా చేసుకోవచ్చు. నీటి వినియోగం తగ్గుతుంది. మా పొలంలో వినియోగించుకున్న తర్వాత అవసరమైతే పక్క పొలాల వారికి అద్దెకిస్తాం. వీజీ భవాని, కప్పట్రాళ్ల, దేవనకొండ

చురకలు



# తీరు మారకుంటే కటకటాలే!

పాడేరు: గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను వ్యాపారంగా చేసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. పదే పదే అరెస్టు చేస్తున్నా.. తీరు మార్చుకోని వారిని ఏడాదిపాటు జైల్లో పెట్టేలా పీడీ, ఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఇప్పటివరకు అల్లూరి జిల్లాకు చెందిన ఆరుగురు, అనకాపల్లి జిల్లాకు చెందిన ముగ్గురిని ఈ చట్టం కింద నిర్బంధించారు. రెండు జిల్లాల పరిధిలో ఇలాంటి వారు ఇంకా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో అక్రమాలకు పాల్పడే వారందరిపై ఈ చట్టాన్ని ప్రయోగించి కటకటాల్లోకి పంపనున్నారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన ఆరుగురిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం 2018లో మొదటిసారి ఆటోలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఇప్పటివరకు ఆయనపై ఆరు కేసులో నమోదయ్యాయి.

అల్లూరి ఏజెన్సీలో గతంలో భారీగా గంజాయి సాగయ్యేది. పండించేది కొందరైతే.. రవాణా చేయడంలో ఎక్కువ మంది భాగస్వాములయ్యేవారు. కీలక సూత్రధారులు తెర వెనక ఉండి గిరిజన యువకులకు డబ్బు ఆశచూపి గంజాయి రవాణాకు వాడుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపింది. డ్రోన్ కెమెరాల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేయించింది. గతంలో సాగు చేసిన వారిని ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. వారిలో కొందరు గంజాయి సాగు, అందులోని మత్తును వీడటం లేదు. ఇలాంటి వారందరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది.



మాడుగుల మండలానికి చెందిన బి.కొండలరావు ఆటోలో గంజాయి రవాణా చేస్తూ 2019లో మొదటిసారి పట్టుబడ్డాడు. ఈయనపై రెండు కేసులున్నాయి. జి.మాడుగుల మండలానికి చెందిన వి.కొండబాబు బైక్‌పై తరలిస్తూ 2024లో మొదటిసారి దొరికాడు. ఈయనపై మూడు కేసులున్నాయి. హుకుంపేట మండలానికి చెందిన సీతారాం 2024లో గంజాయి రవాణా చేస్తూ దొరికాడు. ఈయనపై రెండు కేసులున్నాయి. గూడెంకొత్తవీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ 2020లో మొదట గంజాయితో పట్టుబడ్డాడు. వేర్వేరు స్టేషన్ల పరిధిలో మూడు కేసులున్నాయి. చింతపల్లికి చెందిన గాలి సత్యనారాయణ గంజాయి రవాణా చేస్తూ 2017లో దొరికాడు. ఇప్పటివరకు రెండు కేసులు ఈయనపై నయోదయ్యాయి. వీరంతా గంజాయి స్మగ్లింగ్‌ను వీడకుండా తరచూ రవాణా చేస్తున్నారన్న అభియోగాలతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అదుపులోకి తీసుకోవాలని తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

**స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు** ప్రభుత్వం గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు అనేక చర్యలు చేపడుతోంది. అల్లూరి జిల్లాలో చాలావరకు డ్రోన్ల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేశాం. గతంలో గంజాయి సాగు చేసిన వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ప్రభుత్వం చూపుతోంది. బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పీటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి ఏడాదిపాటు జైలుకు పంపుతాం.
అమిత్ బర్దార్, ఎస్పీ, అల్లూరి జిల్లా

# ఉపాధి మాయా పథకం

పాయకరావుపేట : ఉపాధి హామీ పథకంలో ఎక్కడెక్కడ ఏ పనులు చేశారో భూతద్దం పెట్టి వెతికినా ఇసుమంతైనా కనిపించడం లేదు. ఎక్కడా పనుల జాడే లేదు. తనిఖీకి వెళ్లిన సభ్యులకు ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్పీలు కలిసి 'రాజావారి చేపల చెరువు' సినిమా చూపించారు. పనులు చేయకుండానే చేసినట్లు చెబుతూ తనిఖీ బృందానికి చుక్కలు చూపారు. పాయకరావుపేట మండల పరిధిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై పరిశోధనాత్మక కథనం. ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి సొమ్ములు నొక్కేశారు. తనిఖీ సిబ్బందే అవాక్కయ్యే పరిస్థితి ఎదురైంది. మండలంలోని 24 గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.9.43 కోట్లతో 1,303 పనులు చేపట్టారు. వేతనాలకు రూ.7.05 కోట్లు, మిగతా మొత్తం సామగ్రి చెల్లింపులకు వినియోగించారు. సామాజిక తనిఖీ బృందానికి పనుల్లో అడుగడుగునా అవినీతి ఆనవాళ్లే కనిపించాయి. కొలతలు, మస్తర్లలో తేడాలతో సొమ్మును పక్కదారి పట్టించినట్లు గుర్తించారు.

**మచ్చుకు కొన్ని..** గోపాలపట్నం కొండ ప్రాంతంలో 300 కందకాలు



తవ్వినట్లు రికార్డుల్లో చూపారు. 110 కందకాలకు సంబంధించిన వివరాల్లేవు. మంగవరంలో రైతుల పొలాల్లో కందకాలు తవ్వామని రికార్డుల్లో పేర్కొన్నా.. సగానికిపైగా జాడ లేదు. ఉన్న వాటిలోనూ కొలతల్లో తేడాలున్నాయి.

ఎస్.నర్సాపురంలో మస్తర్లలో గోల్‌మాల్ చేశారు. పంట కాలువల తవ్వకాల్లోనూ అవకతవకలే. మస్తర్లు వేయకుండానే సొమ్ములు మింగేశారు. 130 మంది కూలీలు పని చేయకుండానే చేసినట్లుగా మస్తర్లు వేసి నామవరం వీఆర్‌పీ నగదు విత్‌డ్రా చేశారు. నాలుగు నెలలపాటు పని చేసినట్లుగా రికార్డుల్లో చూపారు.

పెంటకోటలో చేపట్టిన పనుల్లో కొలతలు, మస్తర్లలో తేడా జరిగినట్లు తేలింది. నిధుల రికవరీకి ఆదేశాలు.. సామాజిక తనిఖీ వేదికగా డీఆర్‌పీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా రూ.3.18 లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. నామవరం వీఆర్పీపై క్రిమినల్ కేసు నమోదు సహా నగదు రికవరికీ చర్యలు చేపడుతున్నాం. కందకాలు, పంట కాలువల తవ్వకాల్లో అవకతవలను గుర్తించేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఫిర్యాదు చేశాం. నానిబాబు, ఏపీఓ

# రూ.200 కోట్లు ఖర్చైనా.. దప్పికపాట్లేనా?



గుంతకల్లు : గుంతకల్లు వాసులకు గతంలో కుళాయిల నుంచి 15 నుంచి 20 రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. నీటి కోసం ప్రజలు నానా తిప్పలు పడేవారు. ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కరించడానికి రూ.200 కోట్లకు పైన ఖర్చు చేసి తాగునీటి వనరులను కల్పించింది. ప్రజలకు రోజూ తాగునీటిని అందించడానికి అవసరమైన సౌకర్యాలున్నా వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడటంలో అధికారులు విఫలమవుతున్నారు.

**కుళాయిల వద్ద పడిగాపులు**

నాలుగు, ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని కూడా కచ్చితమైన వేళల్లో సరఫరా చేయడం లేదు. కుళాయిలకు ఎప్పుడు వస్తుందో తెలియక నిరుపేదలు పనులకు వెళ్లకుండా వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

**అంతర్గత కనెక్షన్ల ఏర్పాటులో విఫలం**

గుంతకల్లులో తాగునీటిని కుళాయిల ద్వారా అందించడానికి మున్సిపాలిటీ పరిధిలో 17 ఉపరితల ట్యాంకులు నిర్మించారు. ప్రస్తుతం అధికారులు రోజూ నీటిని సరఫరా చేయకుండా నాలుగైదు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే సిబ్బంది జీత భత్యాలకు ప్రతినెలా రూ.14 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. రోజూ తాగునీటిని అందించాలన్న ఉత్తర్వులను అటకెక్కించారు. ఉపరితల ట్యాంకులకు చెందిన పైప్‌లైన్లను అనుసంధానం చేసి ఎస్ఎస్ ట్యాంకుల నుంచి నీటిని ఒకేరోజు నింపడానికి అంతర్గత కనెక్షన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు తాగునీటి పన్ను రూపంలో మున్సిపాలిటీకి ఖజానాకు ఏటా రూ.2 కోట్లకు పైన చేరుతోంది.

**అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం**

మున్సిపాలిటీలోని ప్రజలకు రోజూ ఒకే సమయంలో తాగునీటిని అందించే విషయంపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. తాగునీటి పైపులకు అంతర్గత కనెక్షన్ల ఏర్పాటుపై చర్చిస్తాం. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తోడ్పాటు ఇవ్వాలని కోరుతాం.
భవానీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్

పురపాలిక : గుంతకల్లు
జనాభా : 1.80 లక్షలు
ఎస్ఎస్ ట్యాంకులు : 2
ఉపరితల ట్యాంకులు : 17
కుళాయిల సంఖ్య : 40 వేలు
తాగునీటి పైపుల పొడవు : 350 కి.మీ.లు

# నాలుగువేల ప్రతుల్లో.. చెవిరెడ్డి అవినీతి చిట్టా



తిరుపతి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. 2024 డిసెంబరు 24న విచారణ ప్రారంభించి ఏడు నెలల అనంతరం ఇటీవలే పూర్తిచేశారు. నాలుగువేల ప్రతులతో కూడిన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

**విచారణ జరిగిన అంశాలివే..**

తుడా ఛైర్మన్‌గా వ్యవహరించిన చెవిరెడ్డి జీవో 26 (08.02.2016), జీవో 161 (17.05.2018)లను ఉల్లంఘించడం. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వ అభివృద్ధి పనులు చేయకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి కుటుంబ సభ్యులకు చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రా ద్వారా రూ.కోట్ల విలువైన పనులుచేయడం. మూడునెలల వ్యవధిలోనే ఆ సంస్థ క్లాస్-3 నుంచి క్లాస్-1 గుత్తేదారుగా ఎదగడం.

తుడాకు నాలుగైదు వాహనాలు ఉండగా అదనగా ప్రైవేటు వాహనాలు, వాటికి డీజిల్ వినియోగించడం. ఉద్దేశపూర్వకంగా చంద్రగిరి నియోజకవర్గంలో వ్యక్తిగతంగా ఇంటింటి సర్వే చేపట్టడం, దేశవిదేశాల కు విమాన ఛార్జీలను తుడా నుంచి వినియోగించడం జాతీయ హరిత ట్రిబునల్ నిబంధనలు ఉల్లంఘించి తుమ్మలగుంట చెరువును ధ్వంసం చేయడం. జలవనరుల శాఖ అనుమతి లేకుండా, కోచ్‌లు, నిర్వహణ సిబ్బంది లేకుండా పార్కులు, స్టేడియాలు నిర్మించడం, వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించడం.

కె.వి.బి.పురం మండలంలో కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులున్న ప్రాంతంలో తుడా నిధులతో రోడ్డు నిర్మించడం ప్రభుత్వ అనుమతి లేకుండా కేవలం పాలకమండలి తీర్మానం సాకుతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు ప్రతిపాదనలే లేకుండా నిధులు మళ్లించడం.

చంద్రగిరి నియోజకవర్గంలో అధికారులతో పదేపదే టెలికాన్ఫరెన్ల నిర్వహణ. తుడా నిధులను అనధికారికంగా ఎంపీడీవోల చేత ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు చేయించడం, యూసీ(యుటలైజేషన్ సర్టిఫికేట్)లు లేకుండా బిల్లులు మంజూరు చేయడం, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై వడ్డీలు వివరాలు తుడాకు సమాచారం లేకుండా వినియోగించడం.

31 మంది విశ్రాంత ఉద్యోగులను, ఐదుగురు ప్రైవేటు వ్యక్తుల్ని మంజూరులేని పోస్టుల్లో నియమించుకోవడం.

**అంశాల వారీగా నిధుల ఖర్చు (రూ.కోట్లలో)**

ఎంపీడీవోల ఖాతాలకు మళ్లించిన నిధులు: 230.03 తుమ్మలగుంట చెరువు కోసం చేసిన వ్యయం: 60
19 వేల బెంచీలకు అయిన ఖర్చు: 23 వైద్య శిబిరాలకు చేసిన వ్యయం: 5.29 విమాన ఛార్జీలు 0.59 వాహనాల కొనుగోలు: 1.85 కొవిడ్ శిబిరాలకు : 2.18 ఇంధన ఖర్చు: 2.50 తుడా ఇంజినీరింగ్ అధికారుల వ్యయం: 105 ఉద్యాన విభాగం ద్వారా మొక్కల పంపిణీ, పచ్చదనం పెంపు: 15

# నగరానికో నందనవనం!



విశాఖపట్నం: నగరంలోని ఆరిలోవలో లక్షల మొక్కలతో భారీ నర్సరీ ఆకట్టుకుంటోంది. విశాఖకే వన్నె తెస్తోంది. అక్కడి పరిసరాలు నందనవనాన్ని తలపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏ పెద్ద కార్యక్రమం జరిగినా అరుదైన జాతులను ఇక్కడి నుంచి అధికారులు తీసుకువెళ్తున్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇక్కడి మొక్కలతో పచ్చదనాన్ని పెంచు తున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) ఆధ్వర్యంలో ఈ నర్సరీని నిర్వహిస్తున్నారు. ఆ రెండు ఎకరాల్లో: నేరుగా ఎండ తగలకుండా, మొక్కలు పెరిగేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు రెండు ఎకరాల్లో నాలుగు షేడ్‌నెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ తుంపర్ల రూపంలో నీరందుతుంది. మిగిలిన వాటికి బిందుసేద్యం విధానంలో అందిస్తున్నారు.

**అందుబాటులో 1.76 లక్షలు**: ఈ నర్సరీ దాదాపు 30 ఎకరాల్లో ఉంది. అలంకరణకు అనువైనవి 25 రకాలు, ఉద్యానవనాల్లో నాటేవి 20 రకాల వరకు ఉన్నాయి. ప్రస్తుతం 1.76 లక్షల మొక్కలు సిద్ధం చేశారు. ఏటా 50 వేల వరకు విక్రయిస్తారు. ఎప్పటికప్పుడు అంటుకట్టే విధానంలో సరికొత్తగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన నర్సరీలతో పోల్చితే ఇక్కడ తక్కువ ధరకు ఎవరైనా కొనుగోలు చేసుకోవచ్చు. ఎన్ని కావాలో దరఖాస్తు చేస్తే వాటికి ధర నిర్ణయించి అందజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపాల్టీలు, దేవాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.

**మోదీ సభలకు..**: అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభ సభకు హాజరైన ప్రధాని మోదీ పర్యటనలో కనువిందుగా కనిపించిన మొక్కల్ని విశాఖ నుంచే తరలించారు.

ఇటీవల జరిగిన యోగాంధ్ర-25 ఏర్పాట్లకూ ఈ నర్సరీ నుంచే మొక్కలు పంపించారు. బీ కొన్నాళ్ల క్రితం విశాఖలో జరిగిన జి-20 సన్నాహక సమావేశాల వేళ నగర సుందరీకరణలో లక్ష మొక్కలు వినియోగించారు.

అవీ ఇక్కడి నుంచే సరఫరా చేశారు.

విశాఖ పోర్టులో, జీవీఎంసీ పార్కుల్లో, అమృత్‌సరోవర్ ప్రాజెక్టు కింద చెరువుల గట్లపైనా వేలాది మొక్కలు నాటారు.

పోర్టుతో ఒప్పందం: 'పచ్చదనం పెంచే కార్యక్రమాలకు విశాఖ పోర్టు పెద్ద పీట వేస్తోంది. వారికి అవసరమైన మొక్కల సరఫరా, నిర్వహణకు పోర్టుతో ఏపీజీబీసీ ఒప్పందం చేసుకుంది. అరుదైన రకాలతో 'ఫైకటోరియం' నిర్వహిస్తున్నాం. మొక్కలు కావాలంటే ముడసర్లోవ జలాశయం ఎదురుగా ఉన్న నర్సరీలో సంప్రదించొచ్చు' అని ఏపీజీబీసీ ఉద్యానవనాధికారి భాస్కరరావు పేర్కొన్నారు.

# కొత్తూరులో మెగా పార్క్

అనకాపల్లి : గజిబిజి జీవనశైలిలో.. సాయంత్రం సేదతీరేందుకు జిల్లాలో ఆహ్లాదం కరవైంది. వారాంతాల్లో పిల్లలతో ఆటలాడేందుకు, సరదాగా గడిపేందకు అనకాపల్లిలో సరైన పార్కు ఒక్కటీ లేదు. అనకాపల్లి పట్టణ పరిధిలో మెగా పార్క్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పట్నుంచో ఉంది. గత ప్రభుత్వంలో పార్క్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ కల సాకారం కానుంది. జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొత్తూరులో మెగా పార్క్ ఏర్పాటుకానుంది. ఇందుకు సంబంధించి వీఎంఆర్‌డీఏ పరిపాలన అనుమతులు ఇచ్చింది.

**5.68 ఎకరాలు.. రూ.5.35 కోట్లు...** మెగా పార్క్ ఏర్పాటుకు కొత్తూరు పరిధిలో సర్వే నంబర్ 608లో ఏడు ఎకరాలకుపైగా జీవీఎంసీ స్థలం ఉంది. ఇదే అనువైనదిగా అధికారులు తాజాగా గుర్తించారు. 5.68



ఎకరాల్లో మెగా పార్క్ ఏర్పాటు చేయాలని విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఇటీవల తీర్మానం చేశారు. రూ.5.35 కోట్ల వ్యయంతో రెండు విడతలుగా నిర్మించనున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, యోగా చేసేందుకు యోగా ముద్రలతో అనువైన ప్రదేశం, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్, బాస్కెట్ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్ నిర్మించనున్నట్లు వీఎంఆర్‌డీఏ ఈఈ రాంబాబు చెప్పారు. జిల్లా అధికారుల సమక్షంలో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# 'ఆహార తయారీ'.. ఉపాధికి దగ్గర దారి..!

విశాఖపట్నం : ప్రైవేటు కళాశాలల్లో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఇక్కడ కేవలం రూ.30వేలు, అది కూడా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. దరఖాస్తుకు ఈనెల 17వతేదీ తుది గడువు.

1.అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సర్టిఫికెట్ ఇన్ కలినరీ ఆర్ట్స్ కోర్సు: పదో తరగతి విద్యార్హత. కోర్సు వ్యవధి ఆరు నెలలు. దక్షిణ, ఉత్తర భారత వంటలు, చైనీస్, పాశ్చాత్య వంటలు, కేకులు, బిస్కెట్లు, పాస్తా, సమోసా, మిఠాయిల తయారీలో శిక్షణ ఇస్తారు. ఆరునెలలు స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. శిక్షణ అనంతరం స్టార్ హోటళ్లలో



చెఫ్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

2.టెక్నిక్స్ ఇన్ కుకింగ్: ఈ విభాగంలో చేరేందుకు విద్యార్హత 8వ తరగతి. 25 వారాలపాటు శిక్షణ ఉంటుంది. శాఖాహార, మాంసాహార వంటల తయారీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు.

3.కేటరింగ్ మేనేజర్: రక్షణ రంగంలో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయబోయేవారు అర్హులు. రక్షణ రంగమే ఎంపిక చేసి శిక్షణ ఖర్చు భరిస్తుంది. ఆరునెలలపాటు శిక్షణ ఉంటుంది. వంటలతోపాటు, బేకరీ వస్తువులు, బిస్కెట్లు, పఫ్‌ల తయారీలో శిక్షణ ఇస్తారు. అనంతరం సొంతంగా క్యాటరింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగం చేయవచ్చు.

# రాయితీ మంత్రం.. ఆర్థిక ఉపశమనం

కొత్తవలస : నష్ట నివారణ, ఆదాయం పెంపు లక్ష్యంగా.. విద్యుత్తు అదనపు వినియోగం క్రమబద్ధీకరణకు రాయితీ ఇస్తూ.. ఈపీడీసీఎల్ చేసిన ప్రకటనకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. కొత్తగా ఇల్లు కట్టుకుని విద్యుత్తు మీటరు పొందాక, ఇంటి అవసరాల కోసం విద్యుత్తు ఉపకరణాలు, ఏసీ, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్ వంటి పరికరాలు అదనంగా వినియోగిస్తుండటంతో విద్యుత్తు వినియోగం బాగా పెరుగుతోంది. కనెక్షన్ కోసం దరఖాస్తులో పొందుపర్చిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనివల్ల విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతోంది. ఫలితంగా తరచూ లోఓల్టేజీ, సరఫరాలో అంతరాయం సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి లోడ్ క్రమబద్ధీకరణకు ఈపీడీసీఎల్ శ్రీకారం చుట్టింది.

**రూ. 42.88 లక్షల ఆదాయం..**

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ప్రకటిస్తూ.. ఇందుకోసం మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవాలంటూ ఈపీడీసీఎల్ వినియోగదారులను ఆహ్వానించింది. దీంతో జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లోని వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విజయనగరం డివిజన్ పరిధిలో 2,087 సర్వీసులకు 3880.47 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనివల్ల రూ.42.88 లక్షల ఆదాయం ఈపీడీసీఎల్‌కి సమకూరింది.

**లోడ్ ఇలా లెక్కిస్తారు..**

ఇంట్లో ఉన్న విద్యుత్తు పరికరాల వినియోగాన్ని బట్టి లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. ఒక కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంట్ రుసుము కింద రూ.2 వేలు, దరఖాస్తుకు రూ.50, అదనపు ఖర్చులు రూ.250 చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్‌కు రూ.2,500 చెల్లించాలి. 50 శాతం రాయితీతో రూ.1,250 వసూలు చేశారు.

**అధిక దరఖాస్తులు ఇక్కడే..**

13 మండలాల్లోకి కొత్తవలస సెక్షన్ నుంచి అధికంగా దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతం నుంచి అదనపు లోడు క్రమబద్ధీకరణకు 520 మంది విద్యుత్తు వినియోగదారులు 986.14 కి.వా.కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు రూ.8.77 లక్షలు డెవలప్‌మెంట్ ఛార్జీల కింద, రూ.2.11 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్‌గా జమచేశారు. అతితక్కువగా వంగర సెక్షన్ నుంచి నలుగురే దరఖాస్తు చేసుకుని రూ.10 వేలు డిపాజిట్ చెల్లించారు.

స్పందన బాగుంది.. అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. రూ.42.88 లక్షల ఆదాయం వచ్చింది. లోడు ఎంత భారమో తెలిస్తే, అనుగుణంగా చర్యలు చేపట్టి లోఓల్టేజీ సమస్య పరిష్కరించొచ్చు. అవసరమైన చోట నియంత్రికలు ఏర్పాటు చేస్తాం.
జిజి.సురేష్‌బాబు, కార్యనిర్వాహక ఇంజినీరు, విజయనగరం గ్రామీణం

## ఔషధ కోర్సులు.. ఉపాధి, ఉద్యోగాలకు బాటలు

బొమ్మనహాళ్ : ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ పాత్ర కీలకం. జేఎన్‌టీయూ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్‌ఐ) ఫార్మసీ కోర్సులను అందిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఔషధ విద్యాసంస్థలో అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలైన నైపర్ జేఈఈ, జీపాట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. ఇందులో నూతన ఔషధాల తయారీ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. నూతన ఔషధాల ఉత్పత్తి చేసిన మందులు మొక్కలు, జంతువులు, జలచరాలపై ప్రయోగిస్తుంటారు. ప్రస్తుత జీవన పరిస్థితుల్లో మధుమేహం, అధికరక్తపోటు, క్యాన్సర్ వంటి రోగాల బారినపడుతున్నారు. వాటి నివారణలో ఫార్మసీ నిరంతం కృషి చేస్తోంది. 1950కి ముందు ప్రజలకు అవసరమైన ఔషధాల్లో 90 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనేవారు. ప్రస్తుతం 90 శాతం ఔషధాలు విదేశాలకు మనదేశం నుంచి ఎగుమతి చేస్తున్నారు. ఫార్మసీ రంగం



ఏ స్థాయిలో వృద్ధి చెందిందో ఊహించవచ్చు.

**ఫార్మసీతో భవిష్యత్తు అవకాశాలు**

పారిశ్రామిక రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, మార్కెటింగ్, రెప్రజెంటివ్స్‌లో అవకాశాలున్నాయి. డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి అర్హులు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు. అకడమిక్ పరంగా బోధన, పరిశోధన, పరిపాలన రంగాల్లో అవకాశాలు ఉంటాయి. విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

**త్వరలో వసతి గృహాలు అందుబాటులోకి**

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫార్మసీ విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులోకి తెస్తున్నాం. నైపర్ జేఈఈ, జీప్యాట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వారికి సీట్లు కేటాయించిన తరువాత ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తాం. ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించే అవకాశముంది. ఆచార్య సుబ్బారెడ్డి, సంచాలకులు, ఓటీపీఆర్‌ఐ

## సరిహద్దులో ఆగిన తుంగభద్రమ్మ!

బొమ్మనహాళ్ : తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్ వద్ద ఆగాయి. హెచ్చెల్సీలో అత్యవసరంగా సాగుతున్న మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆంధ్రా వాటా నీరు తీసుకోవడంలో జాప్యం ఏర్పడుతోంది. 117వ కిలోమీటరు వద్ద జరగుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తికాలేదు. జలాశయంలో గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో



ఈసారి నీటి నిల్వను 80 టీఎంసీలకే పరిమితం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వెంటనే మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో డీఈఈ దివాకర్‌రెడ్డితో మాట్లాడుతూ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు.

## మన్నవరం.. వెన్ను విరిగింది

శ్రీకాళహస్తి : 'ఐదువేల మందికి ప్రత్యక్ష ఉపాధి.. పాతిక వేల మందికి పరోక్షంగా ఉపాధి.. వందలాది కుటీర పరిశ్రమల' ఏర్పాటు లక్ష్యంగా మన్నవరం విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ ఏర్పాటుకు ప్రారంభంలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. పరిశ్రమ ప్రారంభ సమయంలో ఎన్బీపీపీఎల్ ప్రతినిధులు, జాతీయస్థాయి అధికారులతో కళకళలాడగా ఇప్పుడు బోసిపోయింది. చివరకు భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను తొలగించి భారీ పరిశ్రమకు తాళాలు వేసి వదిలి పెట్టేశారు. పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూములను ప్రభుత్వం ప్రస్తుతం ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది.

**భూములు వెనక్కి ఎప్పుడో..?**

ఇక్కడి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం 750 ఎకరాల భూములను ఎకరా రూ.100 వంతున ఎన్బీపీపీఎల్ సంస్థకు అప్పగించింది. పరిశ్రమ ఏర్పాటుకు నిర్మించుకున్న భవనాలు వంద ఎకరాలు మినహాయించి 650 ఎకరాలు వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. కలెక్టర్ వెంకటేశ్వర్ నివేదిక మేరకు ఇక్కడ వెనక్కి తీసుకునే 650 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయి కొత్త పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం బాగుపడుతుందని సమీప గ్రామస్థులు ఆశలు పెంచుకున్నారు.

**కలగానే.. ఎన్బీపీపీఎల్ ఏర్పాటు**

విద్యుత్తు ఉత్పాదకంలో దిగ్గజ సంస్థలైన ఎన్టీపీసీ-భెల్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిందే ఎన్బీపీపీఎల్ విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ. 2010 సెప్టెంబరు ఒకటో తేదీన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ దీనికి భూమిపూజ చేశారు. రూ.6 వేల కోట్లు అంచనాలో రూ.1200 కోట్ల ఖర్చుతో మౌలిక వసతులు, యంత్రాలు ఏర్పాటు చేసి 2015లో ఉత్పత్తులు ప్రారంభించారు. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ విధానంలో విద్యుత్తు ఉత్పాదనకు అవసరమైన బొగ్గు-బూడిద నిర్వహణ పరికరాల తయారీ, టర్బైన్లు, జనరేటర్లు, బాయిలర్లు తయారీ ఈ పరిశ్రమ లక్ష్యం. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నేపథ్యంలో దిగ్గజ సంస్థల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ లేకపోవడంతో ఈ సంస్థ ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. ఇన్నాళ్లూ కొంతమేర అధికారులు వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం భారీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు తాళాలు వేసేశారు. కనీసం భద్రతా సిబ్బంది ఉండటం లేదు.

# ఏటా ముంపు.. ఏదీ కనువిప్పు!



కదిరి : ఆకాశంలో మబ్బులు కమ్మినా.. చినుకు రాలినా పురప్రజలు వణుకుతున్నారు. ఎక్కడ వరద ముంచేస్తుందోనని భయపడుతున్నారు. కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణాలకు ఎగువన పెద్ద చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు నిండి మరువలు పారితే వరద పట్టణాలను ముంచెత్తుతోంది. దీనికి వాగులు, ఇరిగేషన్ కాలువలు ఆక్రమణకు గురవటమే కారణం. పట్టణాలకు ఆనుకుని ఉన్న కాలువలు, వాగులను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అవి కుంచించుకుపోయాయి. ఫలితంగా వరదతో లోతట్టు ప్రాంతాలు జలమయమై పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. వరదలప్పుడు మాత్రమే అధికారులు సహాయక చర్యలు, పాలకులు పరామర్శలతో హడావుడి చేస్తున్నారు. తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారులు సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి వాగులు, కాలువలను సంరక్షించి, వరద ముప్పు నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కదిరికి తూర్పున విఠలరాయునిచెరువు, దక్షిణం వైపు దేవరచెరువు ప్రధానమైనవి. వర్షపు నీటితో నిండే చెరువుల మరువలు కదిరి మీదుగా ప్రవహిస్తాయి. నివాసాలకు చేరువలోని మద్దిలేరు వాగులో సున్నపుగుట్ట ప్రదేశంలో వరద కలుస్తుంది. రాయచోటి రోడ్డు నుంచి పట్టణ శివారు వరకు మద్దిలేరు వాగు ఆక్రమణకు గురైంది. సున్నపుగుట్టతండా వరకు 30 మీటర్లు, ఆ తర్వాత 40 మీటర్లు ఉండాల్సిన వాగు సగానికి మించి అన్యాక్రాంతమైంది. దీంతో అరవ గుడిసెలు, నానాదర్గా, శివాలయం, వాసవీనగర్, కోనేరు తదితర ప్రాంతాల జనం వరద ముప్పుతో భీతిల్లుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువ సర్వే, ఆక్రమణ కాకుండా రాతి కట్టడానికి రూ.2.50 కోట్లతో చేపట్టిన ప్రణాళిక ప్రతిపాదనలతోనే ఆగింది

సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఆనుకుని చిత్రావతి ప్రవహిస్తోంది. పట్టణం వైపున ప్రభుత్వ స్థలంతోపాటు నది లోతట్టు స్థలాన్ని ఆక్రమించారు. నది అంచుల్లోకి వ్యర్థాలను తరలించటం, స్థలం ఏర్పడ్డాక కబ్జా చేస్తున్నారు. దీంతో చిత్రావతి విస్తీర్ణం తగ్గిపోయి పట్టణానికి వరద ముప్పు పొంచి ఉంది.

బుక్కపట్నం చెరువు ప్రధాన మరువ కొత్తచెరువుకు ఆనుకుని వెళుతుంది. గ్రామానికి ఆవలివైపు ఇరిగేషన్ స్థలం ఆక్రమణతో వాగు కుంచించుకుపోయింది. వరద ప్రవాహం నివాసాల వైపు దూసుకొస్తుండటంతో ఆందోళన రేకెత్తిస్తోంది.

ధర్మవరం చెరువు లోతట్టులో నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువు విస్తీర్ణం తగ్గటంతో ఎగువ నుంచి వచ్చే వరదనీరు పట్టణంలోని లోనికోట సమీప నివాసాలను ముంచెత్తుతోంది.

**త్వరలోనే తొలగింపు చర్యలు..**

త్వరలోనే వాగులు, కాలువల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతాం. పుట్టపర్తి సమీప చిత్రావతి, కదిరికి ఆనుకుని ఉన్న మద్దిలేరుతో పాటు ఇతర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన కాలువలను గుర్తిస్తున్నాం. అందరి సహకారంతో ఆక్రమణలు తొలగిస్తాం. గురుమూర్తి, ఇరిగేషన్ ఈఈ

# మారని సంక్షేమ రూపురేఖలు



అనంతపురం : బడులు మొదలై నెల పూర్తయింది. పిల్లలందరూ బడి బాట పట్టారు. కానీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతు పనులు నెలలు గడుస్తున్నా మెరుగు పడట్లేదు. మామూలుగా అయితే.. వేసవి సెలవులు పూర్తి అయి విద్యార్థులు వసతి గృహాల్లో చేరే సమయానికే ఇవి పూర్తి కావాల్సి ఉంది. కొన్నింటిలో పనులు ప్రారంభం కాలేదు. ఐదేళ్ల వైకాపా హయాంలో వసతి గృహాల్లో కనీసం సున్నం కొట్టడానికి కూడా నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వసతి గృహాల్లో రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో నిధులు భారీగా మంజూరు అయ్యాయి. కానీ ఇచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించడంలో వైఫల్యం చెందుతున్నారు. వెలిసి పోయిన రంగులు, ఊడుతున్న పెచ్చులు వంటి సమస్యలు అలానే పీడిస్తున్నాయి.

**ఏదీ అప్పటి చొరవ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం జిల్లాలో 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు, 1 రెసిడెన్సియల్ పాఠశాలకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరు చేయగా వసతి గృహాల్లో అత్యవసరం అయిన మరమ్మతు పనులు వేగంగా చేశారు. రెండో విడతలో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులపై చొరవ చూపడం లేదు. గుత్తేదారులకు బిల్లులు కాలేదన్న ఉద్దేశంతో పనులపై శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులకు వసతులు దూరమయ్యాయి.

**విద్యార్థులకు ఆటంకం**

అనంతపురం సాయినగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పలు రకాల మరమ్మతు పనులకు రూ.16.20 లక్షలు మంజూరు అయ్యాయి. గత సంవత్సరంలోనే నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఏడు నెలలు కావొస్తోంది. ఇంకా పనులు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వసతి గృహాల్లో ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు వసతికి ప్రతిబంధకంగా మారింది. స్లాబుకు మరమ్మతులు చేయగా ఇటీవల మళ్లీ పెచ్చులు ఊడాయి.

# ప్రతిపాదిస్తూ.. సుందరీకరిస్తూ..!

కుప్పం : 'ఆదర్శ పురపాలికగా కుప్పాన్ని మార్చడమే లక్ష్యం.. ప్రతిపాదనలు పంపండి.. ఎంత అడిగితే అంత ఇస్తాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా పంపిన ప్రతిపాదనలకు నిధులను విడుదల చేస్తూ అనేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదర్శ కుప్పానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. పురపాలికలో ఇప్పటికే రోడ్లు, తాగునీటి బోర్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నారు.



**లక్ష్యంతో ముందుకెళ్తూ..**

కుప్పం శ్మశాన వాటికను అభివృద్ధి చేసి.. బర్నింగ్ కేంద్రం ఏర్పాటు, తితిదే ద్వారా పురపాలికలోని 25 ఆలయాల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీల గృహాలకు సౌర విద్యుత్తును వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పుర పరిధిలోని మూడు ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి డిసెంబరు, ఎన్టీఆర్ సుజల పథకం ఆగస్టు, ఏరియా ఆస్పత్రి పనులు డిసెంబరు నాటికి పూర్తి చేసే దిశగా అడుగులేస్తున్నారు.

**ఏళ్లుగా నిలిచిన పనులకు మోక్షం**

ఏళ్లుగా నిలిచిన ప్రధాన రహదారి విస్తరణ, ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి, షాపింగ్ కాంప్లెక్స్, జమిందారు పార్కు, 10 ప్రధాన కూడళ్ల అభివృద్ధి, ఈ-బస్సులు, భూగర్భ కాలువలు, భూగర్భ విద్యుత్తు లైన్లు, గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**పూర్తైన లక్ష్యాలు ఇవీ..**

పురపాలికలో రూ.2.59 కోట్లతో 3950 వీధి దీపాలు, రూ.66 లక్షలతో అన్న క్యాంటీన్, రూ.1.40 కోట్లతో ఆర్అండ్‌బీ భవనం, రూ.5 కోట్లతో నర్వ్ కేంద్రం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కాలువలు, అమృత్ 2.0 నీటి సరఫరా కార్యక్రమాలు చేపట్టి లక్ష్యాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**క్రీడలకు ప్రాముఖ్యం..**

కుప్పంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయనున్నట్లు అధికారుల అంచనా. అలాగే నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**ప్రపంచస్థాయి సదుపాయాలు**

ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కుప్పం పురపాలికను ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నాం. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని కడా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్వర్ణ కుప్పం లక్ష్యంగా పని చేస్తున్నాం. వికాస్ మర్మత్, కడా పీడీ, కుప్పం

## అదనపు బాధ్యతలు ఎన్నాళ్లు?!

విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా వెలుగొందుతున్న సింహాచలం క్షేత్రానికి పూర్తి స్థాయి 'ఈవో'ను నియమించడంలో అంతులేని తాత్సారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో త్రినాథరావుకు ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారే తప్ప శాశ్వత అధికారిని నియమించలేదు. దీంతో ఆలయ పాలన గాడి తప్పుతోందనే విమర్శలొస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటివరకు 14 మందికి ఈవోలుగా బాధ్యతలప్పగించారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందుకు కొనసాగిస్తున్నారు?:** ఇటీవలి బదిలీల్లో ఈవోగా కొత్తగా ఎవర్నీ నియమించలేదు. గతంలో పనిచేసిన వి.త్రినాథరావును రాజమహేంద్రవరం ఆర్జేసీగా నియమించారు. అలాగే.. సింహాచలం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలప్పగించారు. పలు ఉత్సవాల నిర్వహణలో ఆయన విమర్శలు మూటకట్టుకున్నా కొనసాగించడం గమనార్హం. 2023లో చందనోత్సవ సమయంలోనూ త్రినాథరావే ఈవోగా ఉ



న్నారు. ఆ సమయంలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దీనిపై అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అందులో ఈవో త్రినాథరావు పర్యవేక్షణ లోపాన్ని కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం మారినా ఆయనే ఈవోగా కొనసాగారు. ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణ సమయానికి సెలవుపై అమెరికాకు వెళ్లారు. ఉత్సవ తేదీ ప్రకటించాక అన్ని రోజులు సెలువు మంజూరు చేయడం దేవాదాయశాఖలో చర్చనీయాంశమైంది.

**వరుస ఘటనలతోనైనా:** సింహగిరిపై ఏప్రిల్ 30న చందనోత్సవ సందడి నెలకొన్న తరుణంలో... భక్తులు నిల్చున్న చోట ఒక్కసారిగా గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల గిరి ప్రదక్షిణ నేపథ్యంలో తొలిపావంచా వద్ద ఇనుప రాడ్లతో నిర్మించిన భారీ షెడ్డు కుప్ప కూలింది. ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో శాశ్వత అధికారి నియామకం మరోసారి తెరపైకి వచ్చింది. మరో వైపు కొండపైనా, దిగువన ప్రసాద్ పథకంలో రూ.50 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పంచగ్రామాల్లో ఆలయానికి విలువైన భూములున్నాయి. వేపగుంటలో వీఎంఆర్‌డీఏతో కలిసి పరిష్కరించాల్సిన 140 ఎకరాల భూసమస్య ఉంది. వీటన్నింటి పర్యవేక్షణకు కీలక అధికారి ముఖ్యం.

## పరీక్ష పెట్టారు.. ఫలితాలు మరిచారు..!

అనకాపల్లి : సాధారణంగా వార్షిక పరీక్షలు పూర్తయిన వారం, పది రోజుల నుంచే విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం( స్పాట్ వాల్యుయేషన్) ప్రారంభమవుతుంది. రెండు నెలల్లోపు ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇక్కడ పరీక్షలు జరిగి మూడు నెలలైనా ఫలితాలు వెల్లడి కాలేదు. దీంతో అసలు మూల్యాంకనం ప్రారంభమైందా.. జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా అనే సందేహాలు విద్యార్థుల్లో నెలకొన్నాయి. **మూల్యాంకనం పూర్తయ్యేదెప్పుడో..:** ఏయూ దూర విద్యా కేంద్రం ఈ ఏడాది ఏప్రిల్ 25న యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించింది. యూజీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ బీకామ్ 4707, బీఏ 4208, బీఎస్సీ 8739 మొత్తం 17,654 మంది పరీక్షలు రాశారు. పీజీలో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఎమ్మెస్సీ 3100, ఎంఏ 1958, ఎంబీఏ 1104, ఎంకామ్ 219 మంది మొత్తం 6381 మంది పరీక్షలు రాశారు. యూజీ, పీజీ కలిపి మొత్తం 24,035 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరికి సంబంధించి 1,94,688 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇన్ని పత్రాలను మూల్యాంకనం చేయాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. ఇప్పుడు ప్రారంభించినా ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించడానికి నవంబరు, డిసెంబరు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ఈలోగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నోటిఫికేషన్ పడితే




తాము నష్టపోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

**లాభదాయక విభాగంపై శీతకన్ను..:** ఆంధ్రవిశ్వవిద్యాలయానికి లాభాన్ని చేకూర్చే విభాగాల్లో దూర విద్యా కేంద్రం ముందుంటుంది. దీని ద్వారా ఏటా రూ.40కోట్ల నుంచి రూ.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ మొత్తంలో 70శాతం విద్యార్థుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో దూర విద్యా కేంద్రం బ్యాంకు ఖాతా ఆకేంద్రం సంచాలకుల ఆధీనంలో ఉండేది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆ ఖాతాను మెయిన్ క్యాంపస్ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో దూరవిద్య విద్యార్థులకు కనీసం సబ్జెక్టు పుస్తకాలు కూడా సమకూర్చలేకపోతున్నారు. స్టేషనరీ కొనుగోలు సైతం వీసీ దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సి వస్తోందని ఓ ఉద్యోగి వాపోయారు.

**త్వరితగతిన పూర్తి చేస్తాం..:** ఈ విషయమై ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకుడు ఆచార్య బీఏ నాయుడి వివరణ కోరగా శుక్రవారం నుంచి పీజీ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించామన్నారు. క్రమపద్ధతిలో మిగతా కోర్సుల జవాబుపత్రాలు కూడా పూర్తి చేస్తామన్నారు. ఫలితాలు వెల్లడించాలని విద్యార్థుల నుంచి ఒత్తిడి ఉందని, ఉద్యోగుల బదిలీలు, చేరికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

## రేణు దేశాయ్ రెండో పెళ్లి గురించి ఏమి చెప్పారు అంటే ?

టాలీవుడ్ పవర్ స్టార్ మాజీ భార్య, సీనియర్ యాక్ట్రెస్ రేణూ దేశాయ్ గురించి అందరికీ తెలిసిందే. నటిగా, నిర్మాతగా దర్శకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తల్లిగా స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పవన్ తో విడిపోయిన తర్వాత పిల్లలు అకీరా నందన్, ఆద్యతో కలిసి జీవిస్తున్నారు. అయితే తన పిల్లలు రెండో పెళ్లి చేసుకోమని ఎప్పటి నుంచో చెబుతున్నా, తాను వారు కోసం చేసుకోవడం లేదని ఇప్పటికే పలుమార్లు తెలిపారు. ఇప్పుడు మరో వివాహంపై క్లారిటీ ఇచ్చారు. అందుకు సంబంధించిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తెగ చక్కర్లు కొడుతున్నాయి. తాను రెండో పెళ్లి చేసుకోవడానికి పూర్తి సిద్ధంగా ఉన్నానని రేణూ దేశాయ్ తెలిపారు. అందుకు మరి కొన్నేళ్లపాటు వెయిట్ చేయాలని డిసైడ్ అయినట్లు చెప్పారు. రెండు మూడేళ్లలో పెళ్లి చేసుకుంటానని, తనకు ఓ మ్యారేజ్ లైఫ్ ఉండాలని, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. అందుకే మళ్లీ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, పిల్లల కోసమే ఇప్పటివరకు



చేసుకోలేదని మరోసారి క్లారిటీ ఇచ్చారు. కానీ మళ్లీ పెళ్లి చేసుకోవాలని కుటుంబం నుంచి ఒత్తిడి వచ్చినా కూడా.. అప్పట్లో పిల్లలు చిన్నవారు కావడంతో వాళ్లను వదిలి కొత్త జీవితం ప్రారంభించడం కరెక్ట్ కాదని అనిపించిందని అన్నారు. అలా చేస్తే తన ఇద్దరు పిల్లలు ఒంటరితనంతో బాధపడతారనిపించిందని భావోద్వేగంగా గురయ్యారు. అయితే అకీరా, ఆద్య కూడా పెళ్లి చేసుకోమంటున్నారని తెలిపిన రేణు.. తన పిల్లలు కూడా మద్దతుగా ఉండటం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వారిద్దరూ రెండో పెళ్లి విషయంలో చాలా పాజిటివ్ గా ఉన్నారని అన్నారు. ఎవరితో సంతోషంగా ఉంటావో వాళ్లను పెళ్లి చేసుకోమని చెప్పగా, తనకు ధైర్యంగా ఉందన్నారు. మరి కొన్ని సంవత్సరాల తర్వాత పూర్తి స్వేచ్ఛ వస్తుందని, అప్పుడు కొత్త జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. పిల్లలు కాలేజ్ కు వెళ్తే వాళ్లకు కొత్త వరల్డ్ ప్రారంభవుతుందని చెప్పిన రేణూ.. తల్లిదండ్రులపై డిపెండెంట్ గా ఉండరని అన్నారు. అలాంటి సమయంలో తాను కూడా జీవితాన్ని ఆనందించగలుగుతానంటూ చెప్పుకొచ్చారు. అయితే, రేణు దేశాయ్.. పవన్ కళ్యాణ్ తో బద్రి సినిమాలో యాక్ట్ చేసిన టైమ్ లో లవ్ లో పడ్డారు. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కానీ కొంతకాలం తర్వాత పరస్పర అంగీకారంతో విడిపోయారు.

## దేవియాని హై గ్లామర్ డోస్.. అన్‌స్టాపబుల్!

నార్త్ బ్యూటీ దేవియాని శర్మ సోషల్ మీడియాలో తనదైన స్టైల్‌తో క్రేజ్‌ను పెంచుకుంటూ దూసుకెళ్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. డిఫరెంట్ లైటింగ్‌తో, మోడర్న్ స్టైలింగ్‌లో దేవియాని ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. క్లాస్, గ్లామర్ ను మిక్స్ చేసిన ఈ లుక్‌కి కామెంట్స్ వర్షం కురుస్తోంది. 'షార్ప్', 'అటిట్యూడ్ కిల్లింగ్', 'అన్‌స్టాపబుల్ గ్లామర్' అంటూ అభిమానులు తెగ కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటోల్లో దేవియాని తన మూడీ మూడ్‌కి తగ్గట్లుగా, హాలీవుడ్ స్టైల్‌లో స్టైలింగ్ చేసుకుంది. చక్కగా వుండే కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, డీప్ బ్రౌన్ లిప్‌షేడ్ ఆమె లుక్స్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. ఫోటోషూట్ మాత్రమే కాదు, ఆమె క్యాప్షన్ కూడా అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. "జీవితంలో



ఎదురైన కష్టాలే నాకు బలం.. ఇప్పుడు నాకు నేనే ముఖ్యం" అంటూ దేవియాని రాసిన మాటలు ఆమె స్వాభిమానాన్ని చాటుతున్నాయి. వెబ్ సిరీస్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన దేవియాని 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్' వంటి హిట్ కంటెంట్ ప్రాజెక్ట్స్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆమె నటన, బాడీ లాంగ్వేజ్, ఇంటెన్స్ క్యారెక్టర్లపై అందరికీ మంచి ఇంప్రెషన్ వచ్చింది. ఈ సక్సెస్‌తో ఆమెకు ఇతర భాషల నుంచి కూడా మంచి ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో ఓ మిడ్ రేంజ్ హీరోతో కీలక పాత్రలో నటిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆన్ స్క్రీన్‌లో అంతగా లిమిట్స్ పెట్టుకోని దేవియాని, గ్లామర్‌కు సంబంధించిన పాత్రలపైనా ఓపెన్‌గా స్పందిస్తూ వస్తోంది. తాను ఎలాంటి ఛాలెంజింగ్ రోల్స్‌కైనా సిద్ధమనే దిశగా, ఇలాంటి ఫోటోషూట్స్ చేస్తూ క్యారెక్టర్ బిల్డప్ చేస్తోంది. ఆమె తనకు తానే మార్కెటింగ్ చేసుకుంటూ, సోషల్ మీడియాలో స్ట్రాంగ్ ఫాలోయింగ్‌తో ఓ ప్రత్యేకమైన క్రేజ్‌ను నిలబెట్టుకుంటోంది.




## 'రామాయణం'లో కుంభకర్ణుడిగా?



నితీష్ తివారీ రామాయణం సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. టీజర్ లో రణ్ బీర్ ని శ్రీరాముడిగా ఆవిష్కరించాడు నితీష్. మొదటి గ్లింప్స్‌లో, రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుండగా, యష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపిస్తారని నిర్మాతలు ఇప్పటికే వెల్లడించారు. అయితే ఈ సినిమాలో కుంభకర్ణుడి పాత్రలో ఎవరు నటిస్తారు? అనేదానికి ఇంకా సమాధానం రాలేదు. ఈ పాత్రలో యానిమల్ లో అబ్రార్ పాత్రతో ఆకట్టుకున్న బాబి డియోల్ నటించే అవకాశం ఉందని చాలా కాలంగా పుకార్లు ఉన్నాయి. అయితే ఇది నిజమా? అంటే... ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక కన్ఫర్మేషన్ లేదు. బాబి డియోల్ రామాయణంలో నటిస్తున్నాడా లేదా? అన్నదానికి ఇప్పటికీ స్పష్టత లేదు. ఒకవేళ బాబీకి అవకాశం కల్పించినా కుంభకర్ణుడి పాత్రలో కనిపిస్తాడా? అనేదానికి క్లారిటీ లేదు. ప్రస్తుతానికి బాబి డియోల్ తో నితీష్ బృందం ఎలాంటి చర్చలు జరపలేదని కథనాలొస్తున్నాయి. ఒక పోర్టల్ లో "రిపోర్టులు తప్పు. అతడి పేరు అకస్మాత్తుగా బయటపడింది" అని రాసారు. రెండు భాగాలుగా రూపొందుతున్న రామాయణం 2026-27 సీజన్ లో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా గుర్తింపు పొందింది.

ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగం 2026 దీపావళిన విడుదల కానుంది. రెండవ భాగం 2027 దీపావళిన పెద్ద తెరలపైకి వస్తుంది. ఈ రెండు భాగాలకు కలుపుకుని 1600 కోట్ల బడ్జెట్ ఖర్చు కానుందని ఇటీవల కథనాలొచ్చాయి. ఇక బాబీ డియోల్ కెరీర్ మ్యాటర్ కి వస్తే, అతడు ఇటీవల బాలీవుడ్ సినిమాలతో పాటు సౌత్ సినిమాల్లోను నటిస్తున్నాడు. చివరిగా కంగువ, హౌస్‌ఫుల్ 5 లో కనిపించాడు. తదుపరి హరి హర వీర మల్లు: పార్ట్ 1, ఆల్ఫా, జన నాయగన్ వంటి భారీ చిత్రాలలో నటిస్తున్నాడు. హరి హర వీర మల్లు: పార్ట్ 1, ఆల్ఫా ఈ సంవత్సరం విడుదల కానుండగా, జన నాయగన్ 2026 లో పెద్ద తెరపైకి రానుంది.

## రసవత్తరంగా దీపావళి బాక్సాఫీస్ ఫైట్..?





పండగ వచ్చింది అంటే సినిమాల రిలీజ్ లతో ఆ పండుగ శోభని మరింత పెంచుతారు. తెలుగు రాష్ట్రాల్లో అయితే ఇయర్ మొదట్లో వచ్చే సంక్రాంతి నుంచి ఇయర్ ఎండింగ్ వచ్చే క్రిస్ మస్ వరకు పండగకి సినిమాల రిలీజ్ టార్గెట్ చేసుకుని వస్తాయి. సంక్రాంతి తర్వాత దసరా కి ఫైట్ బాగుంటుంది. క్రిస్మస్ రేసులో కూడా సినిమాల హంగామా తెలిసిందే. ఐతే అదే క్రమంలో దీపావళికి కూడా సినిమాల మధ్య పోటీ ఏర్పడుతుంది.

అంతకుముందు ఏమో కానీ లాస్ట్ ఇయర్ దీపావళికి 3 సినిమాలు రిలీజ్ అవగా అవన్నీ సక్సెస్ అయ్యాయి. తెలుగు యువ హీరో కిరణ్ అబ్బవరం నటించిన క, దుల్కర్ సల్మాన్ చేసిన లక్కీ భాస్కర్ తో పాటు కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్ నటించిన అమరన్ కూడా సూపర్ హిట్ అయ్యింది. ఐతే ఈసారి కూడా అదే తరహాలో సినిమాలు పోటీకి దిగుతున్నాయని తెలుస్తుంది. దీపావళికి కానుకగా మళ్లీ కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ ని రిలీజ్ ఫిక్స్ చేసుకున్నాడు. ఆల్రెడీ లాస్ట్ దీపావళికి క తో వచ్చి హిట్ అందుకున్న కిరణ్ అబ్బవరం ఈసారి కె ర్యాంప్ తో మరో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. ఇక ఈసారి కిరణ్ తో పోటీ పడేందుకు కోలీవుడ్ యువ హీరో ప్రదీప్ రంగనాథ్ దిగుతున్నాడు. అంతకుముందు లవ్ టుడే ఈమధ్యనే వచ్చిన డ్రాగన్ సినిమాలతో ప్రదీప్ తెలుగులో కూడా సూపర్ ఫాలోయింగ్ ఏర్పరచుకున్నాడు. ఆ హీరోతో మైత్రి మేకర్స్ నిర్మిస్తున్న బైలింగ్వెల్ సినిమా డ్యూడ్ దీపావళికి రిలీజ్ ఫిక్స్ చేశారు. కిరణ్ కె ర్యాంప్, ప్రదీప్ రంగనాథ్ డ్యూడ్ తో పాటు సూర్య ఆర్జె బాలాజి కాంబోలో వస్తున్న కరుప్పు కానీ.. కార్తి సర్దార్ 2 కానీ రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ఇద్దరిలో ఒకరు వస్తే మరొకరు ఆగే ఛాన్స్ ఉంది. సో కిరణ్ అబ్బవరంతో పాటు తమిళ హీరోలు పోటీకి దిగుతున్నారు. మరి ఈ ఇంట్రెస్టింగ్ ఫైట్ లో ఈసారి ఎవరు గెలుస్తారు. తెలుగు ఆడియన్స్ కి ఏ సినిమా ఎంటర్టైన్మెంట్ అందిస్తుంది అన్నది చూడాలి. తెలుగు ప్రేక్షకులకు నచ్చితే అది డబ్బింగ్ సినిమానా స్ట్రైట్ సినిమానా అన్నది చూడరు. అలా ఇంతకుముందు చాలా సినిమాలు అద్భుతాలు సృష్టించాయి. మరి ఈసారి ఏం జరుగుతుందో చూడాలి.

## అప్పుడు హీరోయిన్‌గా.. ఇప్పుడు స్పెషల్ సాంగ్‌లో!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమాల్లో ది రాజా సాబ్ కూడా ఒకటి. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. మామూలుగా అయితే ఈ సినిమా ఎప్పుడో రిలీజవాల్సింది కానీ మధ్యలో కొన్ని కారణాల వల్ల షూటింగ్ లేటైంది. ఇప్పుడు తిరిగి మళ్లీ పరిస్థితులు అనుకూలించడంతో రాజా సాబ్ ను వేగంగా పూర్తి చేసే పనిలో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. హార్రర్ కామెడీ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలున్నాయి. ప్రభాస్ తన కెరీర్లోనే మొదటి సారి ఈ జానర్ లో సినిమా చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని ఎప్పట్నుంచో అంటున్న సంగతి తెలిసిందే. రాజా సాబ్ లో స్పెషల్ సాంగ్ ఉందని తెలిసినప్పటి నుంచి అందులో ఏ హీరోయిన్ నటిస్తుందా అని తెలుసుకోవడానికి అందరూ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వార్తల్లోకి వచ్చాయి. అయితే ఇప్పుడు



రాజా సాబ్ లోని స్పెషల్ సాంగ్ చేయబోయే హీరోయిన్ గా మిల్కీ బ్యూటీ తమన్నా పేరు వినిపిస్తోంది. ఈ మధ్య వరుస పెట్టి స్పెషల్ సాంగ్స్ చేస్తూ ఐటెం సాంగ్స్ కు కేరాఫ్ గా మారిన తమన్నా రాజా సాబ్ లో ప్రభాస్ తో కలిసి కాలు కదుపుతుందని అంటున్నారు. రాజా సాబ్ లోని స్పెషల్ సాంగ్ షూటింగ్ డేట్స్ కోసం చిత్ర యూనిట్ తమన్నాతో చర్చలు జరిపారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో నిజమెంతన్నది తెలియాలంటే రాజా సాబ్ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. కాగా గతంలో ప్రభాస్ కు జోడీగా తమన్నా మూడు సినిమాల్లో నటించారు. రెబల్, బాహుబలి1, బాహుబలి2లో ప్రభాస్ కు జోడీగా నటించిన తమన్నా ఇప్పుడు ప్రభాస్ పక్కన స్పెషల్ సాంగ్ చేస్తుందని వార్తలు వస్తుండగా అందరికీ ఈ సాంగ్ పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఇక రాజా సాబ్ సినిమా విషయానికొస్తే ఈ సినిమాలో ప్రభాస్ ను డైరెక్టర్ మారుతి వింటేజ్ లుక్ లో చూపించబోతున్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతుంది. రాజా సాబ్ లో ప్రభాస్ సరసన మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ సినిమాలో కీలకపాత్రలో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 5న రిలీజ్ కానున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు.

## అందాల పూజ.. ప్యాకప్ మోడ్ పిక్ చూశారా?

హీరోయిన్ పూజా హెగ్డే గురించి అందరికీ తెలిసిందే. ఒకప్పుడు వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న ఆమె.. మధ్యలో వివిధ సినిమాలతో నిరాశపరిచారు. మళ్లీ ఇప్పుడు వరుస ప్రాజెక్టులతో బిజీగా అయ్యారు. వివిధ సినిమా షూటింగ్స్ లో పాల్గొంటున్న అమ్మడు.. మరిన్ని చిత్రాలను లైన్ లో కూడా పెడుతున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న జన నాయగన్ లో హీరోయిన్ గా నటిస్తున్న పూజ.. సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీలో స్పెషల్ సాంగ్ లో కనిపించనున్నారు. రాఘవేంద్ర లారెన్స్ కాంచన -4లో కూడా పూజ యాక్ట్ చేస్తోంది. రీసెంట్ గా మరో స్టార్ హీరో ధనుష్ మూవీ లో ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా పూజ పెట్టిన క్రేజీ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మిర్రర్ సెల్ఫీ పోస్ట్ చేసిన బ్యూటీ.. ప్యాక్ అప్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. మేకప్ లేకుండా.. సింపుల్ గా.. వైట్ అండ్ బ్లాక్ టీ షర్ట్




తో కనిపించిన అమ్మడు.. నెటిజన్లను ఆకట్టుకుంటోంది. తన నేచురల్ అందంతో మెప్పిస్తోంది. కానీ షూటింగ్ లో పాల్గొని అలసిపోయినట్లు మాత్రం కనిపించింది. ఎండ్-ఆఫ్‌డే మిర్రర్ స్నాప్ తీసుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం ఆమె పోస్ట్ వైరల్ గా మారగా.. నెటిజన్లు రెస్పాండ్ అవుతున్నారు. మిర్రర్ సెల్ఫీ బాగుందని మేడమ్ అని చెబుతున్నారు. మంచి హిట్స్ అందుకోవాలని కోరుకుంటున్నారు. కాగా, ఒకప్పుడు తెలుగులో బ్లాక్ బస్టర్స్ హిట్స్ అందుకున్న బ్యూటీ.. స్టార్ హీరోలతో ఆడిపాడింది. వరుస ఛాన్స్ లు అందుకున్న పూజ.. ఇప్పుడు మాత్రం తెలుగులో కనిపించడం లేదు. పలు చిత్రాల్లో నటిస్తున్నా.. అవి వేరే భాషలకు చెందినవే. ఆ మధ్య టాలీవుడ్ యంగ్ హీరోలు నాగచైతన్య, విజయ్ దేవరకొండ సినిమాల్లో పూజ నటిస్తారని వార్తలు వచ్చినా అనౌన్స్మెంట్స్ రాలేదు. మరి ఆమె తెలుగు సినిమాల్లో ఎప్పుడు ప్యాకప్ చెప్పే టైమ్ వస్తుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536